# జనబలం

ప్రజలే ప్రభువులు


అక్టోబర్ 2023 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-




## జమిలి ఎన్నికల వల్ల ఏమిటి ప్రయోజనం?




## మార్పు కోసం మహిళా సాధికారత




## ఇస్రో, మిగతా ప్రభుత్వ సంస్థల మధ్య ఎందుకింత తేడా?

## చంద్రబాబు ఎపిసోడ్‌లో పాఠాలు




## GPS బిల్లుకు ఆమోదం



# గాంధీ - యువత

రాజకీయాలు ఎప్పుడూ ప్రజల బాగు, సమాజ ప్రగతి కోసం ఉపయోగపడే పవిత్ర వ్యాసంగమని గాంధీజీ భావించేవారు. అందుకోసం తన వ్యక్తిగత జీవితాన్ని పక్కనపెట్టి సర్వసంగ పరిత్యాగిలా దేశం కోసం పాటుపడ్డారు. అయితే అలా మొత్తంగా సొంత జీవితాన్నే వదిలేయటం, లేకపోతే అసలు సమాజాన్నే పట్టించుకోకపోవటం.. రెండూ ఆదర్శ ధోరణులు కావు. అందులోనూ ఈవేళ్ల ఆధునిక కాలంలో. అందుకే ప్రస్తుత యువతకి చెప్పేది - మీరు గాంధీ గారిలా గొప్ప త్యాగాలు చేయనక్కర్లేదు. వ్యక్తిగతంగా తెలివైన స్వార్థంతో వ్యవహరిస్తూ చట్టబద్ధంగా మీ ఆదాయాల్ని, సుఖాల్ని చూసుకోండి. అదే సమయంలో మీ స్వార్థం కోసమే.. మంచి చదువు, ఇంట్లో అందరికీ నాణ్యమైన ఆరోగ్యం, భద్రత, మంచి ఆదాయాలు, మెరుగైన భవిష్యత్తు కోసమే చుట్టూ ఉన్న సమాజాన్ని, ప్రభుత్వాల విధానాల్ని కొంత పట్టించుకోండి. ప్రజాస్వామ్యం వికసించాలంటే పరస్పర అవగాహన, హేతుబద్ధమయిన చర్చ, శాంతియుతంగా, సామరస్యంగా పరిష్కారాన్ని సాధించే ఓర్పు, చాకచక్యం అవసరం. హింస, ద్వేషం ఎన్నడూ సత్ఫలితాలనివ్వవు. కంటికి కన్నే బదులయితే, లోకమంతా గుడ్డిదవుతుంది. పుట్టిన ప్రతి బిడ్డకి ఎదిగే అవకాశాలనివ్వటం, నివారించదగ్గ కష్టాలని తొలగించి కన్నీళ్ళు తుడవటం - ఇవి గాంధీజీ చూపిన మార్గాలు. ఇందుకు గాంధీ ఆలోచనల్ని, ఆయన వ్యక్తిత్వాన్ని, దూరదృష్టి, శాంతియుత ధోరణి, ఇతరులతో సమన్వయ శక్తి వంటి వాటిని అర్థం చేసుకోండి. ప్రపంచమంతా ఈ రకంగా గాంధీ ఆలోచనల్లోని లోతును ఉపయోగించుకుని తమ సమాజాల్ని, వ్యవస్థల్ని మెరుగుపరచుకునేందుకు కృషి చేస్తున్నారు. ఆ పని మన దేశంలో ఇప్పటికీ మొక్కుబడిగానే చేస్తున్నాం. ఈ లోపాన్ని సరిదిద్దుకుందాం. అధికార కేంద్రీకరణ, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే, ప్రత్యర్థులను ద్వేషించే రాజకీయం, సమాజంతో సంబంధం లేకుండా పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) వంటి డిమాండ్లు, భవిష్యత్తు గురించి ఆలోచన లేకుండా అభివృద్ధితో సమతూకంలేని తాత్కాలిక సంక్షేమ పథకాల అమలు వంటి వాటిపై గొంతెత్తుదాం, ఓటుతో వాటిని నిలువరిద్దాం. ప్రభుత్వాలు చేయాల్సిన బాధ్యతల్ని సక్రమంగా చేస్తూ మన ఆదాయాల్ని పెంచే వారికే మద్దతిద్దాం, వచ్చే ఎన్నికల్లో అటువంటివారినే ఎన్నుకుందాం. గాంధీ జయంతి అందుకు మనందరికీ, ముఖ్యంగా యువతకు స్ఫూర్తినివ్వాలి.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,

ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

సంపుటి 25 సంచిక 10

అక్టోబర్ 2023

**సంపాదకవర్గం**
బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్

**వర్కింగ్ ఎడిటర్**
దూసనపూడి సోమసుందర్

## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




బయట దాడుల నుంచి కాపాడటమే
మా చేతుల్లో ఉంది సార్.. సభలో కాదు!

కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిబువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949
Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# ఎన్నికల వరాలా? శాపాలా?

దేశవ్యాప్తంగా డెంగ్యూ, చికెన్ గున్యా జ్వరాల వ్యాప్తి వేగంగా జరుగుతుంది. దాంతో పాటు అక్టోబర్ 5 నుండి నవంబర్ 19 వరకు మన దేశంలో జరిగే వన్డే ప్రపంచ కప్ సంబరాల జ్వరం ఒకవైపు, మరోవైపు వచ్చే రెండు నెలల లోపే జరిగే పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల జ్వరం కరోనా వైరస్ కంటే వేగంగా పరిగెడుతున్నాయి.

ఈ ఏడాది చివరిలో తెలంగాణ రాష్ట్రంతో పాటు చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మిజోరం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆయా రాష్ట్రాలలో ఉన్న ప్రధాన రాజకీయ పక్షాలు ఇప్పటికే ఎన్నికల అస్త్ర శస్త్రాలను పదును పెట్టుకుంటూ సిద్ధం చేసుకుంటున్నాయి. మేమేమి తక్కువ తినలేదని దేశంలో ఉన్న రెండు జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ కూడా ఆయా రాష్ట్రాలలో తమ రాజకీయ కలాపాలను ముమ్మరం చేశాయి. ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన పార్టీ ప్రచారంలో తలమునకలై ఉన్నారు. రాబోయే కొద్ది రోజుల్లో ఎన్నికలు జరిగే రాష్ట్రాలలో ఆయన వరస పర్యటనలు చేస్తున్నారు. తెలంగాణ విషయానికి వస్తే జాతీయ పార్టీల ప్రధాన నాయకుల వరస వలస పర్యటనలు జరుగుతూనే ఉన్నాయి. మొన్నటికి మొన్న సెప్టెంబర్ 17న అమిత్ షా, అక్టోబర్ 1,3 తేదీల్లో ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రంలో పర్యటించారు. అలాగే మరొక జాతీయ పార్టీ కాంగ్రెస్ ఏకంగా హైదరాబాద్ వేదికగా సీడబ్ల్యూసీ సమావేశమే నిర్వహించింది. అంతేకాకుండా అభ్యర్థుల ఎంపికలో కొంచెం వెనుకబడి ఉన్నా ఉచిత హామీల తాయిలాలు గుప్పించే మేనిఫెస్టో ప్రకటనలో అన్ని పార్టీల కంటే కాంగ్రెస్ పార్టీ ముందుంది. మూడు పువ్వులు ఆరు కాయల సామెతను గుర్తు చేస్తూ 6 గ్యారంటీలు 12 హామీలు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చింది. కాంగ్రెస్ ఇస్తున్న ఈ గ్యారెంటీలు, హామీలన్నీ తాము ఇప్పటికీ అమలు చేస్తున్న పథకాలకు కొనసాగింపు మాత్రమే తప్ప మరొకటి కాదని, ఒక్క కొత్త పథకం కూడా కాంగ్రెస్ ప్రకటించలేదని రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ విమర్శిస్తోంది. ఇక ఒక్కరోజు తేడాలోనే అక్టోబర్ 1,3 వ తేదీలలో తెలంగాణ రాష్ట్రంలో వరస పర్యటనలు చేసిన నరేంద్ర మోడీ కాంగ్రెస్ పార్టీ పార్టీగా మాత్రమే గ్యారెంటీ ఇచ్చింది కానీ తెలంగాణ సమాజానికి “నేనే గ్యారెంటీ” అని తనకు తానే కితాబు ఇచ్చుకొని గతంలో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేసిన డీకే బారువా “ఇందిరాయే ఇండియా-ఇండియాయే ఇందిరా” అనే మాటలను గుర్తు చేశారు.

గత తొమ్మిదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని హామీల ఊసే తలవని ప్రధానమంత్రి మోడీ కృష్ణా జలాల వివాదం పరిష్కారానికి ఇప్పటికే అమలులో ఉన్న బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కి అప్పుజెప్పడం మొదలుకొని పసుపు బోర్డు ఏర్పాటు, గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు, దేశవ్యాప్తంగా ఉజ్వల గ్యాస్ వినియోగదారులకు మొన్నటి నుండే అమలవుతున్న 200 రూపాయల సబ్సిడీకి తోడుగా కొత్తగా మరొక 100 రూపాయల సబ్సిడీ అదనంగా పెంచారు. “రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదువా” అన్నట్లు ప్రధానమంత్రి ప్రకటన తర్వాతే యూనియన్ క్యాబినెట్ వీటిని ఆమోదించింది.

ప్రజాస్వామ్య విలువలతో, అంతర్గత ప్రజాస్వామ్యంతో, ఉమ్మడి రాజకీయ నాయకత్వంతో నడవాల్సిన రాజకీయ పార్టీలు ఏకవ్యక్తి పాలనలో మగ్గిపోతున్నాయి. ఇక ప్రాంతీయ పార్టీలు అన్ని ప్రైవేట్ ఆస్తులుగా మారిపోయాయి.పార్టీ అంటే తామే,తామంటే పార్టీయే అనే విధంగా ప్రాంతీయ పార్టీల వ్యవస్థాపకులు వ్యవహరిస్తున్నారు.

ఈ నేపథ్యంలో రేపటి ఎన్నికలలో అనుచిత ఉచితాల ఎన్నికల తాయిలాల వరద వెల్లువలా పారనుంది. తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ తాను మాత్రం మిగతా పార్టీల కంటే తగ్గేదేలే అంటూ ఎన్నికల వాగ్దానాల హామీల మూటను అక్టోబర్ 16 వరంగల్ లో జరిగే బహిరంగ సభలో విప్పనుంది. మీరు ప్రస్తుతం ప్రకటించిన దాని కంటే మరిన్ని ఆకర్షణీయమైన ఉచితాలు తాయిలాలు ప్రకటిస్తామని వేరే పార్టీలకు సవాలు విసురుతూ ఈ విషయాన్ని బహిరంగంగానే చెబుతుంది. ఇప్పటికే 119 అసెంబ్లీ నియోజకవర్గాలలో 115 మంది అభ్యర్థులను ప్రకటించి మిగతా పార్టీల కంటే ఒక అడుగు ముందే ఉంది. రాష్ట్రంలో అధికారంలో ఉంది కనుక శంకుస్థాపనలు ప్రారంభోత్సవాల పేరిట ముఖ్యమంత్రితో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్రమంతటా సభలు సమావేశాలు పెట్టి తెగ తిరుగుతున్నారు. ఇక జాతీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపిలో అభ్యర్థుల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానించి వచ్చిన వేలాది అప్లికేషన్ల లో టికెట్లు ఎవరికి ఇవ్వాలా అని మల్లగుల్లాలు పడుతున్నాయి.

ఈ సంపాదకీయం రాసేనాటికి మరొక వారం రోజుల్లో తెలంగాణతో పాటు మరో నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నగారా మోగనుంది. ఈ దశలో రాష్ట్రాల ఖజానాతో ఆర్థిక వెసులుబాటు, సాధ్యాసాధ్యాలతో నిమిత్తం లేకుండా ఒకరి కంటే ఒకరు అన్ని వర్గాల ప్రజలకు అనుచిత ఉచిత హామీలు ఇబ్బడి ముబ్బడిగా ఇవ్వనున్నాయి. రాష్ట్రాలలో అభివృద్ధి, మౌలిక వసతులు ఏర్పాటు విద్య, ఆరోగ్య సేవల మెరుగుదల, యువతకు ఉపాధి, వ్యవసాయాన్ని లాభసాటి చేయడం, అసంఘటిత రంగ కార్మికులకు ఉపాధి కల్పించడం, రోడ్లు, వీధి దీపాలు, మురుగు కాలువలు నిర్మించడం, సాగు, తాగునీటి సౌకర్యం కల్పించడం, నివాసయోగ్యమైన గ్రామాలు, పట్టణాలను తీర్చిదిద్దడం ఇలాంటి అవసరమైన పనులను పక్కనపెట్టి “ఫక్తు”నగదు బదిలీ స్కీములను ప్రవేశపెట్టె ఆలోచనలతో అన్ని సాంప్రదాయ రాజకీయ పక్షాలు ఒకరిని మించి మరొకరు పోటీలు పడుతున్నాయి.

అవసరమైన సంక్షేమ పథకాలు ఎవరూ వద్దనరు. మెరుగైన సమాజం కోసం సంక్షేమం, అభివృద్ధి రెండు కూడా బండి చక్రాల్లాగా కొనసాగాల్సిందే. అనవసర, అనుచిత ఉచితాలను వ్యతిరేకించాల్సిందే. ఓటు బ్యాంకు రాజకీయాల విషవలయంలో అన్ని అధికార, విపక్ష రాజకీయ పక్షాలు చిక్కుకొని విలవిలలాడుతున్నాయి. వీటిని నిజాయితీగా వ్యతిరేకిస్తే తమకు ఓట్లు పడవనే భయంతో ఒకరిని మించి మరొకరు ప్రజలు అడగని హామీలు కూడా ఇస్తున్నారు. ప్రజలకు ఏది అవసరమో ఏది అనవసరమో కనీస విచక్షణా జ్ఞానంతో ఆలోచించే పరిస్థితి కూడా వీరికి ఉండడం లేదు. అందుకే ఏ పార్టీ కూడా మిగతా పార్టీలకు భిన్నంగా వ్యవహరించడం లేదు. తాము ఒకటంటే మరొకరు రెండు అంటున్నారు. పెరుగుట విరుగుట కొరకే అన్నట్లు ఈ అనుచిత ఉచిత హామీలు తడిసి మోపెడై రాష్ట్రాల ప్రగతి కుంటుపడుతుంది. దీంతో దేశ ప్రగతి కూడా కునారిల్లుతుంది.

అనుచిత ఉచితాలను వ్యతిరేకించే “పిల్లి మెడకు” ఎవరు గంట కట్టాలి. ఒకసారి దేశ ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే ఎన్నికల ఆపద్ధర్మ పథకాలు చాలాసార్లు వర్క్ అవుట్ కాలేదు.ఈ నిజాన్ని తెలుసుకుంటే రాజకీయ పార్టీలు ప్రజలకు ఇస్తున్నవి “వరాలా? శాపాలా? అనే విషయం అర్థం అవుతుంది.

- బండారు రామ్మోహనరావు

# ఇస్రో, మిగతా ప్రభుత్వ సంస్థల మధ్య ఎందుకింత తేడా?

## - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

భారతీయ చంద్రయాన్-3 ఇస్రో సాధించిన అద్భుత విజయం. అంతరిక్షంలో ప్రపంచంలో ఎవరూ సాధించని ఏ ఘనతనైనా మన దేశం సాధించగలదని ఓ పాతికేళ్ల క్రితం కూడా ఊహించటం కష్టం. ఈవేళ చంద్రుడి దక్షిణ ధృవం మీద అడుగు పెట్టిన మొట్టమొదటి దేశం భారత్; చంద్రుడి మీద సురక్షితంగా అంతరిక్ష నౌకను దించిన దేశాల్లో నాలుగవది. భారతీయులంతా ఆత్మవిశ్వాసంతో సగర్వంగా తలెత్తుకున్నాం. చంద్రయాన్-2 వైఫల్యం ఇస్రోను నిరుత్సాహపరచలేదు. నిజానికి ఆ పరాజయం పాఠాలు చంద్రయాన్-3కి బాటలు పరిచాయి. సైన్స్‌లో వైఫల్యం ఉండదు; మనం ఒక పని ఎలా చేయకూడదో నేర్చుకుంటామంతే, పద్ధతుల్ని మార్చుకుని పనుల్ని మెరుగ్గా చేస్తామంతే. ఇస్రో విజయం ఇంకా ఎక్కువ ఘనమైనది. ఎందుకంటే, మనం అంతరిక్ష కార్యక్రమాల మీద అతి తక్కువ ఖర్చు పెడతాం. చంద్రయాన్-3కి అయిన ఖర్చు కేవలం 75 మిలియన్ డాలర్లు. రూపాయల్లో 600 కోట్లు. ఇతర దేశాలు ఇదే తరహా ప్రాజెక్టుల కోసం చేసే ఖర్చులో కేవలం 10-20%. నిజానికి 1969లో భారతదేశం ఇస్రోను స్థాపించినప్పటి నుంచి మనం కేవలం 18 బిలియన్ డాలర్లు ఖర్చు చేయగా, అమెరికా అంతరిక్ష సంస్థ నాసా బడ్జెట్ 2023లోనే 25.4 బిలియన్ డాలర్లు.

ఓ ప్రశ్న తలెత్తుతుంది: ఇస్రో అంత బాగా పనిచేస్తున్నప్పుడు, మిగతా ప్రభుత్వ సంస్థలు, విభాగాలు ఎందుకు ఆ స్థాయిలో పనిచేయటం లేదు? చాలా ప్రభుత్వ సేవల్లో నిర్లక్ష్యం, అసలు సేవలు అందకపోవటం, ఆలస్యం, అధికార దుర్వినియోగం, అవినీతి మనందరికీ అనుభవమే. ఇస్రో మాత్రం ఎందుకు భిన్నం? ఇదే తరహా పనితీరు మొత్తం ప్రభుత్వంలో తేగలమా?

ఇస్రో 'ఎగ్జిక్యూటివ్ ఏజన్సీ' నమూనాలో పనిచేస్తుంది. ఆ పదాన్ని కూడా కొన్ని దశాబ్దాల తర్వాత సృష్టించారు. ఎగ్జిక్యూటివ్ ఏజన్సీ నమూనాలో, ప్రభుత్వం ఒక చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ను ఎంపిక చేసుకుంటుంది. కొన్ని స్పష్టమైన, ఆచరణసాధ్యమైన లక్ష్యాల్ని నిర్దేశిస్తుంది. తగిన వనరుల్ని కేటాయిస్తుంది, ఫలితాల్ని పర్యవేక్షిస్తుంటుంది. నిర్వహణలో ఏజన్సీకి పూర్తి స్వతంత్ర ప్రతిపత్తి ఉంటుంది; అంతర్గత సంస్థాగత నిర్మాణం, పనితీరులో అవసరమైన మార్పులకు వెసులుబాటు ఉంటుంది. ఏ రకంగా ఉండాలనేది పూర్తిగా సంస్థే నిర్ణయిస్తుంది. పరిశోధన, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి అనిశ్చిత రంగాల్లో లక్ష్యాల్ని స్థూలంగా మాత్రమే నిర్వచించగలం. అటువంటి సంస్థలు సాధారణంగా హోదాల పద్ధతిలో పనిచేయవు. బాస్‌లకు విధేయతకన్నా బృందాల వారీగా నిర్దేశిత



లక్ష్యాల్ని పూర్తిచేయటం పనిసంస్కృతిగా ఉంటుంది. ప్రక్రియలకన్నా ఫలితాలకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుంది. మార్చటానికి వీల్లేని కఠిన నిబంధనలుండవు. మెరుగైన పనితీరుకి అవసరమైన మార్పులు చేసుకోవటానికి తగిన స్వేచ్ఛ మార్గదర్శక సూత్రంగా ఉంటుంది.

అటువంటి నమూనాను ఎక్కడ అమలు చేసినా, సాధారణంగా అద్భుత ఫలితాలు అందిస్తుంది. కార్యనిర్వహణలో ఎగ్జిక్యూటివ్ ఏజన్సీ నమూనాకు మన దేశంలో 'బార్క్', తపాలా శాఖ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ, రైల్వేలు వంటివి కూడా ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. తపాలా, రైల్వేలలో అధికారుల నియామకం, ధరల నిర్ణయంలో ప్రభుత్వ జోక్యం మితిమీరి ఉంటుంది. అయితే, సాధించాల్సిన ఫలితాలను స్పష్టంగా నిర్వచించి సేవల నిర్వహణలో స్వతంత్రత ఇవ్వటం వల్ల అవి సంతృప్తికరంగా పనిచేస్తున్నాయి.

సాధారణంగా మన దేశంలో పలు ప్రభుత్వ విభాగాలు, సంస్థల పనితీరు నిరుత్సాహం కలిగిస్తుంది. ముఖ్యంగా పౌరులకు ప్రభుత్వ సేవలు అందించే విషయంలో ఇది కఠోర వాస్తవం. ప్రభుత్వ అధికార యంత్రాంగం హోదాల పద్ధతిలో, మూస పోసినట్లు పనిచేస్తుంటుంది. మారిన పరిస్థితులను బట్టి మారే అవసరాలను గుర్తించకుండా, సొంత పద్ధతులే శిలాశాసనమన్నట్లు వ్యవహరిస్తుంటుంది. ఏ ఫలితాలు వస్తున్నాయి, ప్రజలకు సేవలు ఎలా అందుతున్నాయి.. సాధారణంగా పట్టించుకోరు. ఆ రకమైన మూస, హోదాల సంస్కృతి క్రమంగా పలు శాస్త్ర సంస్థలు, యూనివర్సిటీలకు




కూడా పాకింది. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం, మన వ్యవసాయ విశ్వవిద్యాలయాలు అద్భుత పరిశోధనతో రైతులకు అవసరమైన కొత్త సాంకేతికతల్ని సృష్టించాయి. కాలక్రమంలో, వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు మొక్కుబడిగా మారాయి. దీంతో విత్తనాలు, ఇతర సాంకేతికతల కోసం రైతులు ప్రైవేటు బహుళజాతి కార్పొరేట్ల మీద ఆధారపడాల్సి వస్తోంది.

రోజువారీ పాలనలో ఉదాసీనత, లెక్కలేనితనం, నిర్లక్ష్యం, నిస్సహాయ పౌరుల నుంచి పెద్దమొత్తాల్ని లంచాలుగా గుంజటం మనకు తరచూ కనిపిస్తుంటాయి. మన విద్య, ఆరోగ్య సేవలు అత్యంత అధ్వాన్నంగా ఉన్నాయి. చాలా సందర్భాల్లో అధికారానికి, బాధ్యతకి సంబంధం ఉండదు. ఎవరైతే సేవలకు బాధ్యత వహించాలో వాళ్లకి అధికారం ఉండదు, అధికారం ఉన్నవాళ్లకి జవాబుదారీతనం ఉండదు. అయితే, అలా పనిచేసే ఆ సంస్థలకు అప్పుడప్పుడు కొన్ని కీలక పరిస్థితుల్లో హఠాత్తుగా జవజీవాలొస్తాయి. వాళ్ల పనితీరు ఒక్క ఉదుటన గణనీయంగా మెరుగవుతుంది. ఎన్నికల నిర్వహణ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయ కార్యక్రమాలు, జనసందోహాల్ని నియంత్రించటం, వీఐపీల పర్యటనలు ఉదాహరణ. రోజూ కార్యాలయాల్లో అధ్వాన్నంగా అవలక్షణాలు సర్వసాధారణమన్నట్లు పనిచేసే ఇదే యంత్రాంగం ఆ సందర్భాల్లో మాత్రం శభాష్ అనిపించేలా పనిచేస్తారు. ఏం మారింది ఇక్కడ? ఇటువంటి ప్రత్యేక సందర్భాల్లో ఆ ప్రభుత్వ సంస్థ పనిచేసే పద్ధతి మార్చారు. ఈ పనులు చాలా కీలకం, నిర్ణీత సమయంలోగా జరగాలి అని స్పష్టంగా, ఎప్పటికప్పుడు పర్యవేక్షణతో వారికి లక్ష్యం నిర్దేశితమవుతుంది. వీటితోపాటు సాధారణ ప్రజలు, మీడియా, ఎన్నికైన రాజకీయ నాయకులు అందరి దృష్టీ ఇటే ఉంటుంది. దీంతో అధికార యంత్రాంగం సమర్థంగా స్పందిస్తుంది. ఇలాంటి సందర్భాల్లో చేసిందల్లా– అధికారాన్ని, జవాబుదారీతనంతో మేళవించటమనే ఓ చిన్న కార్యనిర్వహణ సూత్రాన్ని అమలు చేయటమే. వేగంగా, సమర్థంగా జరుగుతున్న జాతీయ రహదారుల నిర్మాణం మరో ఉదాహరణ.

ప్రభుత్వ పనితీరును అనేక రెట్లు మెరుగుపరచటం మన చేతుల్లోనే ఉందని ఈ ఉదాహరణలన్నీ తెలియచేస్తున్నాయి. మార్కెట్‌లో పోటీ, వినియోగదారులకు ఎంపిక స్వేచ్ఛ ఉంటే చాలా సేవలు, వస్తువులు తక్కువ ధరలో, నాణ్యతతో అందుతాయి. అటువంటి రంగాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోకూడదు. కేవలం సమానావకాశాలు కల్పించటానికి, వినియోగదారుల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణకు పరిమితం కావాలి. కానీ మార్కెట్ పోటీ సాధ్యంకాని కొన్ని మౌలిక రంగాలుంటాయి. అటువంటి చోట సహజ గుత్తాధిపత్యం ఉంటుంది. అలాంటిచోట ప్రజల అవసరాలు మార్కెట్ డిమాండ్‌గా మారవు. చట్టబద్ధపాలన, మౌలిక వసతులు, ప్రజలకు కనీస వసతులు, పాఠశాల విద్య, ఆరోగ్యం మొదలైన ఈ రంగాల్లో ప్రభుత్వం పాత్ర ఎంతో కీలకం. వీటిల్లో కొన్ని పనులు మార్కెట్ చేయవచ్చు కానీ, ప్రభుత్వం ఒక నమూనాని రూపొందించాలి. ప్రయివేటు రంగమే సేవల్ని అందిస్తున్నా ప్రభుత్వమే తరచూ వనరుల్ని అందిస్తుండాలి.

ప్రభుత్వ సంస్థలు ఇంకా ఎంతో సమర్థంగా పనిచేయగలవని ఇస్రో విజయం నిరూపించింది. మన సంస్థల్ని పునర్నిర్మాణం చేయాలి, ప్రోత్సాహకాల్ని మార్చాలి, నాయకత్వాన్ని లక్ష్యంతో, అధికారాన్ని జవాబుదారీతనంతో సంధానం చేయాలి. ఇస్రో ఒక మినహాయింపుగా మిగిలిపోకూడదు; ప్రతి ప్రభుత్వ సంస్థా ఆ రకంగా సేవలందించేలా మనం రాజీలేని కృషి చేయాలి.

# ఆర్థిక సంస్కరణల అమలులో మన విజయం పాక్షికమే

## డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్‌తో ఆకెళ్ల రాఘవేంద్ర ముఖాముఖి(మూడో భాగం)

**ప్రశ్న: ఆర్థిక సంస్కరణల అమలు ద్వారా మనం విజయం సాధించామా? లేక తప్పు చేశామా?**




జేపీ: ఆర్థిక సంస్కరణలు కచ్చితంగా అవసరం. మనం విజయం సాధించాము. అయితే అది పాక్షిక విజయమే. ఎందుకంటే పాక్షికంగానే అమలు చేశాం కాబట్టి. సమస్య ఆర్థిక సంస్కరణలను అమలు చేయడం కాదు..చాలా పాక్షికంగా మాత్రమే అమలు చేయడం. ఎక్కడ బాగా అమలు చేశామో అక్కడ ఫలితాలు వచ్చాయి. టెలిఫోన్, కంప్యూటర్‌లు గొప్ప ఉదాహరణలు. ఒకప్పుడు రాజీవ్‌గాంధీ దేశంలో కంప్యూటర్‌లు కావాలని కోరినప్పుడు ప్రతీ ఏడాది ప్రతిపక్షాలు సమ్మెకు పిలుపు ఇచ్చేవి..కంప్యూటర్లు వద్దని బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేసేవారు. ఇవాళ అవి లేకపోతే పని జరిగే పరిస్థితి లేదు. అలాగే బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ కనెక్షన్ కోసం గతంలో ఎన్ని ఇబ్బందులు పడ్డామో గుర్తుండే ఉంటుంది..

వాజ్‌పేయి ప్రభుత్వం ఈ రంగంలో స్వేచ్ఛ ఇవ్వగానే మొత్తం పరిస్థితి మారింది. కాబట్టి ఎక్కడైతే నిజంగా ఆర్థిక సంస్కరణలు అమలు చేశామో అక్కడ జీవితాలు మారాయి. కానీ ఇంకా చాలా చోట్ల అమలు చేయలేదు. మూడు తప్పులు జరిగాయి..1. ఆర్థిక సంస్కరణలు అమలు కాని రంగాలు చాలా ఉన్నాయి. వ్యవసాయరంగంలో ప్రభుత్వం ఇప్పటికి కూడా పూర్తిగా సంకెళ్లు వేస్తోంది..ఈ మధ్య తొలగించాలని చూసినా కూడా అవగాహన లేక కొంత, రాజకీయం కోసం కొంత గందరగోళం చేసి ఆర్థిక స్వేచ్ఛను రైతులకు కొంతకాలం అందకుండా ఆపాం. కోస్తాంధ్రలో ఈ గొడవలు ఏమీ లేకుండానే ప్రపంచంలోనే అత్యధిక మత్స్య ఎగుమతి మనం చేస్తున్నాం. దాదాపు 14 లక్షల టన్నులు ఎగుమతి చేస్తున్నాం. ఏడెనిమిది బిలియన్ డాలర్లు సంపాదిస్తున్నారు.. అన్ని చోట్లా కాకపోయినా కూడా కొన్ని చోట్ల రైతులు ప్రపంచాన్ని అర్థం చేసుకుని ముందుకు వెళ్లిపోతున్నారు. అలాగే బ్యాంకులు..ప్రభుత్వ రంగంలో ఉంటే అద్భుతాలు చేస్తామని వాటిని జాతీయాకరణ చేశాం. ఆర్థిక సంస్కరణలు వ్యతిరేకించేవాళ్లు ఏం చెబుతున్నారు..డబ్బున్న వాళ్లకి బ్యాంకులు దోచిపెడుతున్నాయని అంటున్నారు.. ఏ బ్యాంకులు దోచి పెడుతున్నాయి? ప్రభుత్వ నియంత్రణలో ఉన్న బ్యాంకులు. ఎందుకు దోచిపెడుతున్నాయి? పై వాళ్లు చెప్పిన ప్రకారం లోన్లు ఇస్తున్నారు కాబట్టి. దాని గురించి మనం మాట్లాడకుండా బ్యాంకులు దోచిపెడుతున్నాయి కదా? కాబట్టి సామాన్యుడికి ఉచితంగా డబ్బులు ఇస్తే నష్టం ఏంటి? అంటున్నాం. ఇదంతా వితండవాదం. రెండోది: చైనా చేసిందేమిటి..మంచి ప్రమాణాల విద్య, మంచి ప్రమాణాల ఆరోగ్యం ప్రతీ ఒక్కరికి అవి ఏర్పాటు చేయగలిగారు. ప్రపంచ ప్రమాణాల విద్యను చైనా అందిస్తోంది..అన్ని సర్వేల్లో టాప్ ఒకటి రెండు స్థానాల్లో చైనా ఉంటోంది. ఆరోగ్యం మన కంటే చాలా ఎక్కువ. మనం రెండింటినీ నిర్లక్ష్యం చేశాం. డబ్బులు ఖర్చు పెడుతున్నా కూడా ప్రపంచంలో అట్టడుగు స్థాయిలో మన విద్య ఉంది. ఆరోగ్యానికి ప్రభుత్వం డబ్బు ఖర్చు పెట్టడం లేదు..ప్రజలు తమ జేబుల్లో నుంచి ఖర్చు చేసి కోట్లాది మంది బీదలవుతున్నారు. ఇది రెండో పెద్ద సమస్య. మూడోది: అధికార కేంద్రీకరణ. అసలు ఆర్థిక సరళీకరణ, అధికార కేంద్రీకరణ రెండూ కూడా కలిసి నడవవు. చైనా నియంతృత్వ దేశం అయినా కూడా మనకంటే అక్కడ అధికార వికేంద్రీకరణ ఎక్కువ. అధికారాలన్నీ మున్సిపాలిటీల్లోనో.. పట్టణంలోనో జరిగిపోతాయి..మనం ఇక్కడ వాటిని పూర్తిగా నిర్వీర్యం చేసి పారేశాం. ఈ మూడు వైఫల్యాల వల్ల మన దేశంలో అధికార దుర్వినియోగం, అవినీతి వంటి చాలా సమస్యలు కనిపిస్తున్నాయి..అంతేకానీ ప్రభుత్వం చేతుల్లో గనుక ఉంటే అవినీతి ఉండదని అనుకుంటే 1991కి ముందు ఈ దేశం ఎలా ఉందో చూడలేదు. 91 తర్వాత ప్రభుత్వం పాత్ర ఉన్న సంస్థలు ఏం చేస్తున్నాయో చాలా మంది చూడలేదు. ప్రభుత్వరంగ సంస్థ చెడ్డదని కాదు..అందులో సమర్థులు లేరని కాదు. సామర్థ్యం లేదని కాదు..మీరు ఎంత గొప్పవాళ్లు అయినా..సమర్థులు అయినా కొంతకాలం నడుస్తుంది..దీర్ఘకాలంలో నాశనం అయ్యేది ఖాయమే. ఇది వేటగాడు.. పక్షి లాంటిది. వేటగాడికి ఒక్కసారి అదృష్టం తగిలితే చాలు..పక్షిని కొట్టేస్తాడు. పక్షి బ్రతకాలంటే ప్రతిక్షణం అదృష్టం కలిసిరావాలి. మనం అది మర్చిపోతున్నాం. మనం ఏం చేస్తున్నాం..పక్షిని కాపాడటానికి ప్రాణం పెడుతున్నాం. కానీ ఎప్పుడో ఒకప్పుడు వేటగాడు కొట్టేస్తాడు. అందుచేత ప్రభుత్వ రంగ సంస్థ అనగానే అక్కడ సమర్థులు లేరని కాదు. నాది అన్న భావన లేకపోతే, నా డబ్బుని నా భవిష్యత్తుని తాకట్టు పెట్టి రిస్క్ తీసుకుని ప్రాణం పెట్టకపోతే అనుక్షణం మార్కెట్‌లో ఏం జరుగుతుంది..నేను నిలదొక్కుకుంటానా? లేదా? నాతో పోటీపడేవాళ్లు ఏం చేస్తున్నారు..వాళ్లతో పాటు మార్కెట్‌లో నిలబడాలంటే ఏం చేయాలనే తపన లేకపోతే నిలవం. కొంతకాలం బాగా నడిచినా కానీ నాశనం కావడం అనివార్యం. నాది అన్న తపన లేకుండా పోటీకి తట్టుకునే శక్తి లేకుండా గుత్తాధిపత్యంతో ఏ సంస్థ చిరకాలం గట్టిగా నిలబడదు.

ఇది మనం అర్థం చేసుకోవాలి. ప్రభుత్వరంగం శీలాన్ని నేను శంకించడం లేదు. దానిలో ఉన్నవాళ్లు చెడ్డవాళ్లని నేను అనడం లేదు. నేనూ దాంట్లో పనిచేశాను. నెహ్రూగారు వ్యవసాయరంగాన్ని కూడా జాతీయీకరణ చేద్దామని అనుకున్నారు. రష్యాను అనుకరించి కలెక్టివ్ ఫార్మింగ్ అని పెట్టారు. కొంతమంది పెద్దలు వారిస్తే అది ఆగింది. లేకపోతే దేశం అప్పుడే నాశనం అయిపోయేది. అయితే దేశంలో కొన్ని చోట ప్రయోగాత్మకంగా ప్రారంభించారు.మన దగ్గర ఖమ్మం, రాయచూర్ దగ్గర ఏర్పాటు చేశారు. ఏడువేల ఎకరాల ప్రభుత్వ ఫార్మింగ్ ఉంటే పక్కనే ఉన్న 500 ఎకరాల రైతులు ఈ ఏడువేల ఎకరాల కంటే ఎక్కువ ఉత్పత్తి చేస్తున్నారు. మనకి ఆర్థిక కార్యక్రమాల్లో పోటీ ఉండి, నాది అన్న తపన ఉంటే జరుగుతుంది..అయితే ప్రభుత్వ రంగంలో తల్లకిందులుగా తపస్సు చేసినా జరగదు. ఇది బాగా అర్థం చేసుకోవాలి. ప్రభుత్వం చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. ప్రభుత్వం చేయకపోతే మార్గాంతరం లేదు. నేరస్తులను ప్రభుత్వమే శిక్షించాలి. ఇద్దరికి తగాదా వస్తే పోలీసు స్టేషన్‌కి వెళ్లి డబ్బులు ఇచ్చి పని చేయించుకుంటారా? ప్రభుత్వం న్యాయం చేయాలి..మంచి రోడ్డు వేయాలి. ఎవరు వేస్తారు? ప్రభుత్వం కాకపోతే నాకు సంబంధం ఏంటి రోడ్డు. నా డబ్బుతో ఎలా వేస్తాను నేను. నా డబ్బంతా దానికి పెడితే నేను బతికేది ఎలా?అందరికి నీళ్లు రావాలా? డబ్బులు కట్టినా కూడా నీళ్ల ఏర్పాటు ఎవరో ఒకరు చేయాలి కదా? వర్షం వస్తే వరదలు రాకుండా ఉండాలి..ఇవన్నీ ప్రభుత్వం చేయాలి. ప్రభుత్వం చేయాల్సిన పనులన్నీ పక్కన పెట్టి చేయకూడని పనులు, అవసరం లేనివి నెత్తిన వేసుకుని వాటిని అసమర్థంగా, అవినీతితో చేసి అన్ని రకాలుగా దేశాన్ని భ్రష్టుపట్టించాం. ప్రభుత్వం చాలా రంగాల్లో వేలు పెట్టక్కర్లేదు. న్యాయంగా జరిగేట్టు ఏర్పాటు చేస్తే చాలు. మీరు..నేను పోటీపడతాం. పోటీలో ఎవరు నెగ్గితే.. ఎవరి ఉత్పత్తులను ప్రజలు ఆదరిస్తే ..మన్నికతో..నాణ్యతతో ఉందని ప్రజలు భావిస్తే దాన్ని ప్రజలు కోరుకుంటారు. ఒక సినిమా ఉంది..చూడమని ప్రభుత్వం చెబుతుందా..మనకి నచ్చితే చూస్తాం..లేదంటే చూడం. సామాన్య ప్రజలు నిర్ణయం చేస్తున్నారు..మాకు ఆహ్లాదాన్ని ఇచ్చారు కాబట్టి చూస్తాం అంటున్నారు. లేదంటే దండం పెట్టి ఊరుకుంటున్నారు. మార్కెట్ అంటే అర్థం అది.

**ప్రశ్న: ఆర్థిక సంస్కరణలు సమాన అవకాశాలు ఇస్తున్నా..బలం ఉన్నవాడే బలపడుతున్నాడు..ఆర్థిక అసమానతలకు సంస్కరణలు కారణం అవుతున్నాయి కదా.. ఈ లాజిక్‌ను ఎలా అర్థం చేసుకోవాలి.**

జేపీ: ఈ లాజిక్‌లోనే తప్పు ఉంది. ఫ్యూడల్ వ్యవస్థలో ఎవరికి ఎక్కువ ఆస్తి ఉంటే వాళ్లు రాజ్యం చేశారు..వాళ్ల కింద మిగతా వాళ్లంతా బంటుల్లా ఉన్నారు. కొన్ని రకాల వ్యత్యాసాలు ఉన్నా యూరప్‌లో కానీ, మన దేశంలో కానీ ఫ్యూడల్ వ్యవస్థ అంటే.. భూమి ఎవరి చేతుల్లో ఉంటే సంపదంతా వారిదే..అధికారం కూడా వారిదే. సంపద, అధికారం రెండూ కూడా వారి చేతుల్లోనే ఉంటాయి. వారి మాటే చెల్లుబాటువుతుంది..మిగతా వాళ్లు బంటుల్లాగా పనిచేస్తుంటారు. అలాంటి సందర్భంలో ఈ వాదన వాస్తవం. నా సంపద పెరగాలంటే వాడి దగ్గరనుంచి లాక్కోవాలి. వాడి సంపద పెరగాలంటే నా నుంచి లాక్కోవాలి..అంతే తప్ప ఇంకో మార్గం లేదు. సంపద పెంచడం అనేది లేదు. కాబట్టి ఇది పాత కాలపు ఆలోచన. ఆధునిక వ్యవస్థలో కేవలం మనుషుల కండల శక్తి, భూమి మీద ఆధిపత్యం కాకుండా సంపద సృష్టి, ఆదాయాలు పెరగడం అనేది టెక్నాలజీ, నైపుణ్యం కొత్త పుంతలు తొక్కడం నుంచే వస్తుంది. ముందు అది అర్థం చేసుకోవాలి. రెండోది కచ్చితంగా మార్కెట్ వ్యవస్థలో అసమానతలు ఉంటాయి. కానీ మార్కెట్ లేని వ్యవస్థలో అట్టడుగు స్థానంలో ఉండి బీదరికం తాండవిస్తుంటే మార్కెట్ వ్యవస్థలో ముందు ఆ లెవెల్ పెరిగి బీదరికం నుంచి చాలా వేగంగా బయటకి వస్తారు. కానీ ఎవరైతే మార్కెట్‌లో కొత్త వస్తువులను ఉత్పత్తి చేయగలరో..విజయవంతమైన కొత్త ఐడియాలను తీసుకురాగలరో, కొత్త భావాలను అమ్మగలరో వాళ్లు ఎక్కువగా సంపాదిస్తారు. కాబట్టి అసమానత ఉండదంటే అబద్ధం ఆడినవాడిని అవుతాను. కానీ ఎలాంటి అసమానత అది..సమాజంలో సృజనశక్తిని పెంచే అసమానత. గత 20–30 ఏళ్లుగా తీసుకుంటే ఇప్పుడు పెద్ద కంపెనీలుగా ఉన్నవి 20 ఏళ్ల క్రితం లేవు. టెస్లా ఉంది..అది గతంలో చాలా చిన్నగా ఉండేది..ఇప్పుడు ప్రపంచంలో నెంబర్ 1 కంపెనీ అంటున్నారు..ఎందుకయ్యింది.. మానవాళికి అద్భుతమైన టెక్నాలజీని అందించింది. పర్యావరణహిత కారును తయారు చేసింది. దానిలో దోపిడీ ఎక్కడుంది..అన్యాయం ఎక్కడుంది. దానిలో అసమానత ఎక్కడుంది. కొన్నవాళ్లం లాభపడ్డామా.. లేదా? మొత్తం సమాజం లాభపడిందా.. లేదా? కాలుష్యం తగ్గింది. మానవాళికి భూతాపం తగ్గుతుంది. ఇదీ ఆధునిక సంపద సృష్టి. అందుకనే ఒకప్పుడు కంపెనీలు కూడా భూస్వామ్య వ్యవస్థ కాకపోయినా కూడా రిజర్వులు ఉంటే వాళ్లు చాలా పెద్ద కంపెనీలుగా చలామణి అయ్యేవారు. ఇటీవల మారుతున్న టెక్నాలజీలో మీరు ఎంత గొప్ప కంపెనీ అయినా సరే ఆధునిక టెక్నాలజీని ఉపయోగించకపోతే మారుతున్న పరిస్థితులకనుగుణంగా మీరు అవసరాలు తీర్చకపోతే కిందికి వెళ్లిపోతారు. కొత్తవాళ్లంతా పెద్దవాళ్లయిపోతారు. ఇది అవసరమా కాదా మానవాళికి. అసమానత వచ్చిందంటే ఎలా? టెస్లాకు ఆ అవకాశం లేదనుకుంటే మనం పాతకాలపు గుర్రపు జట్కాల్లోనే ప్రయాణిస్తుంటే మన జీవితం బాగుంటుందా? కాబట్టి మనం కొంచెం లోతుగా అర్థం చేసుకోవాలి. అసూయ కారణంగా ఆ ప్రాతిపదికన మనం చర్చిస్తే పరిష్కారాలు రావు. అయితే ఆర్థిక అసమానతలు మరీ పెరగకూడదు. సమాజంలో కొన్ని ఏర్పాట్లు కావాలి. ఉదాహరణకు ఎంత ఆదాయం ఉంటే పన్నులు అంత పెరుగుతాయి..మనదేశంలోనే చూస్తే 10–12 లక్షలు ఆదాయం ఉంటే ఏడు శాతం పన్ను ..అదే ఆదాయం పెరిగితే 30నుంచి33 శాతం పన్నులు వసూలు చేస్తారు. ఆయిల్ కంపెనీలు ఉన్నాయి..రష్యా యుద్ధం వల్ల బాగా ప్రాఫిట్స్ వచ్చాయి. అప్పనంగా లాభాలు వచ్చాయి..ప్రభుత్వాలు ఏం చేస్తాయి..ఇలాంటి వాటి మీద పన్నులు వేస్తాయి..ఆ డబ్బు ప్రజలకు ఉపయోగిస్తాయి. అది రెండో పద్ధతి. మూడో పద్ధతి అన్నిటిని మించి విద్యను పెంచాలి. మంచి ప్రమాణాల విద్యను అందించాలి. ప్రతిభ వికసించే విద్య కావాలి. తెలివితేటలు వికసించే విద్య వస్తే పోటీపడే సామర్థ్యం వస్తుంది. విద్యను ఇవ్వండి..ఉత్పాదకత కోసం ఆరోగ్యాన్ని ఇవ్వండి. సమాజంలో మౌలిక సదుపాయాలు అందరికీ అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయండి. ఇది సమానత్వాన్ని పెంచే పద్ధతి. కానీ బ్యాంకులో లెక్కలు వేసి ఎక్కువ ఉన్న వాళ్ల దగ్గర నుంచి లాగేయడం ఎలా అని ఆలోచిస్తే అందరం కిందికి వెళ్లిపోతాం. ప్రపంచంలో దీనిమీద చాలా చర్చ జరిగింది.పరిష్కారాలు వచ్చాయి..చేస్తున్నారు. .

(ఇంకా ఉంది. . . )

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

**కపట మెరుగని జుగాడ్ ఓటర్లు పక్కా ప్రజాస్వామ్యవాదులు.**
**స్వార్థ నియంత నేతల కుటుంబ రాజకీయాలను ఆమోదించరు.**
**జుగాడ్ జాతీయ పార్టీ లక్ష్యం లోపరహిత చట్టబద్ధపాలన.**
**MLAలకు అధికార, ఆర్థిక వికేంద్రీకరణ బాధ్యతగా ఉంటుంది.**

In August 11, 2005 the Times of India Hyderabad 10th page Headlines the Honorable Supreme Court of India Delivered following Judgment:

## "In India there are no minority or majority"

Defining the ultimate aim of a democracy like India, (Bharat) the Supreme Court has said that the practice of listing religious groups as a minority Community should be discouraged and the list gradually be done away with as it promotes divisive tendencies that weaken the nation. All are minorities amongst Hindus.

A three judge Bench comprising Chief Justice of India R.C. Lahoti, Justice DM Dharmaadhikari and Justice PK Balasubramanyan reminded the minorities commissions set up by the center and state governments that the goal of the constitution was to create social conditions where there was no need to shield or protect rights of minority or majority communities.

The commissions instead of encouraging claims from different communities for being added to a list of notified minorities under the Act, should suggest ways and means to help create social conditions where the list of notified minorities is gradually reduced and done away with all together.

**మన సుప్రీంకోర్టు, మరియు జాతీయ ఎన్నికల కమిషన్ వ్యవస్థలు రెండూ స్వతంత్ర ప్రతిపత్తి కలిగినవే. భారత ప్రజాస్వామ్యాన్ని రక్షించడంలో ఈ రెండు వ్యవస్థలకూ సమాన బాధ్యత ఉంది. పైవిధంగా చెప్పబడిన సుప్రీం కోర్టు తీర్పుని ఆచరణలో పెట్టగలిగిన పొలిటికల్ పార్టీలను మాత్రమే ఎన్నికల కమిషన్ "గుర్తిం చిన పొలిటికల్ పార్టీలుగా" ప్రకటించాలి. ఇది జుగాడ్ పార్టీ యొక్క ప్రతిపాదన.**

Please contact: Jugaad Parthasarathy (9866416798) October 2023.

ADVT

# జమిలి ఎన్నికల వల్ల ఏమిటి ప్రయోజనం?

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**

లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలకు ఒకేసారి ఎన్నికల కోసం ప్రభుత్వం మంత్రాంగం సాగిస్తున్నట్లు మీడియాలో జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. విషయం జాగ్రత్తగా పరిశీలిద్దాం.

2024లో లోక్‌సభతో పాటు జరగాల్సిన అసెంబ్లీ ఎన్నికలు నాలుగు మాత్రమే. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం. ఈ నేపథ్యంలో, అన్ని రాష్ట్రాలకు, లోక్‌సభకు ఇప్పుడు ఒకేసారి ఎన్నికలు నిర్వహించగలమా? అలా చేయాలనుకుంటే, రాజ్యాంగపరంగా భారీ కసరత్తు అవసరమవుతుంది. పలు మార్పులు చేయాల్సి ఉంటుంది. 2024 జూన్‌కి ముందు ఎన్నికలు జరగాల్సిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ అసెంబ్లీల గడువును పొడిగించాల్సుంటుంది. ఎన్నికల్ని వాయిదా వేయాల్సిన ఈ అసెంబ్లీల గడువు ముగిశాక ఆపద్ధర్మ ప్రభుత్వాల్ని నడపటానికి రాజ్యాంగం పరిధిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. అంత కంటే ముఖ్యమైన సమస్య, మిగిలిన అన్ని రాష్ట్రాల అసెంబ్లీలనూ ఒకేసారి రద్దు చేసి లోక్‌సభతో పాటు ఎన్నికలకు సిద్ధం చేయటం. రాజ్యాంగ యంత్రాంగం విఫలమైతే తప్ప ఇష్టానుసారం అసెంబ్లీలను రద్దు చేసే అధికారం యూనియన్ ప్రభుత్వానికి రాజ్యాంగం ఇవ్వలేదు. అంటే, అన్ని అసెంబ్లీలనూ ఏకకాలంలో రద్దు చేసి జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే రాజ్యాంగానికి భారీ సవరణ తప్పనిసరి. అదేసమయంలో, అందుకు పార్లమెంటు ఉభయ సభలలో అవసరమైన ప్రత్యేక మెజారిటీ, మెజారిటీ అసెంబ్లీల ఆమోదం ప్రభుత్వానికి సాధ్యం కాకపోవచ్చు.

ఒకవేళ ఆ రకమైన భారీ సవరణకు అవసరమైన మద్దతు లభించినా, చాలా రాష్ట్రాల్లో రాజకీయ ప్రకంపనలు మొదలవుతాయి. ఉదాహరణకు, ఎన్.డి.ఏ కూటమికి చెందని పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఎన్నికైన ప్రభుత్వాల పదవీ కాలంపై వేటు వేస్తే పెద్దఎత్తున ప్రతిఘటన వస్తుంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, బీహార్, కర్ణాటక, కేరళ, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ మొదలైన రాష్ట్రాల్లో కల్లోలం ఏర్పడుతుంది.

వెస్ట్‌మినిస్టర్ ప్రభుత్వ నమూనాను అనుసరించే ఫెడరల్ దేశం మనది. మన రాజ్యాంగం, రాజకీయాల ప్రకారం యూనియన్, రాష్ట్రాల స్థాయిలో జమిలి ఎన్నికలు దాదాపు అసాధ్యం.

అంతకంటే ముఖ్యంగా మనం గుర్తించాల్సింది, పార్లమెంటరీ తరహా కార్యనిర్వాహక వ్యవస్థతో వెస్ట్‌మినిస్టర్ నమూనా ప్రభుత్వం మనకు ఉన్నంత వరకు లోక్‌సభ లేదా ఒక రాష్ట్ర అసెంబ్లీ నిర్ణీత గడువు పాటు అయిదేళ్లూ సుస్థిరంగా కొనసాగుతుందని గ్యారంటీ ఇవ్వటం ఎప్పటికీ సాధ్యం కాదు. ఎన్నికైన చట్టసభల్ని కాలవ్యవధి కంటే ముందే రద్దు చేయాల్సి రావటం, తిరిగి ఎన్నికల్ని నిర్వహించటం ఎప్పుడైనా జరగొచ్చు. అలాంటప్పుడు గతంలో జరిగినట్లే రాబోయేకాలంలో కూడా అసెంబ్లీలకు, లోక్‌సభకు ఎన్నికలు మళ్లీ వేరయ్యే అవకాశముంది. కాబట్టి, జమిలి కోసం ఇంత కసరత్తూ చివరికి కొండను తవ్వి ఎలకను పట్టిన చందాన తయారవుతుంది.



జమిలి ఎన్నికల వల్ల మన ప్రజాస్వామ్యానికేమైనా ప్రయోజనముందా? - ఇదీ అసలు ప్రశ్న. మన ఫెడరల్ రాజకీయ వ్యవస్థలో ప్రభుత్వం మూడు అంచెల్లో ఉంటుంది. యూనియన్, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు. అయితే, మన ఓటర్లలోని అత్యధికుల మనసుల్లో రాజకీయం అంటే రాష్ట్రం, రాష్ట్రమే రాజకీయానికి యూనిట్. పౌరుల జీవితాలకు సంబంధించిన ఎక్కువ అంశాలపై స్పందనలు రాష్ట్ర స్థాయి ప్రభుత్వాల నుంచే వస్తుంటాయి. చాలా రాష్ట్రాల్లో స్థానిక ప్రభుత్వాలు ఉత్సవ విగ్రహాలు మాత్రమే. వాటికి నిధులు, విధులు లేవు. ఫలితంగా, రాష్ట్ర ప్రభుత్వం పట్ల ఇష్టాయిష్టాలకనుగుణంగానే మొత్తం మూడంచెల్లోని ఎన్నికల్లోనూ ఎక్కువమంది ఓటు వేస్తుంటారు. రాష్ట్రంలోని ప్రభుత్వం నచ్చితే, అన్ని ఎన్నికల్లో రాష్ట్రంలోని పాలకపక్షానికే




ఓటర్లు మొగ్గుచూపుతారు. రాష్ట్ర ప్రభుత్వం పట్ల అసంతృప్తి చెందితే, స్థానిక, రాష్ట్ర, జాతీయ – అన్ని ఎన్నికల్లో రాష్ట్రంలోని అధికార పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేస్తారు.

మూడంచెల్లోని ప్రభుత్వం, వాటి విధుల మధ్య తేడాను అత్యధిక ఓటర్లు గుర్తించలేకపోతున్నారని ప్రస్తుత ఓటింగ్ తీరు తెలియచేస్తోంది. అసెంబ్లీ నియోజకవర్గం రాజకీయానికి యూనిట్‌గా మారింది. అన్ని ఎన్నికల్లో ఎక్కువమంది ఓటర్ల రాజకీయ ప్రాధాన్యతలను ఆ నియోజకవర్గమే నిర్ణయిస్తోంది. రాజ్యాంగం ప్రకారం చట్టసభలో తప్ప ప్రభుత్వంలో తన పాత్రలేకున్నా ఎమ్మెల్యే నియోజకవర్గంలో ప్రచ్ఛన్న ప్రభుత్వంలా, మకుటం లేని మహారాజులా వ్యవహరిస్తున్నారు. బదిలీలు, కాంట్రాక్టులు, పోలీసు కేసులు, సంక్షేమ పథకాల జారీ, సహజ వనరుల కేటాయింపు, భూమి, ఇసుక లేదా గనులు, పలు నిబంధనలు నిర్ణయిస్తున్నారు. చాలా రాష్ట్రాల్లో ఇదే ధోరణి. దీనివల్ల నియోజకవర్గం యూనిట్‌గా ఓటింగ్ సరళి ఇంకా బలోపేతమవుతోంది.

పరిణతి చెందిన ఇతర ఫెడరల్ ప్రజాస్వామ్యాలతో ఈ పరిస్థితిని పోల్చిచూడండి. అమెరికాలో, అన్ని స్థాయిల్లోని ప్రభుత్వాలకూ ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తారు. ప్రతి రెండేళ్లకు ఎన్నికలు జరుగుతాయి: ప్రతినిధుల సభను రెండేళ్లకోసారి ఎన్నుకుంటారు; అధ్యక్షుడు, గవర్నర్లు, మేయర్లను ప్రతి నాలుగేళ్లకూ ఎన్నుకుంటారు; ఒకే బ్యాలెట్‌పై పలువురు ఇతర రాష్ట్ర, స్థానిక అధికారుల్ని ఎన్నుకుంటారు. అధ్యక్ష ఎన్నిక సమయంలో సుమారు 25-30 మంది అధికారులు ఒకేసారి అదే బ్యాలెట్ పత్రంపై ఎన్నికవుతారు. అయినా, ఓటర్లు ఎంతో వివేచనను ప్రదర్శిస్తారు. వేర్వేరు స్థాయిల్లో, వేర్వేరు పదవులకు, వేర్వేరు పార్టీల అభ్యర్థులను ఎన్నుకుంటారు.

ఒకవేళ ఏదోకరకంగా భారత్‌లో జమిలి ఎన్నికల్ని క్రమంతప్పకుండా నిర్వహించినా ఏ స్థాయిలో ప్రభుత్వానికి ఏ బాధ్యతలున్నాయి, వాటిని ఆయా ప్రభుత్వాలు ఎలా నెరవేరుస్తున్నాయి అనే మదింపు లేకుండా అన్ని స్థాయిలకూ ఒకే రీతిలో ఓటు వేయటం ఇంకా పెరుగుతుందని అనుభవాలు చెబుతున్నాయి.

స్థానిక, రాష్ట్ర, యూనియన్ స్థాయిలో ప్రభుత్వం చేయాల్సిన పనులు, అక్కడి సమస్యలపై స్పష్టమైన అవగాహన లేకుండా ఒక సంబరంలా, కోలాహలంగా ఓటు వేయటం, ఎన్నికలయిన దగ్గర్నుంచి నిరంతరం నిరసనలు అనే స్థాయికి ఇప్పటికే మన ప్రజాస్వామ్యాన్ని దిగజార్చుకున్నాం. ప్రభుత్వాన్ని ఎన్నుకోవటం కోసం యూనియన్, రాష్ట్ర, స్థానిక స్థాయిల్లో తాము వేస్తున్న ఓటుకి, తద్వారా తమ జీవితాల్లో ఆశించదగిన మార్పులకి మధ్య సంబంధంపై ఓటర్లలో అవగాహన రావాలి. ఏ సంస్కరణయినా, ఓటర్ల ఆలోచనని, పరిణితిని ఇంకా పెంచాలి. పరిపాలన, జవాబుదారీతనాన్ని మెరుగుపరచే బలమైన ఆయుధంగా ఓటును మలచాలి. భారతదేశ పరిస్థితుల్లో జమిలి ఎన్నికలు మన ప్రజాస్వామ్యాన్ని మరింత మొక్కుబడి గావించి, జవాబుదారీతనాన్ని ఇంకా నామమాత్రం చేసే అవకాశముంది.

మన ప్రజాస్వామ్యంలోని లోతైన సంక్షోభంపై కోవింద్ కమిటీ దృష్టి సారించాలి. ఎన్నికల్లో చట్టవిరుద్ధ డబ్బు ప్రవాహం, ప్రభుత్వ మౌలిక బాధ్యతల్ని పణంగా పెట్టి తాత్కాలిక సంక్షేమ పథకాలు, కులం, ప్రాంతం, మతం వంటి భావోద్రేకాల చుట్టూ రాజకీయ సమీకరణల్ని అధ్యయనం చేయాలి. మనకు కావలసింది, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసి పాలనను మెరుగుపరచే నిజమైన, ఆటనియమాల్ని మార్చగల సంస్కరణలు. జమిలి ఎన్నికలు మన సంక్లిష్ట సవాళ్లకు సర్వరోగనివారిణి కావు.

# స్వామినాథన్ కృషి కొనసాగుతుంది

ఎంఎస్ స్వామినాథన్ నిండైన, ఫలవంతమైన జీవితాన్ని గడిపారు. భారతదేశ హరిత విప్లవానికి ఆయన సంకేతం. అప్పటిదాకా దాదాపు అసాధ్యమనుకున్న లక్ష్యాన్ని స్వామినాథన్, ఇంకా అనేకమంది తపన, అంకితభావం గల వ్యవసాయ శాస్త్రవేత్తలు సుసాధ్యం చేసి చూపారు. పీఎల్-480 స్కీమ్ కింద అమెరికా నుంచి వచ్చే ఆహారధాన్యాల ఓడ కోసం ఎగబడే పరిస్థితి నుంచి దశాబ్దకాలంలో భారత్ ఆహార స్వావలంబనను సాధించింది.

దేశానికి సుస్థిర ఆహార భద్రత ఇచ్చిన గొప్ప మానవతావాదులు, శాస్త్రవేత్తలు, సాహసోపేత కృషి చేసిన మన రైతులు, అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ, మంత్రి సి.సుబ్రమణ్యం, యూనియన్ ప్రభుత్వ కార్యదర్శి బి.శివరామన్, ది గ్రేట్ నార్మన్ బోర్లాగ్‌లను భారత్ ఎప్పటికీ కృతజ్ఞతాభావంతో గుర్తుంచుకొంటుంది. ఎంఎస్ఎస్ జీవితకాల కృషి కొనసాగుతుంది అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఘననివాళులర్పించారు.

# జమిలి ఎన్నికల నేపథ్యం, వివరాలు



లోక్‌సభ స్థాయి వరకు అన్ని ఎన్నికలనూ ఒకేసారి నిర్వహించాలని యూనియన్‌లో అధికారంలో ఉన్న ఎన్‌డీయే ప్రభుత్వం కొన్నేళ్లుగా ప్రతిపాదనలు చేస్తున్నప్పటికీ మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఇటీవల ఉన్నట్టుండి కమిటీ వేయటం దేశవ్యాప్త చర్చకు దారితీసింది. రాజకీయ పార్టీలన్నీ ఈ అంశంపై మల్లగుల్లాలు పడుతున్నాయి. ఇందులో మౌలికాంశాలు, దీర్ఘకాలిక ప్రభావం గురించి లోతైన ఆలోచనకన్నా ఎన్నికల సంవత్సరంలో మోదీ ప్రభుత్వానికి లాభం చేసే కుట్ర కోణం ఏమైనా దాగుందా అని లోతుగా లెక్కలేసుకుంటున్నాయి. పౌర సమాజంలో కూడా ఎక్కువ శాతం ఈ రకమైన పక్షపాత రాజకీయ దృష్టి చర్చలు జరుగుతున్నాయి. గతంలో లా కమిషన్, పార్లమెంటు స్థాయీ సంఘం జమిలి ఎన్నికలకు మద్దతుగా నివేదికలు ఇచ్చినప్పటికీ ఇందులో అధిగమించాల్సిన రాజకీయ, రాజ్యాంగ, ఆర్థిక, చట్టపరమైన అంశాలు చాలా ఉన్నాయని చెబుతున్నారు.

**నేపథ్యం**

లోక్‌సభ; అసెంబ్లీలకు 1951-52 నుంచి 1967 వరకు ఏకకాలంలో ఎన్నికలు జరిగాయి. తర్వాత ఆ వరస గాడితప్పింది. ఇప్పుడు లోక్‌సభకు అయిదేళ్లకోసారి ఎన్నికలు జరుగుతున్నా, ఏటా పలు రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయి. తరచూ జరిగే ఇలాంటి ఎన్నికలు.. పరిపాలన, అభివృద్ధి కార్యకలాపాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించటం వల్ల ఇలాంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మోదీ ప్రభుత్వ అభిప్రాయం. దీనిపై గతంలో పలు కమిటీలు అధ్యయనం చేశాయి.

➔ జస్టిస్ బి.పి జీవన్‌రెడ్డి నేతృత్వంలోని లా కమిషన్ 1999లో ఎన్నికల చట్టాల సంస్కరణలపై ఇచ్చిన 170వ నివేదకలో జమిలి ఎన్నికలు నిర్వహించాలని చెప్పింది.

➔ 2015 డిసెంబర్‌లో న్యాయశాఖ పార్లమెంటరీ స్థాయీసంఘం 79వ నివేదికలోనూ దీని గురించి ప్రస్తావించింది. జమిలి ఎన్నికలను రెండు దశల్లో నిర్వహించటానికున్న ప్రత్యామ్నాయ, ఆచరణీయ విధానాలపై సిఫార్సులు చేసింది.

➔ 2017 నవంబర్‌లో అప్పటి నీతి ఆయోగ్ సభ్యుడు, ఓఎస్‌డీ వివేక్ దేబరాయ్, కిషోర్ దేశాయ్‌లు జమిలి ఎన్నికలపై నీతి ఆయోగ్ తరపున విశ్లేషణ చేశారు.

**జమిలి వల్ల ఈ ఇబ్బందులు తప్పుతాయి..**

➔ లోక్‌సభ, అసెంబ్లీలు, స్థానిక ప్రభుత్వాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ఓటరు ఒకేరోజు అన్ని ఎన్నికల్లో పాల్గొనటానికి వీలవుతుంది.

➔ ఎన్నికల సమయంలో ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుంది కాబట్టి సాధారణ పరిపాలన కార్యకలాపాలు మినహాయిస్తే ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొంతకాలం స్తంభించిపోతాయి.

➔ ఒక్కో రాష్ట్ర అసెంబ్లీకి సగటున 2 నెలలపాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందన్నది నీతి ఆయోగ్ విశ్లేషణ.

➔ యూనియన్ ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికల భారాన్ని 100%, అసెంబ్లీల ఎన్నికల భారాన్ని 50% భరించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీ ఎన్నికల భారాన్ని 50%, స్థానిక ప్రభుత్వాల భారాన్ని 100% భరించాల్సి వస్తుంది.

➔ లోక్‌సభ ఎన్నికలకు దాదాపు రూ.4,000 కోట్లకు పైగా ఖర్చవుతుంది. పెద్ద రాష్ట్రాల ఎన్నికలకు ఒక్కో దానికి సగటున రూ.300 కోట్లు భరించాల్సి వస్తుంది. అదే ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ఈ ఖర్చును తగ్గించుకోవచ్చు.



## తొలి సమావేశం

కోవింద్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ తొలి సమావేశం సెప్టెంబర్ 23న జరిగింది. జమిలి ఎన్నికల నిర్వహణపై జాతీయ పార్టీలు, రాష్ట్రాల్లో ప్రభుత్వాలు నడుపుతున్న పార్టీలు, పార్లమెంటులో ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలు, గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీలతో పాటు లా కమిషన్ నుంచి సూచనలు, సలహాలు, అభిప్రాయాలు కోరుతూ ఆహ్వానం పంపాలని సమావేశంలో నిర్ణయించారు. అవసరమైన పత్రాల సన్నద్ధత, సంబంధిత పక్షాలతో సంప్రదింపులు ఎలా నిర్వహించాలి, జమిలి ఎన్నికలపై పరిశోధన.. తదితర అంశాలు చర్చకు వచ్చాయి. కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన, అధికారిక సంప్రదింపులు ఎలా జరపాలన్న అంశాలపై కమిటీ చర్చించింది.

➔ఎన్నికల నిర్వహణ అన్నది అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ. ఇందుకోసం యూనియన్ ప్రభుత్వం టీచర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, సాయుధ బలగాలు, పోలీసులు, హెూంగార్డుల సాయం తీసుకోవాలి.

➔2019 లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ 10 లక్షల పోలింగ్ బూత్‌లలో 75 రోజులకు పైగా సాగింది. ఒక్కో పోలింగ్ బూత్‌కు సగటున 10.75 మంది ప్రభుత్వోద్యోగులు కావాలన్నది అంచనా. అంటే 2019 ఎన్నికల్లో కోటి మందికి పైగా ప్రభుత్వ సిబ్బంది 75 రోజుల సుదీర్ఘ కాలం ఎన్నికల నిర్వహణకు పరిమితమయ్యారన్నమాట.

➔ఇప్పుడున్న విధానం ప్రకారం ఎప్పుడూ ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతుండటం వల్ల రాజకీయ పార్టీలు నిరంతరం ప్రచార కార్యక్రమాల్లో మునిగి ఉంటాయి.

➔అందువల్ల ఎప్పుడూ రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని హ్రస్వదృష్టితో కూడిన ప్రజాకర్షక విధానాలకే మొగ్గుచూపుతాయి. ప్రజలకు దీర్ఘకాలంలో మేలుచేసే సంక్లిష్టమైన సంస్కరణల జోలికిపోవు. దీనివల్ల అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడతాయి.

**జమిలి నిర్వహించాలంటే..**

జమిలి ఎన్నికలంటే పార్లమెంటుతోపాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకూ ఎన్నికలు నిర్వహించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ రాష్ట్రాల అసెంబ్లీల అధికారిక గడువులు భిన్నంగా ఉన్నాయి. వీటన్నింటినీ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కలపాలంటే.. (ఈసారే కాకుండా తర్వాత ఎప్పుడు పార్లమెంటు ఎన్నికల్లో కలపాలన్నా) కొన్ని రాష్ట్రాల అసెంబ్లీల గడువును పెంచటమో, మరికొన్నిటిని తగ్గించటమో చేయాలి. లోక్‌సభ ముందస్తు ఎన్నికలకు వెళ్లినా ఈ మార్పులు తప్పవు. కానీ అది అనుకున్నంత సులభం కాదు. ఇందుకు రాజ్యాంగపరంగా అవరోధాలున్నాయి. దీన్ని అధిగమించాలంటే దేశంలో వివిధ ఎన్నికల నిర్వహణ తీరుతెన్నులు, మార్గదర్శకాలకుద్దేశించిన 1951 ప్రజాప్రాతినిధ్య చట్టానికి సవరణలు చేయటంతోపాటు.. పలు కీలకమైన రాజ్యాంగ సవరణలకు పార్లమెంటు ఆమోదముద్ర వేయాల్సి ఉంటుంది.

**అడ్డంకులివీ..**

➔మనది కేవలం పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే

కాకుండా.. సమాఖ్య వ్యవస్థ కూడా. అంటే రాష్ట్ర ప్రభుత్వాలకూ గణనీయ అధికారాలుంటాయి. రాష్ట్రాల్నీ ఒప్పించాలి. రాష్ట్రాల్లో ప్రజల ద్వారా ఎన్నికైన ప్రభుత్వాల కాలపరిమితి కూడా ప్రధానమైనదే. జమిలి కోసం వాటిని కుదించటాన్ని ఎన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు అంగీకరిస్తాయో చూడాలి.

➔ రాజ్యాంగ సవరణ జరగటానికి పార్లమెంటు 2/3 మెజారిటీతో ఆమోదించాలి.

➔ దేశంలోని సగం రాష్ట్రాల అసెంబ్లీలు కూడా ఆమోదిస్తూ తీర్మానించాలి.

**సవరణ చేయాలని చెబుతున్న అధికరణలు**

➔ అధికరణం 83
(లోక్‌సభ, రాజ్యసభల కాలపరిమితికి సంబంధించినది)

➔ అధికరణం 83 (2) (11).. (ముందే కుదిస్తే తప్ప.. లోక్‌సభ అయిదేళ్ల గడువును నిర్దేశించేది)

➔ అధికరణం 172 (1)
(రాష్ట్రాల అసెంబ్లీలకు అయిదేళ్ల గడువును నిర్దేశించేది)

➔ అధికరణం 83 (2)
అత్యవసర సమయంలో.. సభ కాలపరిమితిని ఏడాదికి మించకుండా పార్లమెంటు చట్టం ద్వారా వీలు కల్పించేది. అధికరణం 172 (1) కింద రాష్ట్రాలకూ ఇలాంటి వీలుంది.

➔ అధికరణం 85 (2) (బి)
రాష్ట్రపతి లోక్‌సభను రద్దు చేసే అధికారాలనిచ్చింది. అదేవిధంగా.. అధికరణం 174 (2) (బి) కింద రాష్ట్ర అసెంబ్లీల రద్దు అధికారం గవర్నర్‌కి దఖలు పరిచేది.

➔ అధికరణం 356
(రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలనకు వీలుకల్పించేది)

# మళ్లీ అన్ని పార్టీలతో చర్చించటం అవసరం

➔ **2019లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఢిల్లీలో ఏడు లోక్‌సభ స్థానాల్లో బీజేపీ గెలిస్తే, 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ గెలిచింది. ఈ రెండు ఎన్నికలూ ఒకేసారి జరిగితే ఒక పార్టీయే లబ్ధి పొందే అవకాశముందని అంచనా.**

➔ **2018లో జరిగిన రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ స్వీప్ చేసింది. రెండు ఎన్నికలూ ఒకేసారి జరిగితే ఇలాంటి వైవిధ్యభరిత ఫలితాలు సాధ్యంకాక పోవచ్చు.**

➔ **ఇది వరకు జమిలి ఎన్నికలపై రాజకీయ పార్టీల అభిప్రాయం లా కమిషన్ కోరినప్పుడు ఏఐఏడీఎంకే, ఏజీపీ, ఐయూఎంఎల్, డీఎండీకే, శిరోమణి అకాలీదళ్, బీఆర్ఎస్ పార్టీలు ఈ ఆలోచనను సమర్థించాయి. తృణమూల్ కాంగ్రెస్, సీపీఐ, కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ తిరస్కరించాయి. ఇప్పుడు మళ్లీ అన్నింటితో చర్చించి అభిప్రాయాలు సేకరించాలి.**

➔ **దేశవ్యాప్తంగా 10 లక్షల పోలింగ్ కేంద్రాలున్నాయి. ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ప్రతి కేంద్రానికి 2 సెట్ల ఈవీఎంలు అవసరమవుతాయి. దీనికితోడు ఇప్పుడున్న అనుభవం ప్రకారం కనీసం 40% బ్యాలెట్ యూనిట్లు, 20% కంట్రోల్ యూనిట్లు రిజర్వ్‌లో ఉంచాలి. అంటే కనీసం 28 లక్షల బ్యాలెట్ యూనిట్లు, 24 లక్షల కంట్రోల్ యూనిట్లు కావాల్సి వస్తుంది. ఇంకా ఎక్కువ సంఖ్యలో అవసరమవుతాయని కొందరు నిపుణులు అంచనా వేస్తున్నారు. 2018 నాటి ధరల ప్రకారం బ్యాలెట్ యూనిట్ రూ.8 వేలు, కంట్రోల్ యూనిట్ రూ.9,500 ఉంది. అందువల్ల వీటి సేకరణకే రూ.3,570.90 కోట్లు కావాలని అప్పట్లో అంచనా వేశారు. 25 లక్షల వీవీప్యాట్‌ల సేకరణకు మరో రూ.5,713.25 కోట్లు కావాల్సి వస్తుంది. ఈ రెండూ కలిపితే రూ.9,284.15 కోట్లు అవుతుంది. గత అయిదేళ్లలో వచ్చిన ధరల పెరుగుదలను చూస్తే ఈ ఖర్చు కనీసం మరో 50% అయినా పెరిగే అవకాశం ఉంటుంది. వీవీప్యాట్‌లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్ల సంఖ్య పెరగనున్నందున వాటి నిల్వకు రెట్టింపు స్థలం అవసరమవుతుంది. అలాగే ఓట్ల లెక్కింపు జరిపేంతవరకూ వాటికి భద్రతాసిబ్బంది సంఖ్యనూ రెట్టింపు సంఖ్యలో మోహరించాల్సి ఉంటుంది.**

జమిలి ఎన్నికలంటే.. పార్లమెంటుతోపాటు అన్ని రాష్ట్రాల ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలి కాబట్టి, కొన్ని రాష్ట్రాల పదవీకాలాన్ని పొడిగించాల్సి రావొచ్చు. మరికొన్నింటిని తగ్గించాల్సి రావొచ్చు. ఈ నేపథ్యంలో ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏయే రాష్ట్రాల అసెంబ్లీల గడువు ఎప్పటి వరకో చూద్దాం.

| | |
|---|---|
| డిసెంబర్ 2023 | మిజోరం |
| జనవరి 2024 | ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ |
| జూన్ 2024 | ఏపీ, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిషా, సిక్కిం |
| నవంబర్ 2024 | హర్యానా, మహారాష్ట్ర |
| డిసెంబర్ 2024 | జార్ఖండ్ |
| ఫిబ్రవరి 2025 | ఢిల్లీ |
| నవంబర్ 2025 | బీహార్ |
| మే 2026 | అస్సాం, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ |
| జూన్ 2026 | పుదుచ్చేరి |
| మార్చి 2027 | గోవా, మణిపూర్, పంజాబ్, ఉత్తరాఖండ్ |
| మే 2027 | ఉత్తరప్రదేశ్ |
| డిసెంబర్ 2027 | గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ |
| మార్చి 2028 | మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర |
| మే 2028 | కర్ణాటక |

దేశవ్యాప్తంగా లోక్‌సభ, శాసనసభ, పట్టణ, గ్రామీణ స్థానిక ప్రభుత్వాల ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు సాధ్యాసాధ్యాల అధ్యయనానికి మాజీ రాష్ట్రపతి కోవింద్ చైర్మన్‌గా 8 మందితో నియమించిన కమిటీ ఢిల్లీ ప్రధాన కేంద్రంగా పనిచేస్తుంది. కమిటీ సాధ్యమైనంత త్వరగా సిఫార్సులు చేయాలని, విధివిధానాలను సొంతంగా రూపొందించుకోవచ్చని న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఇది ప్రజలందరి సూచనలనూ వింటుంది. వినతులు, లేఖలు స్వీకరించి అవసరమైనవాటిని తుది సిఫార్సుల్లో చేర్చే వీలుకల్పించారు. ఒక కమిటీకి మాజీ రాష్ట్రపతి నేతృత్వం వహించటం ఇదే తొలిసారి. ఈ కమిటీలో ఉండేందుకు కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌధరి తిరస్కరించారు.

**సభ్యులు:**

1. యూనియన్ హోం మంత్రి అమిత్‌షా
2. లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అధీర్ రంజన్ చౌధరి
3. రాజ్యసభ మాజీ ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్
4. 15వ ఆర్థిక సంఘం చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి ఎన్.కె సింగ్
5. లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్, రాజ్యాంగ కోవిదుడు సుభాష్ సి. కశ్యప్
6. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, న్యాయ కోవిదుడు హరీష్ సాల్వే
7. మాజీ సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్, విశ్రాంత ఐఏఎస్ అధికారి సంజయ్ కొఠారి


యూనియన్ న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్‌వాల్ ఈ కమిటీ సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితునిగా హాజరుకావటానికి ప్రభుత్వం వీలుకల్పించింది. కార్యదర్శిగా న్యాయశాఖ కార్యదర్శి నితెన్ చంద్ర వ్యవహరిస్తారు.

**విధివిధానాలు**

కమిటీకి ప్రభుత్వం ఏడు విధివిధానాలు నిర్దేశించింది.

1. రాజ్యాంగం, చట్టపరమైన నిబంధనలను దృష్టిలో ఉంచుకొని అన్ని ఎన్నికలు ఒకేసారి నిర్వహించే అంశంపై అధ్యయనం చేపట్టి సిఫార్సులు చేయాలి. జమిలి ఎన్నికలకు వీలుగా ఏయే చట్టాలకు సవరణలు చేయాలో సూచించాలి.
2. ఒకవేళ రాజ్యాంగ సవరణలు చేస్తే వాటిని రాష్ట్రాలు ఆమోదించాల్సి ఉంటుందా? లేదా? అన్న అంశంపై అధ్యయనం చేపట్టి తగిన సిఫార్సులు చేయాలి.
3. జమిలి ఎన్నికల వల్ల త్రిశంకు సభలు, అవిశ్వాస తీర్మానాలు, పార్టీ ఫిరాయింపుల్లాంటి సందర్భాలు తలెత్తినప్పుడు ఏం చేయాలో పరిష్కార మార్గాలు చూపాలి.
4. అన్నింటికీ ఇప్పుడు ఒకేసారి ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితి వస్తే మిగిలినవాటిని జమిలి ఎన్నికలతో అనుసంధానించటానికి ఎన్ని దశల్లో, ఎప్పుడెప్పుడు ఎన్నికలు నిర్వహించాలో సూచించాలి. అవసరమైన చట్టసవరణల గురించీ చెప్పాలి.
5. జమిలి ఎన్నికలు గాడి తప్పకుండా నిరంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిఫార్సు చేయాలి.
6. జమిలి ఎన్నికల నిర్వహణకు సదుపాయాలు, మానవ వనరులు, ఈవీఎంలు, వీవీప్యాట్‌ల అవసరం ఎంతమేరకు ఉంటాయో అధ్యయనం చేయాలి.
7. ఒకే ఓటర్ల జాబితా, ఐడీ కార్డు ఉపయోగించటానికి విధివిధానాలు సిఫార్సు చేయాలి.

# చంద్రబాబు ఎపిసోడ్‌లో పాఠాలు



మాజీ ముఖ్యమంత్రి, ఏపీ ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుని నంద్యాలలో సీఐడీ పోలీసులు అరెస్టు చేసిన తీరుపై పలు విమర్శలు వినిపించాయి. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటులో అవినీతి జరిగిందని, అందుకు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు బాధ్యుడని నమోదైన కేసులో విజయవాడలోని అవినీతి నిరోధక శాఖ కోర్టు రిమాండ్ విధించి, ఆయన్ను రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలిస్తున్నప్పుడు తెలుగుదేశం వారితోపాటు పలువురు మధ్యతరగతి, సంపన్న తటస్థులు కూడా కొంత షాక్ తిన్నారు. వివిధ పార్టీలకు చెందిన పలువురు పెద్ద నేతలు బహిరంగంగానే ఖండించారు.

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును నిజాయతీ, విశ్వసనీయతలో ఎవరూ ఆ పార్టీ వ్యవస్థాపకుడు ఎన్.టి రామారావుతో పోల్చలేరనటంలో సందేహం లేదు. కానీ పాలనాపరంగా ఆర్థికరంగంలో కృషి, కొత్తతరం యువతకు ఉపాధి అవకాశాల కోసం సాంకేతికతను ఉపయోగించుకుంటూ చేసిన ప్రయత్నాలు, జాతీయ స్థాయి నాయకులతో, పెట్టుబడి వర్గాలతో, వ్యవస్థల్లోని వివిధ విభాగాల్లో ఉన్నతస్థాయివారితో ఆయనకున్న సత్సంబంధాలు చంద్రబాబుకి బలమైన సానుకూల ఇమేజ్‌ను కల్పించాయి. అవినీతి ఆరోపణలున్నా ఆ ముద్ర బలపడకుండా చేశాయి. ఈ నేపథ్యంలో ఆయన అరెస్ట్ పలువురికి విభ్రాంతి కలిగించింది. ఆ కేసులోని నిజానిజాల్ని, విషాదాలు, సంబరాలను అలా ఉంచితే తెలుగుదేశం, వైకాపాతో పాటు మనందరం పార్టీలు, ప్రాంతాలకతీతంగా కొంత నింపాదిగా ఆలోచించవలసిన విషయాలు ఇందులో ఉన్నాయి.

చంద్రబాబు నాయుడు ఒకప్పుడు దేశంలోనే అత్యంత సంపన్న ముఖ్యమంత్రిగా పేరు పొందారు. అప్పుడు ఆయన అవినీతిపై రకరకాల ఆరోపణలు వచ్చాయి. అదంతా గతమని, కొన్నేళ్లుగా ఆయన వ్యక్తిగతంగా అవినీతికి ఆస్కారం లేకుండా వ్యవహరిస్తున్నారని ఆయన్ను దగ్గరగా గమనిస్తున్నవారు చెబుతున్నారు. ఈ మధ్యకాలంలో చంద్రబాబు వ్యాపారాల తీరు గమనిస్తున్నవారికి అది కొంత నమ్మశక్యంగానే అనిపిస్తుంది. ఆయన కూడా కొన్నేళ్లపాటు వరుసగా తన ఆస్తుల వివరాల్ని ప్రకటించే ఆనవాయితీ పాటించారు. ఇలా నిజాయతీగా ఉంటే, మరి ఆయన మీద ఎందుకు 2014లో రాష్ట్ర విభజన తర్వాత కూడా ఆరోపణలు వచ్చాయి?

చంద్రబాబు మీద ఇప్పుడు వస్తున్న ఆరోపణలు ప్రధానంగా రాష్ట్ర విభజన జరిగాక ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనివే. 2019 ఎన్నికల్లో చంద్రబాబు పార్టీ ఓడిపోవటానికి పై నుంచి స్థానిక జన్మభూమి కమిటీల వరకు వివిధ స్థాయిల్లో జరిగిన అవినీతి కూడా ప్రధాన కారణమనే బలమైన అభిప్రాయం ఉంది. తెలంగాణలో వచ్చిన ఓటుకు నోటు కేసు సహా ఈ ఆరోపణలన్నీ చూస్తే, సమస్య చంద్రబాబు వ్యక్తిగత అవినీతిలో లేదు.. లెక్కలు చూపని, అవినీతి డబ్బుమయమైన సాంప్రదాయ రాజకీయాన్ని పెంచి పోషించటం, అందులో ఆయన కొట్టుకుపోవటంలో ఉందని భావించాల్సి ఉంటుంది.

తెలుగుదేశం పార్టీని పెట్టినప్పుడు అంతా ఎన్.టి రామారావు చుట్టూ తిరిగినా, ఆ పార్టీని ప్రజల నుంచి వచ్చిన అనేకమంది నాయకులు తమ సొంత ఆస్తిగా భావించారు. నాటి టీడీపీ ఆశయాల్ని నెత్తిన పెట్టుకుని వాటి కోసం పనిచేశారు. అలాగే ఎన్నికల్లో డబ్బు రాజకీయం చేయలేదు. పదివేల రూపాయలతో ఎన్.టి.ఆర్ తన ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకున్న నియోజకవర్గాలు అనేకం ఉన్నాయి. అలాగే పరిపాలనను వికేంద్రీకరించి ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య అంతరాలను తొలగించేందుకు రామారావు గట్టి ప్రయత్నం చేశారు. ఈవేళ తెలుగుదేశం ఇందుకు విరుద్ధంగా వెళ్తోంది. పరిపాలనలోనే కాదు, పార్టీలో కూడా విపరీత కేంద్రీకృత ధోరణులు పెరిగాయి. ఎన్నికల్లో ఎన్ని కోట్లు పంచగలవు, పార్టీకి ఎంత డొనేషన్ ఇవ్వగలవు అనేవే నాయకత్వాన్ని, ఎన్నికల్లో అభ్యర్థులను నిర్ణయిస్తున్నాయి. అసలు ఎన్నికల్లో డబ్బును ఇంత పెద్దఎత్తున పందేరం చేసే సంస్కృతిలో ఇతర రాష్ట్రాలకు తెలుగునేల ఆదర్శం కాగా, తెలుగునాట ఇంత డబ్బు రాజకీయ సంస్కృతికి ఆద్యుడు చంద్రబాబు నాయుడు అని చెప్పవచ్చు.

దేశంలో తొలి ఎన్నికలు జరిగిన 1952 లోనే కొన్ని చోట్ల



ఓటుకు రూపాయి ఇచ్చారని, సారా పంచారని చెబుతుంటారు. అపార పేదరికం, నిరక్షరాస్యత ఉన్న దేశంలో ఓటంటే ఏమిటో, ఓటుకు, తన జీవితానికి మధ్య సంబంధం ఏమిటో ప్రజలకు తెలియని వ్యవస్థను నిర్మించటంతో ఓటర్లను పోలింగ్ బూత్‌లకు రప్పించటానికి ఒక కోలాహలం, సంబరం, పండుగలాగా ఎన్నికల్ని నిర్వహించటం ఆనవాయితీగా మారింది. ఆ సంబరంలో పదో, పరకో కానుకలా ఇవ్వటం తప్ప విధిగా డబ్బు పంచటం ఉండేది కాదు. ఆ డబ్బు పంచటాన్ని, తీసుకోవటాన్ని కూడా చాలా సందర్భాల్లో చాటుగా, అపరాధ భావనతోనే చేసేవారు. ఓటుకు ప్రజలు నోటు తీసుకునే ధోరణి లేదు కాబట్టే ఎన్‌టీఆర్ నామమాత్రపు డబ్బుతో అనేకమంది అభ్యర్థుల్ని గెలిపించుకోగలిగారు. కానీ చంద్రబాబు హయాం వచ్చేసరికి పరిస్థితి మారింది.

ఎన్.టి.ఆర్‌ను వివాదాస్పదంగా గద్దె దించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. తన మీదున్న విమర్శలను మరపించేందుకు ఎలాగోలా గెలవాలనే ఆరాటంలో అప్పటి ఓ ఉప ఎన్నికలో భారీగా డబ్బు పంపిణీని మొదలుపెట్టారు. ప్రకాశం జిల్లాలో అలా మొదలైన పెద్దఎత్తున డబ్బు పంపిణీ ఆ తర్వాత సాధారణ ఎన్నికల్లో కూడా మామూలైపోయింది. ప్రతి ఎన్నికకూ డబ్బు ప్రభావం పెరుగుతూ పోతోంది. ఈశాన్య రాష్ట్రాలు సహా దేశంలోని పలు రాష్ట్రాలలో ఈ ధోరణి ప్రబలింది. ఈవేళ డబ్బు లేకుంటే ఓటు వేయబోమని ఓటర్లు మీడియా సమక్షంలో ధర్నా చేసే పరిస్థితి ఏర్పడింది. ఉప ఎన్నికల్లోనైతే ఇది కనీవినీ ఎరుగని కొత్త పుంతలు తొక్కింది. తెలంగాణలో హుజూరాబాద్, మునుగోడులో జరిగిన ఉప ఎన్నికలు ప్రపంచ రికార్డు సృష్టించాయని చెప్పవచ్చు. 2019లో బ్రిటన్ పార్లమెంటు ఎన్నికల్లో రెండు ప్రధాన పార్టీలు, మొత్తం అభ్యర్థులూ చేసిన ఖర్చు కంటే మునుగోడులో పార్టీలు ఎక్కువ ఖర్చు పెట్టాయి. ఎన్.టి.ఆర్ తన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించుకోవటానికి చేసిన ఖర్చుతో మునుగోడులో ఒక ఇంట్లో ఓట్లు కూడా కొనటం సాధ్యం కాని పరిస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యే అభ్యర్థి 30, 40 కోట్లు ఖర్చు చేయను అంటే గెలుపోటముల సంగతి అలా ఉంచి, చాలా సందర్భాల్లో అసలు అభ్యర్థిగా కూడా ప్రజలు పరిగణలోకి తీసుకోవటం లేదు. డబ్బు నుంచి అధికారం, తిరిగి అధికారం నుంచి డబ్బు.. అనే ప్రమాదకర సైకిల్‌కి చంద్రబాబు దోహదం చేశారు. ఇదో విషవలయంగా మారిందని గుర్తించాక కూడా మార్చే ప్రయత్నం చేయకుండా, అందులో కొట్టుకుపోతూ, ఎన్నికల్లో గెలుపు కోసం అభివృద్ధికి, తాత్కాలిక సంక్షేమ పథకాలకు మధ్య సమతూకాన్ని కూడా పట్టించుకోని పరిస్థితికి చేరుకోవటం వల్లే చంద్రబాబు అవినీతి నుంచి బయటపడలేకపోతున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన దగ్గర్నుంచి ఆయన రాజకీయాన్ని ఎంతో దగ్గరగా చూస్తున్న ఓ ప్రముఖ జర్నలిస్టు ఇటీవలి తన కాలమ్‌లో చంద్రబాబు అరెస్టు గురించి రాస్తూ, 'దేశంలోని అనేకమంది నాయకుల వలె చంద్రబాబు కూడా పార్టీ అవసరాల కోసం డబ్బు తీసుకుని ఉంటారు. ఆయన ఎవరి దగ్గరా డబ్బు తీసుకోలేదని చెప్పటం అతిశయోక్తి అవుతుంది' అన్నారు. అక్కడే ఇంకో మాట కూడా రాశారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ విలేకరులతో మాట్లాడుతూ, 'పార్టీ అవసరాల కోసం మేం బరాబర్ డబ్బు తీసుకుంటాం. ఎవరు మాత్రం తీసుకోవటం లేదు?' అన్న విషయాన్ని కూడా పేర్కొన్నారు. నిజమే, ఇది బహిరంగ రహస్యం.

పార్టీలు అక్రమంగా డబ్బు సేకరించకపోతే, ఎన్నికల్లో అంతంత డబ్బు ఖర్చు పెట్టలేవు. ప్రజల నుంచి పెద్దఎత్తున ఓట్లు కొనలేవు. ఫిరాయింపుల్ని ప్రోత్సహించి అధికార క్రీడలు సాగించలేవు. ఎన్నికల వ్యయంలో అత్యధిక భాగం ఓట్ల కొనుగోలుకే ఖర్చవుతుంది. ఇలా డబ్బు వసూలు చేసే క్రమంలో దొరికిన నేతలు దోషులవుతారు, మిగతావాళ్లు నిజాయతీపరులన్నట్లు నటిస్తారు. జాతీయ, ప్రాంతీయ తేడా లేకుండా అన్ని పార్టీలూ ఇందులో భాగస్వాములు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తాను వ్యక్తిగతంగా నిజాయతీపరుడినని చెప్పుకోగలరు గానీ, తన పార్టీ అవినీతి సొమ్మును విరాళంగా తీసుకోలేదని చెప్పగలరా? ఈ పరిస్థితుల్లో, అధికారంలో ఉన్నవాళ్లు అధికారంలో లేనివాళ్లను వేధించటానికి ఈ లావాదేవీల్ని ఉపయోగించుకుంటున్నారు. దర్యాప్తు సంస్థల్ని, పోలీసుల్ని అడ్డంపెట్టుకుని ప్రతిపక్షాల్ని హింసించటం, ముఖ్య నేతల్ని జైళ్లపాలు చేయటం వంటివి చేస్తున్నారు. చట్టం ముందు ఈ పార్టీ, ఆ పార్టీ అని తేడా లేకుండా అందరూ సమానమే అన్నట్లు వ్యవహరిస్తే సమస్య లేదు, కానీ ఈ కేసులకు కోర్టులో శిక్షలు పడతాయా లేదా అన్నది వారికి ముఖ్యం కాదు. ప్రతిపక్షాల్ని భయపెట్టి అదుపు చేశామా, వారి మీద ప్రతీకారం తీర్చుకున్నామా అనేవే వారికి ముఖ్యం. ప్రతిపక్షాలు కూడా

తాము అధికారంలోకి వస్తే తామూ ప్రతీకారం తీర్చుకుంటామంటున్నాయి తప్ప ఈ లోపాల్ని సవరించే మార్పులు తీసుకొస్తామని చెప్పటం లేదు.

కొంతమంది యధాతథవాదులు.. అక్రమంగా డబ్బు సంపాదిస్తున్న పార్టీలతోపాటు ఆ నోట్లకి ఓటు అమ్ముకుంటున్న ప్రజలు కూడా నేరస్తులేనని, కాబట్టి వాళ్లనూ జైళ్లలో పెట్టాలని గడుసుగా వాదిస్తున్నారు. మన దేశంలో ఉన్న మొత్తం జైళ్లలో పట్టే ఖైదీల కంటే ఒక లోక్‌సభ నియోజకవర్గంలో డబ్బు తీసుకునే ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఎంతమందిని జైళ్లలో పెట్టగలరు?.. కాబట్టి సంక్షోభం తీవ్రమైనది.

ప్రజాస్వామ్యంలో దశాబ్దాలుగా ప్రభుత్వాలు తాము చేయాల్సిన విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, ఉపాధి కల్పన, చట్టబద్ధపాలన వంటి అంశాల్లో ఘోరంగా విఫలమవటం వల్ల బాధితులుగా ఉన్న ప్రజల్ని ఈ విషయంలో దోషులుగా చూడటం అన్యాయమవుతుంది. నిజాయతీలో మన ప్రజలు ప్రపంచంలో ఎవరికీ తీసిపోరు. వారిని సరైన దిశలో నడిపించే ప్రోత్సాహకాల వ్యవస్థను నిర్మించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది, నాయకులది. ఆ పని చేయకుండా రాజకీయాన్ని కుస్తీ పోటీలా, 20-20 మ్యాచ్‌లా మార్చటం, అధికారం లేకపోతే బతకలేం, ఎలాగోలా అధికారంలోకి రావాలి లేదా అధికారాన్ని కాపాడుకోవాలి అనే పరిస్థితి చుట్టూ రాజకీయాన్ని కొనసాగిస్తూ, ప్రవాహంలో కొట్టుకుపోతుండటం వల్లే చంద్రబాబు ప్రస్తుత పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చింది.

అలాగే తెలుగు రాష్ట్రాల్లో, మన దేశంలో మొదట్నుంచి చట్టబద్ధపాలన లేదు. అది బాగు చేయకుండా కేవలం సమాజంలో ఉన్న సాంప్రదాయ కట్టుబాట్లను ప్రాతిపదికగా చేసుకుని వ్యవహరించటం, వైకాపా వ్యవస్థాపకుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలను రాజ్యాంగ ప్రజాస్వామ్య కోణంలో కాకుండా నైతిక సంక్షోభంగా చిత్రీకరించే ప్రయత్నం చేయటం.. జైలుకెళ్లటం అవమానకరం, జైలుకెళ్లాడు కాబట్టి జగన్ అధముడు, జైలుకు వెళ్లలేదు కాబట్టి తాను నిప్పును, చరిత్ర సృష్టించిన వ్యక్తిని అని చాటుకునే ధోరణితో చంద్రబాబు పాతకాలంలోలా మిథ్యావిలువల చట్రంలో ఇరుక్కుపోయారు. మారుతున్న పరిస్థితులకనుగుణంగా వ్యవహరించే శక్తి గల జగన్ లాంటి వ్యక్తి ప్రత్యర్థి కావటంతో పరిస్థితులు చంద్రబాబుకి వ్యతిరేకంగా మారాయి. చంద్రబాబు తరహాలో పాతకాలపు మధ్యతరగతి భ్రమలు, భేషజాలు జగన్‌కు లేవు. ఆయనకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం వంటి విలువల పట్ల లోతైన అవగాహన ఉన్నట్లు కనిపించదు గానీ, జనాభాలో అత్యధికంగా ఉన్న యువత ఆలోచనాతీరుకనుగుణంగా వ్యవహరిస్తూ పాతకాలపు డొల్ల విలువల ఊకదంపుడు ఉపన్యాసాలు కాకుండా, యువతకు కనెక్ట్ కాగలిగే భావోద్వేగాలు, భాషతో వ్యవహరించటం వల్ల ఆకర్షణ పెంచుకోగలిగారు.

తన పార్టీ ఉనికి కోసమైనా తనలోని సాంప్రదాయ ధోరణుల్ని మార్చుకుని సాంప్రదాయ రాజకీయాన్ని ఛేదించే ప్రయత్నాన్ని చంద్రబాబు చిత్తశుద్ధితో చేయలేదు. 2014లో తాను చాలా తక్కువ మార్జిన్‌తో జగన్ పార్టీపై నెగ్గినా కూడా ఆ అంశాన్ని కీలకంగా పరిగణలోకి తీసుకోకుండా, జగన్‌కి ప్రత్యామ్నాయాన్ని ఆవిష్కరించే పద్ధతుల్ని అనుసరించకుండా, తాను చేసిన ఆర్థిక మంచిని కూడా స్పష్టంగా తెలియచేసే దృక్పథాన్ని, భాషని ఉపయోగించకుండా జగన్ తరహాలో తాత్కాలిక తాయిలాలు, రాజకీయ సంస్కృతిని అనుసరించారు. పార్టీ అవసరాల కోసం చుట్టూ అవినీతిపరుల్ని చంద్రబాబు అనుమతిస్తూ తాను నిప్పులాంటి వాడినని చెప్పుకోవటం ఎబ్బెట్టుగా అనిపిస్తూ ప్రజల్లో నమ్మకం కొరవడింది. ఈ నేపథ్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఆయనపై సరైన సాక్ష్యాధారాలు లేకపోవటం, అలాగే చట్టబద్ధపాలన అమలుకాని మన దేశంలో పోలీసులు, ముఖ్యంగా నేర పరిశోధన విభాగంలోని పోలీసుల్లో ఎక్కువమంది అధికార పార్టీకి ప్రైవేటు సైన్యంలా వ్యవహరిస్తారన్నది బహిరంగ రహస్యం కావటంతో చంద్రబాబు అరెస్టు పట్ల ఎక్కువ వ్యతిరేకత వచ్చింది తప్ప ఆయన ప్రభుత్వంలో అవినీతిని అనుమతించలేదన్న భావంతో కాదు. అవినీతికి ఆస్కారం లేని పాలన చంద్రబాబు అందించారన్న భావం దాదాపు ఏ ఒక్కరిలో లేదు. చంద్రబాబు వ్యక్తిగతంగా అవినీతికి పాల్పడి సొమ్ము పోగేసుకునే ఉద్దేశం లేదని నమ్మవచ్చు. అలాగే తనను ప్రజలు నిప్పు అనుకోవాలని ఆయన కూడా భావిస్తున్నారు. అలాంటప్పుడు జగన్‌లాంటి వాళ్ల చేతిలో ఈ వయసులో అన్ని అవస్థలు పడుతున్నానని బాధపడేకంటే, అసలు ఎన్నికల కోసం అవినీతికి పాల్పడాల్సిన పరిస్థితి రాకుండా, నేరస్తులకు టికెట్లివ్వాల్సిన అవసరం లేకుండా, ఏ నాయకుడినీ మెప్పించాల్సిన, ఒత్తిడి ఎదుర్కోవాల్సిన అవసరం లేకుండా కొన్ని మౌలిక సంస్కరణల్ని తీసుకురావటం గురించి ఆలోచన ఎందుకు చేయటం లేదు?.. వీటి కోసం మరో రాజ్యాంగమేమీ అక్కర్లేదు. మీరు రోజువారీ చెప్పే నీతుల్ని ఆచరణలో చూపే వ్యవస్థల్ని ఏర్పాటు చేస్తే చాలు. పార్టీని ఎన్నికల్లో గెలిపించటం కోసం అక్రమంగా డబ్బు తీసుకుంటున్నామని, ఆ డబ్బును ప్రజలకు పంచి ఓట్లు కొనుక్కుంటున్నామని బహిరంగంగా చెప్పి, వాటిని చట్టబద్ధం చేయటం ఎప్పటికీ సాధ్యం కానప్పుడు, వాటిని సంస్కరించటం తప్ప మరో మార్గం ఉందా?

సాంప్రదాయ రాజకీయంలో కొట్టుకుపోకుండా, అందులో ఎప్పటికప్పుడు కొత్త పాచికల మధ్య ఒత్తిడినెదుర్కోకుండా, భవిష్యత్తు వైపు వెళ్లటం తప్ప గతం వైపు జారిపోకుండా ఉండాలంటే చంద్రబాబుకే కాదు, ఏ పార్టీ వారికైనా ఈ మార్పులు తప్పనిసరి. ఇందులో మొదటిది ఎన్నికల సంస్కరణలు. ఒక్క ఓటు ఎక్కువ వస్తే గెలిచినట్లు, తక్కువ వస్తే వచ్చిన ఓట్లన్నీ వేస్టు అనే మన ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ వల్ల మన దేశంలో పోటీ విపరీతమైంది. ప్రతి ఓటుకీ విలువ లేకపోయినా, ప్రతి ఓటు కోసం విపరీతంగా ప్రయాసపడాల్సిన ఎన్నికల వ్యవస్థ మనది. పేదరికం ఎక్కువగా, అక్షరజ్ఞానం, ఆధునిక ప్రజాస్వామ్య

# అధికారంలో లేకపోతే పార్టీ నడపటం ఎందుకు కష్టం?

వచ్చేసారి అధికారంలోకి రాకపోతే పార్టీని నడపటం కూడా కష్టమనే భావం చాలా సాంప్రదాయ పార్టీల పట్ల వినిపిస్తుంటుంది. తెలుగుదేశం పట్ల కూడా ఆ మాట వినిపిస్తోంది. ఇటీవల మరీ పెద్దగా వినిపిస్తోంది. దీనర్థం అధికారానికి, పార్టీ మనుగడకు అవినాభావ సంబంధం ఉందని, అధికార దుర్వినియోగం అనివార్యమని. ఎన్నికల్లో 30-40 కోట్లు ఖర్చు పెట్టిన వాళ్లు ప్రజాసేవ చేస్తారా? ఆ డబ్బు తిరిగి వసూలు చేసుకోవటం కోసం, కొంత సొంతంగా నొక్కేయటం కోసం, మళ్లీ వచ్చే ఎన్నికలకి కొంత డబ్బు రెడీ చేసుకోవటం కోసం అక్రమాలు, అవినీతికి పాల్పడేవాళ్లే ఎక్కువమంది ఉంటారు. ఇంకొందరు వ్యక్తిగతంగా అవినీతి సొమ్మును పోగేసుకోకుండా కేవలం ఎన్నికల్లో అవసరాలకు మాత్రమే అక్రమ సంపాదనని పరిమితం చేసుకుంటారు. వ్యక్తిగతంగానూ, పార్టీ పరంగానూ అక్రమ మార్గాల్లో డబ్బు సంపాదించని కొద్దిమంది ఈ డబ్బు రాజకీయాన్ని ఎదిరించలేక నిస్సహాయంగా మిగిలిపోతున్నారు.

అనుభవం తక్కువగా ఉన్న మన దేశంలో ఇది విపరీత ప్రలోభాలకు దారితీసింది. ఓట్ల కొనుగోలు మాత్రమే చాలక.. తాత్కాలిక తాయిలాలు, ఓట్ల కోసం అన్ని వర్గాలనూ సమీకరించే ప్రయత్నం చేస్తూనే మరోపక్క కులం, మతం, ప్రాంతం వంటివి రెచ్చగొట్టటం పెరిగిపోయాయి. దీంతో, అధికారాన్ని గొప్పగా భావించే, పూజించే మన సమాజంలో ఎన్నికలు జీవన్మరణ పోరాటంగా మారాయి. ప్రతి ఓటు కోసం ఇంత రాజ్యాంగవిరుద్ధ రాజకీయం చేయాల్సిన ప్రస్తుత ఎన్నికల విధానాన్ని మార్చి ప్రతి ఓటుకూ విలువ ఉండేలా, అదే సమయంలో ప్రతి ఓటు కోసం ఎగబడాల్సిన అవసరం లేకుండా ఉండే ఎన్నికల మార్పుల్ని తీసుకురావాలి. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రిని ప్రత్యక్షంగా ఎన్నుకునే ఏర్పాటు చేస్తే ఎన్నికల్లో కోట్ల రూపాయల ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదు. అలా ఖర్చు చేసినా ఆ ఎన్నికల వ్యవస్థలో ఉపయోగం ఉండదు. అదేసమయంలో రాష్ట్రంలో, జాతీయ స్థాయిలో దామాషా ఎన్నికల పద్ధతిని మన దేశ పరిస్థితులకనుగుణమైన మార్పులతో ప్రవేశపెడితే, చాలావరకు డబ్బు రాజకీయం తగ్గి ఎన్నికల అవసరాల కోసం అవినీతికి పాల్పడాల్సిన అవసరం నాయకులకు ఉండదు. సమర్థులు, నిజాయతీపరులు పోటీకి ముందుకొచ్చి పార్టీలకి జవజీవాలద్దుతారు. జమిలి ఎన్నికల మీద చర్చను ఈ దిశగా మరల్చగలిగే సంకల్పాన్ని చంద్రబాబు ప్రదర్శించి మద్దతు కూడగట్టాలి. ఇదేసమయంలో అధికారాన్ని విపరీతంగా కేంద్రీకరించటం వల్ల స్థానిక ప్రభుత్వాలు బలహీనపడి జనజీవితం దుర్భరమైంది. ప్రభుత్వ కార్యాలయాల్లో వలసపాలన కాలం నాటి ధోరణులు కొనసాగుతూ ప్రజలకు అందే సేవల్లో లంచాలు, వేధింపులు మామూలయ్యాయి. దీంతో సర్టిఫికెట్లు, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు వంటి వాటికి కూడా ప్రజలకు అండగా నిలవాల్సిన బాధ్యత పార్టీలపై పడి, అందుకోసం ప్రతి నియోజకవర్గంలో భారీ కార్యకర్తల యంత్రాంగాన్ని పోషించాల్సిన అవసరం పార్టీలకు, నాయకులకు ఏర్పడింది. ఇది కూడా ఎన్నికల ఖర్చులో, అందుకోసం అడ్డదారుల్లో సంపాదించాల్సిన వనరుల ఖాతాలో చేరింది. ఈ నేపథ్యంలో పాలనలాగే పార్టీ కూడా కేంద్రీకృతమై కేవలం కొద్దిమంది వ్యక్తులు, వారి కుటుంబాల ఆస్తిగా మారింది. ఈ సంస్కృతి వల్ల కూడా తెలుగుదేశం పార్టీ బలహీనపడింది. పార్టీలో ఉన్న నేతల సామర్థ్యం కంటే వంశపార్యం అర్హతగా మారింది. ఎన్నికల్లో టికెట్లు కూడా అదే రీతిలో అప్రజాస్వామ్యంగా, పక్షపాత ధోరణితో ఇస్తున్నారు. దీనివల్ల కూడా పార్టీలకు సామర్థ్యం కొరవడుతూ ప్రజాస్వామీకరణ కొరవడుతోంది. చంద్రబాబు జైల్లో ఉంటే, పార్టీని ఎలా నడపాలి, ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలి అని ఆ పార్టీ నేతలు ఆందోళన చెందే పరిస్థితి ఎందుకొచ్చింది? తెలుగునాట ఏమూలకెళ్లినా ఆ పార్టీకి అనేకమంది సమర్థ నాయకులున్నారు. ఎటువంటి కార్యక్రమాన్నయినా హ్యాండిల్ చేయగల సామర్థ్యం వారికుంది. అయినా పార్టీ నాయకత్వ స్థానాల్లో వాళ్లని ఒక స్థాయికి మించి ఎదగనియ్యలేదు. పార్టీలోని అప్రజాస్వామిక సంస్కృతి వల్ల చంద్రబాబు అరెస్టు ఆ పార్టీకి ఓ పెద్ద సంక్షోభంగా మారింది. ఎన్‌టీఆర్ పెట్టిన ముహూర్త బలం గొప్పది కాబట్టి తెలుగుదేశానికి ఏమీ అవదు, అన్నగారు పెట్టిన పార్టీ కాబట్టి ఎవరూ ఆ పార్టీని ఏమీ చేయలేరు అంటూ మెట్టవేదాంతాలు వల్లించాల్సిన దయనీయ స్థితి వచ్చింది. పార్టీల్ని ప్రజాస్వామీకరించి ప్రజల ఆస్తులుగా మారిస్తే సమర్థ నాయకత్వం వచ్చి ఆ పార్టీలు కూడా బలపడతాయి. డబ్బు నుంచి అధికారం, అధికారం నుంచి డబ్బు అనే విషవలయం నుంచి పార్టీలు బయటపడగలుగుతాయి.

అదేవిధంగా పోలీసుల చేతిలో తాను అనుచిత ప్రవర్తనకు, మానసిక వేధింపులకు గురయ్యానని చంద్రబాబు వాపోవాల్సి వచ్చింది. రాజును మించి రాజభక్తిని ప్రదర్శిస్తూ పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు. చట్టబద్ధపాలన ప్రధానంగా రాష్ట్రాల అంశం. కానీ ఇప్పటిదాకా పోలీసు వ్యవస్థను బాగు చేసి, చట్టం అందరికీ సమానంగా వర్తించేలా చేయటానికి ప్రత్యేకించి చంద్రబాబు చేసిన పెద్దమార్పులేవీ లేవు. కనీసం కేరళలోలా పోలీసు వ్యవస్థను ఆధునీకరించి ప్రజలకు చేరువ చేయలేదు. ఎంతసేపూ, మేం అధికారంలోకి వస్తే మీ భరతం పడతాం, అంతకంత ప్రతీకారం తీర్చుకుంటామని హూంకరించటమే తప్ప చట్టం అందరికీ సమానంగా వర్తించేలా చేస్తాం, కక్షసాధింపు రాజకీయాలకు ఇక అవకాశం లేకుండా చేస్తామని అనటం లేదు. ఇంత వేధింపులు జరిగాయని ఆక్రోశించటం తప్ప

ఇప్పటికీ సమస్య మూలాల్లోకి వెళ్లటం లేదు. పోలీసు వ్యవస్థను సంస్కరించి శాంతిభద్రతలు మాత్రం రాజకీయం పరిధిలో ఉండేలా, కేసుల దర్యాప్తు పోలీసులు జవాబుదారీతనంతో స్వతంత్రంగా వ్యవహరించేలా చర్యలు తీసుకుంటే ఈ సమస్య తలెత్తేదే కాదు. అలాగే తాను చేయని నేరానికి కేసు ఎదుర్కొని జైలు కెళ్లానని ఆయన వాపోతున్నారు. ప్రాసిక్యూషన్ వ్యవస్థలో సంస్కరణల గురించి ఏనాడూ మాట్లాడకుండా పార్టీల పట్ల పక్షపాతం చూపేవారినే ఆయన హయాంలో కూడా నియమించారు. స్వతంత్ర, సమర్థ ప్రాసిక్యూషన్‌కు ఏర్పాట్ల గురించి ఆలోచించలేదు. అలాగే న్యాయమూర్తుల తీర్పుల్లో నాణ్యత కోసం ఐజేఎస్ వంటి పద్ధతుల ఏర్పాటు మీద దృష్టి పెట్టలేదు. ఇవన్నీ కలగలసి ఇప్పుడు చంద్రబాబును జైల్లోకి నెట్టాయి. చంద్రబాబుకి మద్దతు పలికి జైల్లో ఆయనతో భేటీ అయిన వెంటనే బయటికొచ్చి ఎన్నికల్లో తెలుగుదేశంతో కలసి పోటీ చేస్తామని ప్రకటించిన జనసేన వ్యవస్థాకుడు పవన్ కళ్యాణ్ కూడా ఈ విషయాలు మాట్లాడటం లేదు. ఇప్పుడు జగన్ మాట వింటున్న పోలీసులు ఎన్నికలయ్యాక తన మాట వినాల్సి వస్తుందంటున్నారు తప్ప, చట్టబద్ధపాలనను సంస్కరిస్తామనటం లేదు. జనసేన భావజాలం దేశవ్యాప్తమవుతుందని ఇటీవల మచిలీపట్నం ప్రచారంలో పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఎందుకు? చట్టబద్ధపాలన లేనందుకా?

ఈ నేపథ్యంలో చంద్రబాబు ఒక పార్టీ అధ్యక్షుడిగా, రాష్ట్రంలో తిరిగి పాలనా పగ్గాలు అందుకోవాలనుకుంటున్న నాయకుడిగా తన సుదీర్ఘ రాజకీయ జీవితం, అందులో ముఖ్యమంత్రి సహా వివిధ హోదాల్లో తనకు లభించిన అవకాశాల గురించి లోతైన సమీక్ష గావించుకోవాలి. చట్టబద్ధపాలన, అధికార వికేంద్రీకరణ, ఎన్నికల సంస్కరణలు, పార్టీని ప్రజాస్వామీకరించటం మొదలైన సంస్కరణల కోసం గొంతు విప్పాలి. తనకు మళ్లీ పాలనావకాశం వస్తే ఆ సంస్కరణలను వేగంగా తీసుకొచ్చి సమర్థంగా అమలు చేయాలి. తెలుగుదేశం పార్టీకి సుదీర్ఘ భవిష్యత్తు, తన ప్రజాజీవితానికి చరిత్రలో తగిన స్థానం లభించాలంటే ఇది ఆయన ముందున్న సరైన మార్గం. ఆర్థిక రంగంలో కొన్ని కీలక సంస్కరణలకు, అలాగే పాలనలో కూడా సాంకేతికత వినియోగం సహా కొన్ని మంచి మార్పులకు నాంది పలికిన ముఖ్యమంత్రిగా చంద్రబాబు మౌలిక రాజకీయ, పాలనా సంస్కరణలకు సంకల్పాన్ని ప్రదర్శించాలి.

ఎన్నికల్లో నల్లడబ్బుతో ఓట్ల కొనుగోలుకి ఈవేళ ఏ ప్రధాన పార్టీ అతీతం కాదు కాబట్టి.. తెలుగుదేశం పార్టీ, జనసేన, వైకాపా, మరో పార్టీ వారు గానీ, అసలు ఏ పార్టీకీ చెందనివారు గానీ పౌరులుగా, సమాజంగా మనందరం స్కిల్ డెవలప్‌మెంట్ కేసు ఎపిసోడ్‌లో పార్టీల్ని, ప్రభుత్వాల్ని చేయాల్సిన ఆరోగ్యకరమైన డిమాండ్లు ఇవి.

# ఎన్నికల మార్గదర్శకాలను సవరించాలి

త్వరలో జరగనున్న తెలంగాణ ఎన్నికల్లో డబ్బు, మద్యం కీలక భూమిక పోషించనున్నాయని, గతంలో జారీ చేసిన మార్గదర్శకాలను సవరించాల్సిన అవసరం ఉందని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు లేఖ రాశారు. 'ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి రూ.25 వేలకు మించి నగదుతో తిరగకూడదన్న విషయాన్ని ఇప్పటి నుంచే ప్రచారం చేయాలి. డబ్బు, మద్యం తదితరాలు పంపిణీ చేస్తూ పట్టుబడిన సందర్భాల్లో ఆ పార్టీ నాయకులపై కాకుండా ఎమ్మెల్యే అభ్యర్థిపైనే కేసు నమోదు చేయాలి. పోలింగ్‌కు ఒక రోజు ముందు మొదలుపెట్టకుండా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచే మద్యం దుకాణాలు మూసివేయాలి' అంటూ వివిధ సూచనల్ని లేఖలో పేర్కొన్నారు.

# ఆ నిధుల్ని నిలిపివేసే చర్యలు తీసుకోండి

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి నిధి (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) పేరుతో జిల్లా కలెక్టర్ వద్ద ఉంచిన నిధులను తక్షణం స్తంభింపచేయాలని సీఈసీకి పద్మనాభరెడ్డి మరో లేఖ రాశారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఈ నిధులను వినియోగిస్తున్నారన్నారు. 'ముఖ్యమంత్రి కార్యాలయంలో అందుబాటులో ఉండేలా రూ.పది వేల కోట్లను ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ప్రత్యేక నిధిని కేటాయించింది. సాధారణంగా బడ్జెట్‌లో వివిధ శాఖలకు కేటాయించిన నిధులపై చర్చించి ఆమోదించాల్సి ఉంటుంది. ఈ విధానాలను పక్కన పెట్టిన ప్రభుత్వం ఆ నిధి నుంచి ఎన్నికల ముందు ఎమ్మెల్యేలకు కేటాయింపులు చేస్తోంది. ఈ చర్యలు ఎన్నికలపై ప్రభావం చూపుతాయి. ఎన్నికలు ముగిసేంత వరకు ఆ నిధుల వినియోగాన్ని నిలిపివేయాలి' అని ఎన్నికల సంఘాన్ని పద్మనాభరెడ్డి కోరారు.

# మార్పు కోసం మహిళా సాధికారత

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**



మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్ కల్పించేందుకు ఉద్దేశించిన 128వ రాజ్యాంగ సవరణ ఆమోదంలో భారత రాజకీయ వ్యవస్థ అరుదైన ఏకాభిప్రాయం కనబరిచింది. అన్ని రాజకీయ పార్టీలూ దాదాపు ముక్తకంఠంతో బిల్లుకి మద్దతిచ్చాయి. మానవ సమాజంలో సగ భాగం మహిళలు. అయినా అతివలకు తొలి నుంచి ఓటు హక్కును అందించిన మొదటి రిపబ్లిక్ భారత్ మాత్రమే. పరిణతి చెందిన అనేక ప్రజాస్వామ్య దేశాల్లో సమాన పౌరులుగా గుర్తింపు పొందటానికి మహిళలు సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలు చేయాల్సి వచ్చింది. కొత్తగా ఏర్పాటు చేస్తున్న గణతంత్ర ప్రజాస్వామ్యంలో మహిళలకి సమాన పాత్ర కల్పించటం విస్మరించొద్దని అమెరికా రెండవ అధ్యక్షుడు జాన్ ఆడమ్స్ సతీమణి అబిగెయిల్ ఆడమ్స్ తన భర్తతో వాదించారు. అయినా, 1787లో ఫిలడెల్ఫియాలో జరిగిన రాజ్యాంగ సదస్సు తెల్లజాతి పురుషులకు మాత్రమే ఓటు హక్కు ఇచ్చింది. ఎప్పుడో 133 ఏళ్ల తర్వాత 1920లో మహిళలకు ఓటు హక్కు లభించింది. బ్రిటన్‌లో మరో ఎనిమిదేళ్లు పట్టింది.

మహిళల చదువుని, వివిధ వృత్తులు, వ్యాపారాలలో వారి పాత్రను కుటుంబాలు ఆమోదించటం ఇటీవలి దశాబ్దాల్లో పెరిగింది. ఇప్పుడు దాదాపు ఏ కాలేజీ, యూనివర్సిటీ చూసినా అబ్బాయిల కంటే అమ్మాయిలు మిన్నగా రాణిస్తున్నారు. అయినా ప్రజాజీవితంలో మహిళల పాత్ర ఇప్పటికీ పరిమిత స్థాయిలోనే కొనసాగుతోంది. చట్టసభల్లో 1950లలో 5% ఉన్న మహిళల సంఖ్య ఇప్పుడు 15% దాకా చేరింది. రాజకీయాలు ఇప్పటికీ పురుషుల అడ్డాగానే ఉన్నాయి.

చట్టసభల్లో మహిళలకు ఇంకా ఎంతో ఎక్కువ ప్రాతినిధ్యం అవసరమనటానికి రెండు ప్రధాన కారణాలున్నాయి. మొదటిది, సమాజంలో సగభాగానికి సగం గొంతు, ప్రాతినిధ్యం ఉండాలి. పురుషాధిక్య సాంప్రదాయం, శతాబ్దాల తరబడి మహిళల అణచివేత కొనసాగిన నేపథ్యంలో అధికార సభల్లో మహిళలకు మరింత గళం, పాత్ర ఉండటం న్యాయం, అవసరం. ఇటీవల కొన్ని సంవత్సరాలుగా పట్టణీకరణ, పక్కవాళ్లెవరో కూడా తెలియని జీవనశైలి వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో మహిళల పట్ల హింస పెరుగుతోంది. ఇదే సమయంలో శ్రామిక శక్తిలో మహిళల పాత్ర ఇంకా తగ్గుతోంది. ఇప్పుడు 20% లోపే ఉంది. సంపదసృష్టిలో మహిళల పాత్రను కుదించేస్తే మెరుగైన వృద్ధి సాధించాలన్న మన కలలు నెరవేరవు. కాబట్టి మహిళలకు మరింత గొంతు, అధికారం ఇవ్వాలి.

రెండోది, మన ఫ్యూడల్ సమాజంలో, అంతరాల సంస్కృతిలో అధికారమంటే పెత్తనం చెలాయించటం, ఇతరులను నియంత్రించటం. అందువల్లే ప్రభుత్వంలో పదవి అంటే హోం (పోలీసు), రక్షణ (సైన్యం), ఆర్థిక, పన్నులు (డబ్బు), రెవెన్యూ (భూమి) వంటి శాఖలనే ఎక్కువమంది కోరుకుంటుంటారు. ఆధిపత్య భావజాలంలో కూరుకుపోవటం వల్లే ఆరోగ్యం, విద్య, కనీస సౌకర్యాలు, నైపుణ్యాలు, ఉపాధి కల్పన మొదలైన శాఖలను చిన్న చూపు చూస్తారు. మహిళల ప్రాతినిధ్యం పెరిగితే

పెత్తందారీ రాజకీయాన్ని పునర్నిర్వచించగలరు. రాజకీయమంటే సేవ తప్ప నియంత్రణ, ఆధిపత్యం కాదని నిరూపిస్తారు. ఓటర్లు, పన్ను చెల్లింపుదారులకు రోజువారీ జీవితంలో నిజంగా ఎంతో ముఖ్యమైన అంశాల మీద దృష్టి సారిస్తారు. మనం అధికార రాజకీయాల పట్ల ఆకర్షణను తొలగించాలి, ప్రజలకు సేవలు అందించటం, జవాబుదారీతనం, అధికార వికేంద్రీకరణలను ప్రోత్సహించాలి. తమ ఆకాంక్షల్ని, ప్రతిభాపాటవాల్ని పురుషుల ఎదుగుదల కోసం అణచివేసుకుంటూ ఒత్తిడితో సతమతమవుతున్న మహిళలు కుటుంబాల్లో, సమాజంలో మనకు నిత్యం కనిపిస్తుంటారు. అయితే ఇదే సమాజంలో, ఓటర్లు మహిళా నేతల పట్ల ఎటువంటి వ్యతిరేక భావాన్ని ప్రదర్శించరంటే అతిశయోక్తి కాదు.

1952 నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులను చూస్తే, నిజానికి పురుషుల కన్నా మహిళలే ఎక్కువశాతం ఎన్నికయ్యారు. గుర్తింపు పొందిన పార్టీల నుంచి 25% పురుష అభ్యర్థులు ఎన్నిక కాగా, మహిళల్లో ఆ సంఖ్య 33% దాకా ఉంది. అందుకే గత కొన్ని దశాబ్దాలలో మనకు పలువురు నిజమైన మహిళా నాయకులు కనిపిస్తారు; ఇందిరాగాంధీ, నందిని శత్పథి, జయలలిత, మాయావతి, వసుంధర రాజె, మమతా బెనర్జీ మొదలైనవారు ఓటర్ల నుంచి ఎటువంటి ప్రతిఘటన లేకుండా ఉన్నత స్థానాలకు ఎదిగారు.

మహిళా ప్రాతినిధ్యానికి సంబంధించి సమస్య ఓటర్లలో లేదు; మహిళా నాయకత్వాన్ని పెంచటంలో పార్టీల వైఫల్యంలో ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత మహిళా చట్టంలో ఉన్నట్లు.. ప్రతి ఎన్నికకు లేదా రెండు ఎన్నికలకోసారి రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్ ఏర్పాటు చేయటం వల్ల కీలుబొమ్మ మహిళా నాయకులు తయారవుతారు. తమ అధికారాన్ని కోల్పోవటాన్ని శాయశక్తులా వ్యతిరేకించే బలమైన పురుష నాయకులు తమ బదులుగా తమ కుటుంబంలోని మహిళా సభ్యులను నామినేట్ చేసి నిజమైన అధికారాన్ని మాత్రం తామే చెలాయిస్తారు. మహిళా సర్పంచ్ లేదా మునిసిపల్ నాయకురాలి భర్త నిజమైన అధికారాన్ని చెలాయించే 'పంచ్‌పతుల' సంస్కృతిని ఇప్పటికే చాలా స్థానిక ప్రభుత్వాల్లో చూస్తున్నాం. తమను తాము నిజమైన నాయకులుగా నిరూపించుకున్న మహిళా ప్రతినిధులకు రొటేషన్ విధానం వల్ల మరోసారి పోటీ చేసే అవకాశం లభించదు. దీంతో వారు చివరికి ప్రజాజీవితం నుంచి కనుమరుగవుతారు. రిజర్వేషన్ రొటేషన్ వల్ల తిరిగి ఎన్నికయ్యే అవకాశం లేకపోవటంతో ప్రతినిధుల్లోని మానవ సహజ స్వార్థాలను నియంత్రించి వారిని సమాజహితం వైపు నడిపించే ప్రోత్సాహకాలు కరువవుతాయి. దోపిడీ, అవినీతి రాజకీయాలకు మరింత ప్రోత్సాహం ఇచ్చినట్లవుతుంది.

నాయకత్వం అభివృద్ధికి దశాబ్దాల కృషి అవసరం. ఇందుకు రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్ కన్నా, పార్టీలే ఆ రకంగా రిజర్వేషన్‌కి తగ్గ సంఖ్యలో సీట్లిచ్చేలా చట్టబద్ధ ఏర్పాటు చేయటం మేలు. ఈ రకమైన పార్టీ కోటా పద్ధతిలో ఏ సీట్లను మహిళలకు



కేటాయించాలి అన్న అంశంపై పార్టీలకు కూడా కొంత స్వేచ్ఛ ఉంటుంది. దీనివల్ల పురుషులకు డమ్మీలుగా ఉండే నాయకత్వం కాకుండా, సహజ నాయకత్వం మహిళల నుంచి పెరుగుతుంది. విజయవంతమైన మహిళా నేతలు తర్వాతి ఎన్నికల్లో ఆత్మవిశ్వాసంతో పోటీ చేయగలుగుతారు, కాలక్రమంలో తమ స్థాయిని పెంచుకోగలుగుతారు. ఇదే సమయంలో పార్టీలు తమకున్న స్వేచ్ఛను దుర్వినియోగం చేసి, తమకు బలం లేని స్థానాల్లో మహిళల్ని నిలబెట్టే అవకాశం లేకుండా చట్టబద్ధంగా తగిన రక్షణల్ని ఏర్పాటు చేయవచ్చు. లోక్‌సభ సీట్లకయితే రాష్ట్రం యూనిట్‌గా, రాష్ట్ర అసెంబ్లీ అయితే మూడు లోక్‌సభ స్థానాలు యూనిట్‌గా పార్టీలు సీట్లు కేటాయించాల్సి ఉంటుంది. అంటే, ఏ పార్టీ అయినా తాను మహిళలకు కేటాయించాల్సిన సీట్లను తనకు బలం లేని రాష్ట్రంలో కేటాయించే అవకాశం ఉండదు. ప్రతి రాష్ట్రంలో విధిగా లోక్‌సభకు మహిళలకు 33% సీట్లు కేటాయించాలి. అలాగే రాష్ట్ర విషయానికొస్తే, తనకు బలం లేని సీట్లను మహిళల కోటా కింద ఇవ్వటం కుదరదు. ప్రతి మూడు లోక్‌సభ స్థానాల యూనిట్ నుంచి మూడో వంతు అసెంబ్లీ సీట్ల చొప్పున అన్ని లోక్‌సభ స్థానాల నుంచి మహిళలకు 33% సీట్లు కేటాయించాలి.

ప్రస్తుత మహిళా రిజర్వేషన్ చట్టం రూపకల్పన లోపభూయిష్టంగా ఉన్నప్పటికీ, ఏదోకరూపంలో మహిళల ప్రాతినిధ్యం పెంచటానికి చేసిన ప్రయత్నంగా మనం స్వాగతించాలి; మెరుగైన పద్ధతిలో చట్టం రూపొందిస్తే రాజకీయాల స్వభావంలో గుణాత్మక మార్పు సాధ్యమవుతుంది.

మహిళా రిజర్వేషన్ల అమలుకి మన శాసనకర్తలు ఇంకా కొంత సమయం తీసుకుంటున్నారు; రాజకీయాల్ని మెరుగుపరచే దిద్దుబాట్లకి ఈ సమయాన్ని వారు సద్వినియోగం చేయాలి.

# మహిళా రిజర్వేషన్ చట్టం - ఎట్టకేలకు ఆమోదం

లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు అమలు చేసే చట్టం సాకారమైంది. ఇందుకోసం 'నారీశక్తి వందన్ అధినియమ్' పేరుతో ప్రవేశపెట్టిన 128వ రాజ్యాంగ సవరణ బిల్లు-2023ను పార్లమెంటు ఉభయ సభలూ దాదాపు పార్టీలకతీతంగా ఆమోదించాయి. 33 శాతంలో ఎస్.సి, ఎస్.టి మహిళలకు వారి రిజర్వేషన్ల కోటా ఆధారంగా కేటాయిస్తారు. 15 ఏళ్ల పాటు అమలులో ఉండే ఈ రిజర్వేషన్లను వెంటనే కాకుండా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) తర్వాత అమలులోకి తేవాలని నిర్ణయించారు. 2026లో డీలిమిటేషన్ చేపట్టాల్సి ఉంది. అది పూర్తయి రిజర్వేషన్లు అమల్లోకి రావటానికి మరికొంత సమయం పడుతుంది. అంటే 2024 ఎన్నికల నాటికి రిజర్వేషన్లు అమల్లోకి రావు. 2029లోనే పార్లమెంటులో కోటా అమలయ్యే అవకాశముంది. 2026లో డీలిమిటేషన్ పూర్తయితే ఆ తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రిజర్వేషన్లను అమలు చేసే అవకాశముంది.

- మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించటం కోసం ప్రవేశపెట్టిన 128వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగంలోని 239ఏఏ, 330, 332, 334 అధికరణలకు సవరణలు జరుగుతాయి.
- ఆర్టికల్ 239ఏఏ క్లాజ్ (2), సబ్‌క్లాజ్ (బి) కింద కొత్తగా బీఏ, బీబీ, బీసీ క్లాజులను చేర్చారు.
- ఆర్టికల్ 330 కింద కొత్తగా 330ఏ (1)(2)(3)ని చేర్చారు.
- ఆర్టికల్ 332 కింద 332ఏ (1)(2)(3) క్లాజ్‌లు చేర్చి ఢిల్లీ అసెంబ్లీ, దేశవ్యాప్తంగా లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలు, వాటి పరిధిలోకి వచ్చే ఎస్.సి, ఎస్.టి నియోజకవర్గాల్లో మూడో వంతు సీట్లు మహిళలకు కేటాయించారు.
- ఆర్టికల్ 334లో కొత్తగా 334ఏ (1) చేర్చి ఇప్పుడు ప్రకటించిన రిజర్వేషన్లన్నీ ఈ చట్టం అమల్లోకి వచ్చాక చేపట్టే జనగణన అనంతరం నిర్వహించే డీలిమిటేషన్ ప్రక్రియ తర్వాతే అమల్లోకి వచ్చేలా చేశారు. అప్పటివరకు ఇప్పుడున్న సీట్లన్నీ యధాతథంగా కొనసాగుతాయని స్పష్టత ఇచ్చారు. రాష్ట్రాలు, జాతీయ స్థాయిల్లో జరిగే విధాన రూపకల్పనలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకే ఈ బిల్లు తీసుకొచ్చినట్లు ప్రభుత్వం ఈ బిల్లు ఉద్దేశాలు, కారణాల్లో (ఆబ్జెక్టివ్స్ అండ్ రీజన్స్)లో పేర్కొంది. "75 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత దేశం 2047 కల్లా అభివృద్ధి చెందిన భారత్‌గా అవతరించాలన్న లక్ష్యంతో అమృత్ కాలంలోకి ప్రవేశించింది. ఈ లక్ష్యాన్ని సాకారం చేసుకోవాలంటే సబ్ కా సాథ్ సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ స్ఫూర్తితో సమాజంలోని అన్ని వర్గాల చేయూత అవసరం. జనాభాలో సగ భాగం ఉన్న మహిళల పాత్ర ఇందుకు అత్యంత ప్రధానం. మహిళా సాధికారత, మహిళాధారిత అభివృద్ధి కార్యక్రమాల ద్వారా మహిళల శక్తిని



వెలికితీయటానికి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. దానివల్ల మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం, విద్య, ఉద్యోగావకాశాలను అందుకోవటంలో ఎంతో మెరుగుదల కనిపించింది. ఉజ్వల యోజన, స్వచ్ఛ భారత్ కింద మరుగుదొడ్ల నిర్మాణం, ముద్ర యోజనతో ఆర్థిక సమ్మిళితత్వం లాంటి కార్యక్రమాల ద్వారా మహిళల జీవనాన్ని సుగమం చేయటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే విధానాల రూపకల్పన, నిర్ణయాధికార ప్రక్రియలో మహిళలు పెద్దసంఖ్యలో భాగస్వాములైనప్పుడే నిజమైన సాధికారత సాధ్యమవుతుంది. పంచాయతీరాజ్ సంస్థలు, మునిసిపల్ వ్యవస్థల్లో మహిళల భాగస్వామ్యం పెద్దసంఖ్యలో ఉంది. అయితే అసెంబ్లీలు, పార్లమెంటులో వారి భాగస్వామ్యం ఇప్పటికీ పరిమితమే. రాష్ట్ర జాతీయ స్థాయిలో వారికి అధిక ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్



దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించటానికి ఇదివరకు పలు ప్రయత్నాలు జరిగాయి. 2010లో చివరిసారి అలాంటి ప్రయత్నం జరిగింది. అప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లును రాజ్యసభ ఆమోదించినా లోక్‌సభ ఆమోదించలేదు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే విధానాల రూపకల్పనలో ప్రజాప్రతినిధులుగా మహిళలకు అధిక భాగస్వామ్యం కల్పించటానికి దాదాపు మూడో వంతు సీట్లను వారికి కేటాయించటానికి ఇప్పుడు తాజాగా రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలన్న నిర్ణయం జరిగింది" అని యూనియన్ ప్రభుత్వం ఈ బిల్లులో పేర్కొంది.

**మహిళా రిజర్వేషన్ బిల్లు - మూడు దశాబ్దాల ప్రస్థానం**

- పంచాయతీల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తూ 1993లో రాజ్యాంగ సవరణ వచ్చిన సమయంలోనే కాలక్రమంలో అసెంబ్లీ, పార్లమెంటుల్లో కూడా మహిళా రిజర్వేషన్ అమలు చేయాలన్న ఆలోచన ముందుకొచ్చింది.
- తొలిసారి దేవెగౌడ నేతృత్వంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం 1996 సెప్టెంబర్ 12న మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు చట్టంగా వస్తే లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ లభిస్తుంది.
- సీపీఐ ఎంపీ గీతా ముఖర్జీ అధ్యక్షతన ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ తన నివేదికను 1996 డిసెంబర్ 9న లోక్‌సభకు సమర్పించింది. తర్వాత కొద్దికాలానికే దేవెగౌడ ప్రభుత్వం మైనారిటీలో పడిపోయి లోక్‌సభ రద్దయింది.
- దేవెగౌడ, గుజ్రాల్ తర్వాత వచ్చిన వాజపేయి నేతృత్వంలోని ఎన్‌డీయే ప్రభుత్వం 1998 జూన్ 26న మహిళా బిల్లును లోక్‌సభ ముందుకు తెచ్చింది. అయితే అటల్‌జీ సర్కారు కూడా మైనారిటీలో పడిపోవటంతో లోక్‌సభ రద్దయింది.
- ఎన్నికల తర్వాత మళ్లీ వాజపేయి ప్రభుత్వమే 1999 నవంబర్ 22న మహిళా బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కానీ బిల్లుపై ఏకాభిప్రాయం రూపొందలేదు.
- ఆ తర్వాత 2002లో, 2003లో కూడా వాజపేయి సర్కారు బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కానీ అప్పుడూ ఏకాభిప్రాయం సాధ్యం కాలేదు.
- 2004లో అధికారంలోకి వచ్చిన యూపీయే ప్రభుత్వం మహిళా బిల్లును చట్టం చేస్తామని హామీ ఇచ్చినా 2008 వరకు ఆ దిశగా అడుగులు వేయలేదు. 2008 మే 6న రాజ్యసభలో ప్రవేశపెట్టింది. లా అండ్ జస్టిస్ స్థాయీ సంఘం పరిశీలనకు పంపింది.
- వంద రోజుల్లో మహిళా బిల్లును ఆమోదించటానికి కార్యాచరణ చేపడుతున్నట్లు డా॥ మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీయే సర్కారు జూన్ 2009లో ప్రకటించింది.
- 2009 డిసెంబర్ 17న మన్మోహన్ ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభల్లో బిల్లు ప్రవేశపెట్టింది. ఎస్.పి, జనతాదళ్ (యు), ఆర్‌జేడీ తీవ్ర అభ్యంతరాల మధ్య బిల్లుపై ఏకాభిప్రాయం సాధించలేకపోయింది.

- మహిళా బిల్లును సాధ్యమైనంత త్వరగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం గట్టి ప్రయత్నం చేస్తోందని 2010 ఫిబ్రవరి 22న రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.
- యూనియన్ మంత్రిమండలి 2010 ఫిబ్రవరి 25న మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలిపింది.
- 2010 మార్చి 8న బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టింది. బిల్లును వ్యతిరేకిస్తూ సభలో ఎస్.పి, ఆర్‌జేడీ ఆందోళన కొనసాగించాయి.
- 2010 మార్చి 9న పెద్ద మెజారిటీతో మహిళా బిల్లు రాజ్యసభ ఆమోదం పొందింది.
- 2014లో, 2019లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డీయే సర్కారు కొత్త పార్లమెంటు భవనంలోకి ప్రవేశించిన 2023 సెప్టెంబర్ 19న మహిళా బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్ కల్పిస్తూ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటు ఆమోదించింది.

## ప్రస్తుతం ఎంతమంది అంటే..

- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం, గోవా, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, ఒడిశా, సిక్కిం, తమిళనాడు, త్రిపుర, పుదుచ్చేరి అసెంబ్లీల్లో 10 శాతం కంటే తక్కువమంది మహిళలున్నారు. బీహార్, హర్యానా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీలకు 10 నుంచి 12 శాతం మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో 14.44 శాతం, పశ్చిమ బెంగాల్‌లో 13.7 శాతం, జార్ఖండ్‌లో 12.35 శాతం చట్టసభ మహిళలున్నారు.
- ప్రస్తుతం 543 మంది సభ్యుల లోక్‌సభలో మహిళా ఎంపీలు 82 మంది, అంటే 15 శాతం దాకా ఉన్నారు. రాజ్యసభలో 14 శాతం ఉన్నారు. మహిళా రిజర్వేషన్ చట్టం అమల్లోకి వచ్చాక ప్రస్తుత లెక్కప్రకారం లోక్‌సభలో 181 సీట్లు మహిళలకు దక్కుతాయి. తెలంగాణ అసెంబ్లీలో దాదాపు 40 సీట్లు (మొత్తం 119), ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో 58 (మొత్తం 175) మహిళలకే కేటాయించాల్సి ఉంటుంది.

## స్వాతంత్ర్యానికి పూర్వం..

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు భారత్‌లో స్వాతంత్ర్యానికి ముందే ఉండేవి. బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో 1935 చట్టం రాష్ట్రాల చట్టసభల్లో 41 సీట్లు, సెంట్రల్ లెజిస్లేచర్‌లో పరిమిత సీట్లను మతాలవారీగా మహిళలకు కేటాయించింది. అదీ వివాహితలకు మాత్రమే అవకాశమిచ్చారు. విభజించు, పాలించు సూత్రంలో భాగంగా స్వాతంత్ర్య ఉద్యమం నుంచి మహిళలను దూరం చేయటానికి ఆంగ్లేయులు ఈ ఎత్తుగడ వేశారు. దేశంలోని మహిళలందరికీ ఓటుహక్కు ఇవ్వటానికి అంగీకరించని బ్రిటిష్‌వారు చట్టసభల్లో సీట్లు ఇవ్వటం వెనక ఉద్దేశం ఇదే. అందుకే చివరకు మహిళా సంఘాలే ఈ రిజర్వేషన్లు వద్దని నినదించాయి. రాజ్యాంగ సభలోనూ ఈ అంశం చర్చకు వచ్చింది. అయితే అందరికీ ఓటుహక్కు కల్పిస్తున్నాం కాబట్టి అవకాశాలు వస్తాయనే ఉద్దేశంతో చట్టసభల్లో మహిళలకు ప్రత్యేక సీట్లు ఇవ్వాల్సిన అవసరం లేదని రాజ్యాంగ నిర్మాణ సభ భావించింది. భారత మహిళలకు సమానత్వం కావాలే తప్ప రిజర్వేషన్లు కాదని సరోజిని నాయుడు, పూర్ణిమా బెనర్జి, రేణుకా రే మొదలైనవారు వాదించారు. అందుకే 1935 చట్టంలో ఉన్న అనేక అంశాలు స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగంలో భాగమైనా మహిళలకు చట్టసభలో రిజర్వేషన్లు తొలగించారు.

## మహిళలకు రిజర్వేషన్లు అవసరం: సమితి మహిళా విభాగం

లింగ సమానత్వం, మహిళల హక్కులను ముందుకు తీసుకువెళ్లేందుకు.. విధానాలు, రాజకీయాల్లో మహిళలకు రిజర్వేషన్లు అవసరమని ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం తెలిపింది. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం కోటా కల్పించటంతో జాతీయ పార్లమెంట్లలో వనితలకు రిజర్వేషన్లు కల్పిస్తున్న 64 దేశాల సరసన భారత చేరనుందని పేర్కొంది.

## మహిళా చట్టం చరిత్రాత్మకం: లోక్‌సత్తా

మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్‌డీయే ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లును అన్ని పార్టీలూ ఆమోదించటం అభినందనీయమని లోక్‌సత్తా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు అన్నారు. చట్టసభల్లో అతివల ప్రాతినిధ్యం పెరిగితే భూస్వామ్య పెత్తందారీ ధోరణులు పోయి సేవా ధోరణులు అలవడతాయన్నారు. అంతేకాకుండా నిత్యావసరాలు, విద్య, ఆరోగ్యం, మహిళల భద్రత, ఉపాధి తదితర రంగాల్లో ప్రభుత్వాల ఆలోచనలు మారతాయన్నారు.

# చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు. తక్షణ అమలుకు పరిష్కార మార్గాలు

## -బండారు రామ్మోహనరావు

మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టసభల ముందుకు వచ్చిన ప్రతిసారి అందరూ మహిళా రిజర్వేషన్ అనే అద్దంలో తమ మొహం చూసుకుందామని అనుకుంటున్నారు. అట్లాగే ఆ క్రెడిట్ తమ ఖాతాలో వేసుకోవాలని ఎవరికి వారు ప్రయత్నం చేస్తున్నారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు అనే పిల్లి మెడలో ఎవరూ గంట కట్టడం లేదు. మొత్తానికి ప్రస్తుత ఎన్ డి ఏ ప్రభుత్వం పిల్లి మెడలో గంట కట్టింది. ప్రస్తుతం చట్టసభల్లో కేవలం ఎస్సీ ఎస్టీ వారి జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. అసెంబ్లీ పార్లమెంట్ నియోజకవర్గం డిలిమిటేషన్ జరిగిన ప్రతిసారి దేశంలో ఎస్సీ ఎస్టీ జనాభా జనాభా పెరిగినప్పుడల్లా దానికి అనుగుణంగా ఎస్సీ ఎస్టీ సీట్ల సంఖ్య కూడా పెరుగుతుంది. ఇక గత మూడు దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ల బిల్లు చర్చకు వచ్చినప్పుడల్లా సమాజంలోని మిగతా అన్ని వర్గాల రిజర్వేషన్లు అప్పుడే జ్ఞాపకం వస్తాయి. ఇది కావాలని అధికార ప్రతిపక్షాల పార్టీలు చేసే కుట్ర. అలాంటి ఎదుటి వారి మీద నెపం మోపి వాళ్ళు వద్దంటున్నారని తప్పించుకోవడానికి సాకుగా మాత్రమే ఉపయోగించుకుంటున్నారు. రిజర్వేషన్లు అమలు చేయకుండా తప్పించుకుంటున్నారు. మొత్తానికి మహిళా రిజర్వేషన్ బిల్లు ఉభయ సభలో పాస్ అయినా కూడా అమలు కావడానికి మరొక దశాబ్ద కాలం పట్టేటట్లు ఉంది. అలా కాకుండా వెంటనే జనాభా లెక్కలు పూర్తి చేసి డీలిమిటేషన్ కూడా చేయడానికి రేపు రేపటి 2024 ఎన్నికల్లో అమలు చేయడానికి సమయం సరిపోదు. ఇక ప్రస్తుతం ప్రభుత్వం చెప్పే ప్రాసెస్ చూస్తే 2029 ఎన్నికల లో కూడా మహిళ రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం లేదు దానికి మరో ఐదేళ్లు ఆగాలి. అంటే 2034 వరకు ఆగాల్సిందే. అంటే మనం ఎక్కాల్సిన మహిళా రిజర్వేషన్ అనే రైలు జీవిత కాలం లేటు అన్నట్లుగా మహిళా రిజర్వేషన్ల అమలుకు మరొక దశాబ్ద కాలం పట్టేటట్లుగా ఉంది.

**మనసుంటే మార్గం ఉంటుంది**

డిలిమిటేషన్ అనే ప్రక్రియను అడ్డం పెట్టుకొని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అట్లాగే ప్రతిపక్షాలు కూడా ఆడుతున్న నాటకం బట్ట బయలు చేయాలి. అదేమిటంటే ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో తెలంగాణలో ప్రస్తుతము ఉన్న 119 సీట్లను 153 కి పెంచాలని ఆంధ్రప్రదేశ్లో ఉన్న 175 సీట్లను 225 కి పెంచాలని స్పష్టంగా పేర్కొన్నారు. కానీ దానికి కూడా డిలిమిటేషన్ ప్రక్రియ 2026 దాకా మొదలు పెట్టి అవకాశం లేదని కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం సాకుగా చూపిస్తుంది. కానీ మనసుంటే మార్గం ఉంటుందని అవసరమైతే ఇవన్నీ అడ్డంకులు కావని మనకి జమ్మూ కాశ్మీర్లో దిలీమిటేషన్ ప్రక్రియ మొదలుపెట్టి పూర్తి చేసింది కూడా జమ్మూ కాశ్మీర్ అడ్డం రాని డిలిమిటేషన్ ప్రక్రియ తెలుగు రాష్ట్రాలకు అలాగే ప్రస్తుత మహిళా బిల్లుకు ఎందుకు అడ్డం వస్తుంది. ఒకే దేశం ఒకే చట్టం కదా మరి ఈ ప్రశ్న ప్రతిపక్షాలు కూడా వేయడం లేదు. అందుకే మహిళా రిజర్వేషన్ అమలు ప్రక్రియ ఎంత దూరం పోతే అంత మంచిది అని అన్ని సాంప్రదాయ పార్టీలు మహిళలను మోసం చేస్తున్నాయి. అందుకే దశాబ్ద కాలం పట్టినా సరే ప్రస్తుతం ఈ మహిళా బిల్లు పాస్ అయింది కదా అని ఎప్పుడో పెట్టే బిరియాని కోసం ఇవాల్టి నుండి మహిళా ఆశావహ అభ్యర్థులు పస్తులు ఉండాల్సిందేనా అలా కాకుండా ఇప్పటికిప్పుడు ఏమైనా పరిష్కారం మార్గం ఉందా అని ఆలోచించాలి. మొదటిది జమ్మూ కాశ్మీర్లో ఎలా ఈ డిలిమిటేషన్ అనే వైతరణి నదిని ఎలా దాటారు దాని ప్రకారం ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి. ప్రస్తుతం 2011 జనాభా లెక్కలు అందుబాటులో ఉన్నాయి కనుక వాటి ప్రకారం దేశంలో ఇప్పుడున్న సీట్ల సంఖ్యలతోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయవచ్చు. ఇప్పటికే తెలంగాణ మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహా మరి కొందరు మహిళల కోసం అవసరమైతే మా సీట్లనే త్యాగం చేస్తామని ఘనంగా ప్రకటిస్తున్నారు. వారు ప్రకటించినట్లుగానే 33% మహిళలకు లాటరీ ద్వారా గాని లేక ఆయా నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల సంఖ్యను బట్టి కానీ నిర్ణయించవచ్చు. మహిళా ఓటర్ల

సంఖ్యలో దేశంలోని ఏ నియోజకవర్గం తీసుకున్నా కూడా పురుషులల ఓట్లకు మహిళల ఓట్ల సంఖ్యకు వ్యత్యాసం అర శాతం లేక ఒక్క శాతం కంటే ఎక్కువ తేడా ఉండదు. కనుక ఇప్పుడు ఈ లెక్కల గొడవ ఎందుకు అనుకుంటే ఒకవేళ లెక్కలు తీసినా కూడా ఎవరైనా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకునే అవకాశం ఉంటుంది కనుక ప్రస్తుతం పంచాయతీరాజ్ వ్యవస్థలో చేస్తున్నట్టు లాటరీ పద్ధతిలో అవుతే దీన్ని ఎవరు కాదనరు. అలాగే రొటేషన్ సిస్టం కూడా పెట్టుకోవచ్చు. అప్పుడు కేటీఆర్, కోమటిరెడ్డి గార్ల మాటకు విలువ ఉంటుంది. ఎవరి సీటు పోయినా వారు బాధ పడాల్సిన అవసరం ఉండదు. ఇక ఇలా కాకుండా ఈ రాజ్యాంగ సవరణ ద్వారా ఇది అమలు అయినప్పుడు అమలు అవుతుంది. కానీ ప్రస్తుతం ఆకలి అవుతున్నప్పుడు ఆకలి తీర్చాలి కానీ ఎప్పుడో పెట్టే బిర్యాని అన్నం కంటే ప్రస్తుతం పచ్చడమెతుకులే చాలు అనుకుంటే వెంటనే పరిష్కారం అయ్యే ఆలోచనను కూడా నేను మీ ముందు ఉంచుతాను.

### మహిళా రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ అవసరం లేదా?

ప్రజా ప్రాతినిధ్యం చట్టం లో ఒక చిన్న సవరణ ద్వారాఎలాంటి రాజ్యాంగ సవరణ అవసరం లేకుండా రిప్రజెంటేటివ్ ఆఫ్ పీపుల్స్ యాక్ట్ 1951 ప్రకారం మహిళా రిజర్వేషన్లు ఇవ్వవచ్చును. దాని గురించి లోక్ సత్తా గత 20 ఏళ్లుగా పోరాడుతుంది. మొత్తం 1952 నుంచి ఇప్పటివరకు అసెంబ్లీలకు పార్లమెంటుకు పోటీ చేసిన వారి మహిళల వివరాలు వారి గెలుపు శాతం కూడా గమనిస్తే పోటీ చేసే మహిళల గెలుపు శాతం పురుషుల కంటే ఎక్కువగా ఉందని అధికారిక లెక్కలు తెలుపుతున్నాయి. ప్రజా ప్రతినిత్యం చట్టం లో చిన్న మార్పుల ద్వారా మహిళా రిజర్వేషన్లను ఇప్పటికిప్పుడు ఎలా కల్పించవచ్చు ఆధారాలతో సహా ఒక నివేదిక రూపంలో లోక్ సత్తా ఉద్యమ సంస్థ ఒక పుస్తకాన్ని ప్రచురించింది. ఆ ప్రతిపాదనను దేశంలోని అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పక్షాలకు, ఎమ్మెల్యేలు ఎంపీలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రధానమంత్రి తో సహా పార్టీలకు అతీతంగా వారికి విజ్ఞప్తి చేస్తూనే ఉన్నాము. కానీ సులభమైన మార్గాన్ని విడిచిపెట్టి కఠినమైన రాజ్యాంగ సవరణ అనే ఒక "ఇనుప గుగ్గిళ్ళ"ను మన దేశ ప్రజల చేత మింగిస్తున్నారు. మహిళా రిజర్వేషన్లు ఇవ్వడానికి ఇష్టం లేని సాంప్రదాయ రాజకీయ పక్షాలు ముఖ్యంగా అధికారంలో ఉన్న పక్షాలు రాజ్యాంగ సవరణకు వస్తున్న అడ్డంకులను ఒక అవకాశంగా వాడుకుంటున్నాయి.


ఆర్పి యాక్ట్ లో చిన్న సవరణ చేసి ప్రతి పార్టీ 33 శాతం గాని లేక అంతకంటే మించి కూడా నిర్ణయించిన మేరకు రిజర్వేషన్లు మహిళలకు ఇవ్వకపోతే వారి పార్టీ గుర్తింపు రద్దు చేస్తామనే ఒక కండిషన్ పెడితే సరిపోతుంది. అన్ని పార్టీలు తప్పక మహిళలకు నిర్ణయించిన శాతం మేరకు ప్రాతినిధ్యం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రతిపాదన తెచ్చినప్పుడల్లా కొందరు ఇందులో ఒక దుర్మార్గ వాదన కూడా ఎందుకు తెస్తారు ఆడవాళ్లు మగవాళ్ళతో పోటీ చేసే గెలవగలుగుతారా అనే ప్రశ్న మన ముందు ఉంచుతారు. ప్రస్తుతం ఎలాంటి మహిళా రిజర్వేషన్లు లేకుండానే ప్రస్తుత పార్లమెంటులో 82 మంది మహిళలు ఉన్నారు. వారందరూ మహిళల మీద మహిళలే పోటీ చేసి గెలిచిన వారు కాదు కదా. చాలామంది పురుషులతో పోటీపడి గెలిచినవారున్నారు. కానీ వారిలో కొందరు రాజకీయ కుటుంబ వారసులుగా వచ్చిన వారు ఉంటారు. ఉదాహరణకు సుప్రియ సులే ,కళీముని, కల్వకుంట్ల కవిత ఇలా ఒక 20,30 మంది పేర్లను మనం చెప్పగలుగుతాం కానీ మిగతావారు ఎలాంటి రాజకీయ కుటుంబ నేపథ్యం నుంచి రాని వారు కూడా చాలామంది పురుషులతో పోరాడి వివిధ రాష్ట్రాల శాసనసభలకు పార్లమెంటుకు గెలిచి వచ్చినవారే. మరి ఇలా ఎందుకు ప్రయత్నం చేయకూడద%శీ%టే మహిళా రిజర్వేషన్ల చిక్కుముడి ఎన్ని రోజులు వీడకపోతే పురుషాధిక్య సమాజంలో వారికి అంత మంచిది కనుక ఇలా సులభమైన పరిష్కారాల వైపు చూడరు. ముహూర్తం ఆసన్నమైన భావాలు ముందుకు వస్తే ఎలాంటి అవరోధాలు అడ్డంకులుగా మారకుండా ఉంటాయ అనడానికి నేటి మహిళా బిల్లు గురించి సన్నాయి నొక్కులు నొక్కుతూనే తప్పనిసరి మద్దతు ఇవ్వాల్సిన పరిస్థితి అన్ని రాజకీయ పార్టీలకు అనివార్యమైంది. దీన్ని మనం అర్థం చేసుకోవాలి. ఇప్పటికే ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు అన్నీ మహిళల పేరు మీదుగానే ఇవ్వడానికి ప్రధాన కారణం మహిళా ఓటు బ్యాంకును కొల్లగొట్టడానికే అని వేరేగా చెప్పనవసరం లేదు. మరొకసారి మహిళా ఓటు బ్యాంకు ను కొల్లగొట్టడానికి అన్ని రాజకీయ పక్షాలు తప్పనిసరిగా ఇప్పుడు వచ్చిన మహిళా బిల్లును ఆహ్వానించారు. దానికి అనుగుణంగా అనుకూలంగా ఓటు వేశారు. ఈ విజయాన్ని గమనిస్తే మనకు అర్థం అవుతుంది. మహిళలు అలాగే మహిళా అభ్యున్నతి కోరుకునే పురుషులు కూడా రాజకీయ పార్టీల మీద ఒత్తిడి పెడితే తప్పక ఆకాశంలో సగం అవకాశాల్లో సగం మహిళలకు దక్కుతాయని పార్లమెంటులో పాసైన ఇప్పటి మహిళా బిల్లు ఒక ఉదాహరణ మాత్రమే.

ఎలాగూ మహిళా రిజర్వేషన్ల బిల్లు పాస్ అయింది కనుక అందులో పేర్కొన్నట్లుగానే 33% రిజర్వేషన్లు ఆయా రాజకీయ పార్టీలు మహిళలకు ఇస్తే సరిపోతుంది. ఇలా మరో 10,15 ఏళ్ల తర్వాత అమలు కావలసిన రిజర్వేషన్లు రేపు 2024 ఎన్నికలకే అమలు చేయవచ్చును. రాజకీయ పక్షాలు ఆ వైపుగా ఆలోచించాలి.

# ఓపీఎస్ అమలు చేస్తే రాష్ట్రానికి అప్పు పుట్టదు

## 2050 నాటికి ఆర్థిక లోటు 8 శాతానికి చేరుకుంటుంది

## ఆర్థిక వ్యవస్థ స్తంభిస్తుంది.. జీపీఎస్ బిల్లుకి ఏపీ అసెంబ్లీ ఆమోదం



పాత పెన్షన్ పథకం (ఓపీఎస్) అమలు చేస్తే రాష్ట్రానికి అప్పు పుట్టదని ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. 3% శాతం ఉండాల్సిన ఆర్థిక లోటు ఓపీఎస్ అమలుతో 2030కి 4.8%, 2040కి 6.1%, 2050 కల్లా 8 శాతానికి చేరుతుందని తెలిపారు. అదే జరిగితే రాష్ట్రం ఆర్థికంగా స్తంభించి, అప్పు చేసే అవకాశం కూడా ఉండదని వివరించారు. భావితరాలను, ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని యాన్యుటీ మోడల్‌లో గ్యారంటీ పెన్షన్ స్కీం (జీపీఎస్) తీసుకొచ్చామని ఆర్థికమంత్రి తెలిపారు. ఇదే విధానాన్ని రాబోయే కాలంలో దేశవ్యాప్తంగా అమలు చేసినా ఆశ్చర్యం లేదన్నారు. జీపీఎస్ బిల్లు - 2023ను టేబుల్ ఎజెండా ఐటంగా మంత్రి బుగ్గన అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీన్ని సభ ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. 'కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రివ్యూ చేయాలని అనేక ఏళ్లుగా ఉద్యోగులు కోరుతున్నారు. దీనిపై అనేక రకాలుగా అధ్యయనం చేశాక హైబ్రిడ్ మోడల్‌లో గ్యారంటీ పెన్షన్ స్కీం తెచ్చాం. ప్రభుత్వంలో భాగమైన ఉద్యోగులకు సొంత అవసరాలు, అభిప్రాయాల కంటే ప్రజలకు సంబంధించిన అంశాలే ప్రధానం. ఓపీఎస్‌లో ప్రస్తుతం ఎవరైతే ఉన్నారో వారికి ఏడాదికి రూ.20,400 కోట్ల చొప్పున ప్రభుత్వం పింఛన్ ఇస్తోంది. సీపీఎస్ ఉద్యోగులంతా ఓపీఎస్‌కు వెళితే 2030లో రూ.33,546 కోట్లు అవసరమవుతాయి. 2045 నుంచి పరిస్థితి మరింత చేయిదాటి పోతుంది. ఎందుకంటే 2004 తరువాత నియమితులైన ఉద్యోగుల పదవీ విరమణ.. 2045 నాటికి భారీ సంఖ్యలో ఉంటుంది. ఈరోజు ఎవరైతే సీపీఎస్ నుంచి ఓపీఎస్ తీసుకున్నామని సంబరపడతారో.. వారు 2045 నాటికి ఇబ్బంది పడే ప్రమాదం ఉంది. 2024 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చాలామంది ఓపీఎస్ పెట్టాలని అంటున్నారు. మనస్సాక్షిగా పాలన చేయాలి. 2024 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాకుండా.. 2070 వరకు ఉద్యోగుల సంక్షేమం గురించి ఆలోచించి ప్రభుత్వం జీపీఎస్‌ను తీసుకొచ్చింది' అని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.

**మధ్యేమార్గంగా జీపీఎస్**

సీపీఎస్ ఉద్యోగుల కంట్రిబ్యూషన్‌ను షేర్ మార్కెట్‌లో పెడుతున్నందున వారికి కలిగే ప్రయోజనం 20% కంటే ఎక్కువ లేదన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవటంతోపాటు ప్రస్తుత, భవిష్యత్తులో నియమితులయ్యే ఉద్యోగుల అవసరాలు, వారి పిల్లల భవిష్యత్తు గురించి సీపీఎస్, ఓపీఎస్‌కు మధ్యేమార్గంగా జీపీఎస్ తీసుకొచ్చాం. ఒకవేళ ఓపీఎస్‌కు వెళితే రాష్ట్ర పింఛన్లు 2030 నాటికి 16%, 2040కి 19.5%, 2050కి 28.6%, 2100కి దాదాపు 40 శాతానికి వెళతాయి. ఇది 5-7 శాతం మాత్రమే ఉండాలి. స్థూల ఉత్పత్తికి అప్పు అనేది ఒక నిష్పత్తిగా తీసుకుంటే 35 శాతం కంటే ప్రస్తుతం తక్కువ ఉంటాం. ఓపీఎస్‌కు వెళితే అప్పు 2030కి 53%, 2040కి 70%, 2050కి 107 శాతానికి చేరుతుంది. దీనివల్ల భవిష్యత్తులో ఆర్థికంగా తలెత్తే సమస్యలను దృష్టిలో పెట్టుకుని జీపీఎస్‌ను రూపొందించామని బుగ్గన వివరించారు.

**జీపీఎస్‌తో ప్రయోజనాలివీ..**

పదవీ విరమణ చేసే నాటికి చివరిసారిగా డ్రా చేసిన మూలవేతనంలో 50% చొప్పున నెలవారీ పెన్షన్ ఉండేలా గ్యారంటీ ఇస్తున్నాం. ఫించనుదారు మరణిస్తే వారి జీవిత భాగస్వామికి 60% పెన్షన్ వర్తింప చేస్తాం. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు జీపీఎస్ ఉద్యోగులకు హెల్త్ స్కీం అమలు చేస్తాం. పదేళ్ల సర్వీసు కలిగిన ఉద్యోగులకూ రూ.10 వేల పెన్షన్ గ్యారంటీ ఉంటుంది.. అని మంత్రి తెలిపారు.




## మెడికల్ కాలేజి విషయంలో ధన్యవాదాలు..
## వైద్య వ్యవస్థను కూడా జగన్ ప్రభుత్వం సంస్కరించాలి: లోక్‌సత్తా

విజయనగరం జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేసి జాప్యం లేకుండా పనులు పూర్తిచేసి ప్రారంభించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ధన్యవాదాలు తెలిపారు. 1979లో ఏర్పడిన జిల్లాకు తగిన వైద్య సౌకర్యాలు లేవని, గిరిజన ప్రాంతాల్లో మరీ అధ్వాన్నంగా ఉందని మీడియాతో మాట్లాడుతూ అన్నారు. రాష్ట్రంలో ప్రాథమిక స్థాయి నుంచి వైద్య సేవల్ని మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం అరకొరగా ఉందని, ఆరోగ్య వ్యవస్థను బాగుచేసేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు అల్లంశెట్టి నాగభూషణం, తాట్రాజు రాజారావు, పి.ఎల్.ఎన్ రాజు, భీంపల్లి భాస్కర్, మాతృభూమి సేవాసంఘం ఇప్పలవలస గోపి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియంత్రించండి

అల్వాల్ పట్టణ కేంద్రంలో వాహనాల రద్దీ విపరీతంగా పెరగటంతో తరచూ ట్రాఫిక్ జాంలు జరుగుతున్నాయని, అల్వాల్ హిల్స్ సిటిజన్ కాలనీ హై టెన్షన్ రోడ్, ఓల్డ్ అల్వాల్ టు అంబేద్కర్ నగర్ మొదలైన చోట్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ వాహనదారులు, విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని శ్రీనివాస వర్మ డిమాండ్ చేశారు.



## సురాజ్య పాలన కోసమే లోక్ సత్తా పార్టీ పోరాటం

దేశంలోని రాజకీయ పార్టీల తీరు చూసిన డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ప్రజలకు సురాజ్య పాలన అందాలని లోక్ సత్తాపార్టీ ని 2006లో ఏర్పాటు చేశారని లోక్ సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. పార్టీ 18 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విజయనగరంలో జెండాను ఎగురవేశారు. ముందుగా మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకి పూల మాలలు వేసి నివాళులర్పించారు, ఈ సందర్భంగా మహిళా సత్తా రాష్ట్ర ప్రతినిధి రాయి పద్మావతిని ఘనంగా సన్మానించారు, కార్యక్రమంలో పార్టీ నాయకులు,నాగభూషణం, రాజారావు,పి.ఎల్.ఎన్.రాజు,నాయుడు,అప్పారావు, రమేష్,పద్మావతి, లక్ష్మణ్,రవితేజ,సుధీర్,గోపీ,భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజల మంచి కోరేవారు అలాంటి విమర్శలు చేయరు

హైదరాబాద్‌లో జనం రద్దీ ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో మెట్రో రైలుని విస్తరించాలని, అదే సమయంలో జనం లేని ఔటర్‌రింగ్ రోడ్డు చుట్టూ మెట్రో వల్ల ప్రజాధనానికి నష్టం వాటిల్లుతుందని, ఔటర్‌లోకి రవాణా సదుపాయం కావాలనుకుంటే కాలుష్యం లేకుండా ఎన్ని కావాలంటే అన్ని ఏసీ, ఎలక్ట్రిక్ బస్సుల్ని నడపొచ్చని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చెబితే, వాస్తవాలు తెలుసుకోకుండా, ప్రజాప్రయోజనాలు ఆలోచించకుండా కొందరు సోషల్ మీడియాలో నిందించటాన్ని ఖండిస్తున్నామని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర శ్రీనివాస వర్మ అన్నారు. నిజంగా తెలంగాణ ప్రజల మేలుకోరేవారు, బిడ్డల భవిష్యత్తు గురించి ఆలోచించేవారు అలా అవాకులు చెవాకులు మాట్లాడరన్నారు. కేసీఆర్ చేసిన మంచి పనుల్ని అనేక సందర్భాల్లో ఎటువంటి భేషజాలు లేకుండా జేపీ అభినందించారని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ప్రజాధనం దుర్వినియోగమవుతుందని, దాని బదులు అదే డబ్బును మరో రూపంలో ఖర్చు చేసి తెలంగాణ రైతులు, యువతకు మేలు చేయాలని జేపీ చెప్పిన తొలి నుంచి చెప్పిన మాట వాస్తవమని ఈవేళ గణాంకాలు రుజువు చేస్తున్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయంపై ఇప్పుడేం చేయలేం కాబట్టి, కనీసం ఆ ప్రాజెక్టును ఎలా సద్వినియోగం చేసుకోవాలో ఆలోచించాలని జేపీ ఎంతో విజ్ఞతతో సలహాలిస్తుంటే, ఆ దిశగా సమీక్ష చేయకుండా విమర్శలు చేయటం తగదన్నారు. ప్రజాజీవితంలో, విధానాల రూపకల్పనలో యాభై ఏళ్ల అసాధారణ కృషి, ట్రాక్ రికార్డు ఉన్న జేపీ మెట్రో రైలును సిటీలో ఆహ్వానిస్తూ ఔటర్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా మాత్రం ఎందుకు వద్దంటున్నారో వాస్తవాల ఆధారంగా తెలుసుకుని మాట్లాడాలన్నారు.

స్వతంత్ర భారతం - భవిష్యత్ భారతం..

# ప్రభుత్వ పాలన

భారత 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వతంత్ర భారతం - భవిష్యత్ భారతంపై ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) కార్యాలయంలో జరిగిన ప్రత్యేక ఇంటర్వ్యూ చర్చా కార్యక్రమంలో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, రిటైర్డ్ ఐపీఎస్, బహుజన్ సమాజ్‌పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. చర్చకు మెయిన్‌థీమ్ భారతదేశ నిర్మాణం. డిస్కషన్‌ని మూడు భాగాలుగా సెగ్మెంట్ చేశారు. ప్రతి సెగ్మెంట్‌కి ఒక సబ్ థీమ్. ఈ మూడు విభాగాల చర్చలోని అంశాల్ని స్థూలంగా ఒక్కో సంచికలో ఒకటి చొప్పున జనబలంలో వరుసగా ప్రచురిస్తున్నాం. ఈ రెండవ భాగంలోని చర్చాంశం ప్రభుత్వ పాలన. ఎఫ్‌డీఆర్ యువ రీసెర్చర్ సుమేధ ఇంటర్వ్యూ కార్యక్రమాన్ని నిర్వహించారు..




**ప్రశ్న: పార్టీలు, నేతలు ఎన్నికవటానికి పడే తంటాలు ఒక ఎత్తయితే, ఒకసారి ఎన్నికై ప్రభుత్వం ఏర్పడ్డాక పరిపాలన ఇంకో ఎత్తు. పాలనలో సివిల్ సర్వీస్, అధికార యంత్రాంగం ఎంత కీలకమో మా అందరికన్నా మీ ఇద్దరికీ ఇంకా ఎక్కువ తెలుసు. సర్, మీ అభిప్రాయంలో స్వతంత్రం నుంచి ఇప్పటి వరకు మన భారతదేశ నిర్మాణంలో బ్యూరోక్రసీ తన పాత్ర ఎంతవరకు నిర్వహించింది?**

**ఆర్ఎస్‌పీ:** చాలా గొప్పగా నిర్వహించింది. లేకపోతే ఈ దేశం ఎప్పుడో ముక్కలుచెక్కలైపోయి సివిల్‌వార్ వచ్చుండేది. బ్యూరోక్రసీ లేకపోతే ఈ దేశంలో చాలా దారుణాలు జరిగుండేవి. అట్లని బ్యూరోక్రసీ గొప్పగా పనిచేసిందా అంటే, బ్యూరోక్రసీ తను చెయ్యాల్సిందంతా చేసేసిందని చెప్పను. బ్యూరోక్రసీ లేకపోతే ఇయ్యాల నేను లేను. నేను ఈరోజు ఈ స్థితిలో ఉండేవాడ్ని కాదు. అంటే, రాజకీయ పార్టీల నాయకులకు ఎన్ని ప్రయారిటీలు ఉన్నా, లేకపోతే, వాళ్ల లోపల ఎన్ని ఆశయాలు ఉన్నా కూడా వాటికి ఆచరణరూపమిచ్చేది బ్యూరోక్రసీ. ఆచరణరూపమివ్వటమే కాకుండా అందుకోసం రాత్రింబవళ్లూ కష్టపడి పనిచేసేది బ్యూరోక్రసీ. క్రెడిట్ రాజకీయ నాయకులు తీసుకుంటే తీసుకోనివ్వండి. కానీ బ్యూరోక్రసీ ఈ దేశంలో అలా పనిచేయకపోయుంటే నేను ఇక్కడ లేను. ఉదాహరణకి ఎస్ఆర్ శంకరన్, పీఎస్ కృష్ణన్ గారు. తెలుగు రాష్ట్రాల గురించి చెప్పుకుంటే. ఆ రోజుల్లో వాళ్లు తమ కుటుంబాలను వదిలి పనిచేశారు. శంకరన్ గారయితే పెళ్లి కూడా చేసుకోలేదు. ఏం చేసినా వాళ్లు తమ కుటుంబాలను వదిలేసి, ఏ పేద ప్రజల గురించైతే ఆ రోజు స్వాతంత్ర్య పోరాటంలో మాట్లాడటం జరిగిందో, ఏ పేద ప్రజల గురించైతే రాజ్యాంగంలో రకరకాల హక్కులు పొందుపరచబడ్డాయో, వాటిని నిజంగా ఒక చట్టంలో పెట్టటంగానీ, లేకపోతే వాటికి గవర్నమెంట్ ఆర్డర్స్ ఇవ్వటంగానీ

చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేసే నైపుణ్యం, ఆ సామర్థ్యాన్ని తీసుకురావటంలో పరిపాలనలో బ్యూరోక్రసీ దేశంలో గొప్ప కృషి చేసింది. అయితే ఇంకా బాగా చేయల్సుండె. ఆ లోటు వల్లే మన లోపల ఇంత నిరాశ గూడుకట్టుకుని ఉంది. కానీ బ్యూరోక్రసీ కూడా వాటర్ లాంటిది. ద్రవాన్ని ఒక క్యూబ్‌లాంటి కంటైనర్‌లో పోస్తే క్యూబ్ ఆకారం తీసుకుంటుంది. సిలిండర్ లాంటి కంటైనర్‌లో పోస్తే సిలిండర్ షేప్ తీసుకుంటుంది. బ్యూరోక్రసీ కూడా అంతే. ఉదాహరణకు ఎన్‌డీయే ప్రభుత్వంలో ప్రాధాన్యతలు ఒకలా ఉంటాయి. యూపీఏ గవర్నమెంట్‌లో ఇంకోలా ఉంటాయి. కాబట్టి ఎన్‌డీయే గవర్నమెంట్‌లో బ్యూరోక్రసీ ఆ ప్రయారిటీస్‌కి అనుగుణంగా పనిచేస్తుంది. కొంతమంది బ్యూరోక్రాట్లు, వాళ్ల కండిషన్ బలంగా ఉన్న బ్యూరోక్రాట్లు, వ్యవస్థతో యుద్ధం చేస్తారు. దీనివల్ల వాళ్లకు తాత్కాలికంగా గ్రహణం పట్టవచ్చు. కొంతమంది బ్యూరోక్రాట్లు సామర్థ్యాన్ని తమ పనితీరుతో సాధించుకుంటారు. వీళ్ల తిరోగమన, కరడుగట్టిన సాంప్రదాయ రాజకీయనేతలను కూడా ఒప్పించి లక్ష్యాలను నెరవేరుస్తారు. అట్లాంటి బ్యూరోక్రాట్లు ఉన్నందుకే ఈ దేశంలో ఇంకా పేద ప్రజలకు కొంత ఆశ ఉంది ప్రభుత్వం పట్ల. కానీ దురదృష్టవశాత్తు వాళ్ల సంఖ్య తగ్గిపోతోంది. అది నాకెంతో విచారం కలిగిస్తుంటుంది.

**ప్రశ్న: బ్యూరోక్రసీ వాళ్లు డెలివర్ చేయగలిగినంత స్థాయిలో చేయలేకపోవటానికి కారణం రాజకీయ ఒత్తిడి అనే భావన చాలా గట్టిగా ఉంది. దాన్ని మీరు ఎంతవరకు సమర్థిస్తారు?**

**జేపీ:** ప్రవీణ్‌తో నేను స్థూలంగా ఏకీభవిస్తాను. ఎందుకంటే, దేశ ఐక్యతను కాపాడటం గానీ, కనీసం ఆ స్టీల్ ఫ్రేమ్‌ను నిలబెట్టటం, స్ట్రక్చర్ నిలబెట్టటంగానీ బ్యూరోక్రసీ చేసింది. లేకపోతే అసలు ఎన్నికలు జరగటమే సాధ్యమయ్యేది కాదు. ఇంత దేశంలో ఇంత ప్రశాంతంగా మొత్తం మీద ఎన్నికలు జరుగుతున్నాయి, వెనకాల ఎన్ని అవకతవకలు ఉన్నా కూడా ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయి, అధికారం ప్రశాంతంగా మారుతోంది. ఒక స్థిరత్వం వ్యవస్థలో ఉందంటే కేవలం బ్యూరోక్రసీ వల్లే. కానీ బ్యూరోక్రసీలో అందరూ శంకరన్‌లు కాదు, అందరూ ప్రవీణ్‌లు కాదు. అత్యధికులు రాజును మించిన రాజభక్తి చూపెట్టేవాళ్లు. వ్యక్తుల పొరపాటు కాదు. మీరడిగిన ప్రశ్నకి సమాధానం మనం సరైన ప్రోత్సాహకాల ఏర్పాటు చేయకపోవటంలో ఉంది. రిక్రూట్‌మెంట్ సమయంలో మనకు అత్యుత్తమ ప్రతిభ గలవారు వస్తున్నారు. దేశంలో కచ్చితంగా లక్షలమంది పోటీపడుతున్నారు. ముఖ్యంగా జాతీయస్థాయిలో బ్యూరోక్రసీని మనం చాలా అభినందించాలి. యూపీఎస్సీ నా దృష్టిలో జనం దృష్టికి రాని హీరో. పెద్దగా దాని గురించి ఎవరూ మాట్లాడుకోం. పదవులంటే ఇంతగా డిమాండ్ ఉన్న దేశంలో, ఇంత పలుకుబడి ఉపయోగించే దేశంలో యూపీఎస్సీ గనక పక్షపాతాలు, లంచాలకు లొంగినట్లయితే ఈ దేశం ఏమైపోయేది? కానీ ఇప్పటిదాకా నిజంగా గట్టి ఫిర్యాదులు, అట్లాంటివేమీ లేవు. క్రమబద్ధంగా ఈ దేశంలో సీనియర్ బ్యూరోక్రసీని చాలా మంచి ప్రమాణాలతో ఎంపిక చేస్తున్నారు. దాన్లో అనుమానం లేదు. ఏ ఎంపికలోనైనా కొన్ని పొరపాట్లు దొర్లొచ్చు, అది యాదృచ్ఛికం. కానీ చేరాక ఏమవుతోంది- 1) గుత్తాధిపత్యం. దేశంలో అద్భుతమైనవాళ్లేగానీ ప్రతి పదవికీ వీళ్లే అనగానే, పోటీ ఎప్పుడైతే లేకుండా పోయిందో ఎలాంటి వ్యవస్థయినా కూడా ఒక ఫ్యూడల్ ప్రభుత్వం లాగా, పూజారుల ప్రభుత్వంలాగా అయిపోతుంది. అంతర్ముఖత్వం, గిరిగీసుకుని పనిచేయటంగా తయారవుతుంది. ప్రజల గురించి, సమాజం గురించి ఆలోచన ఉండదు. వ్యక్తులు కొంతమంది నిబద్ధంగా పనిచేసేవారుంటారు. వాళ్లు నైతికంగా ఎదిగినవారు. వాళ్లకు రూల్స్, చట్టాలు అక్కర్లా. అది వాళ్ల మానసిక స్థాయి. కానీ వ్యవస్థగా పనిచేయరు. కాబట్టి మొట్టమొదట గుత్తాధిపత్యం ఇచ్చాం. అది పెద్ద తప్పు. పోటీపడితే వాళ్లే, ఆ ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లే వస్తారు. ఎందుకంటే అనుభవం ఉన్నవాళ్లు వాళ్లే. కానీ పోటీ ఉంటే రాణించే తీరు వేరు, పోటీ లేకపోతే, అంతా నాకే అనుకుంటే వాళ్ల పద్ధతి వేరు. 2) ముఖ్యంగా ఐఏఎస్‌లో స్పెషలైజేషన్ లేకుండాపోయింది. ఇవాళ బ్యాంకింగ్ సెక్రటరీ, రేపు ఎడ్యుకేషన్ సెక్రటరీ, ఎల్లుండి హెల్త్ సెక్రటరీ, ఆ తర్వాత హోం సెక్రటరీ. ప్రపంచంలో ఏ మనిషీ, ఐన్‌స్టీన్‌తో సహా అంత నిష్ణాతులు కాలేరు. జాబ్‌లోకి వెళ్లి నేర్చుకుంటానంటే సమాజానికి హాని చేస్తారు. కాబట్టి స్పెషలైజేషన్ కెరీర్‌లో కొన్నేళ్లు పోయిన తర్వాతయినా ఉండాలి. మీరు కొన్ని రంగాలలో ఎంపిక చేసుకుని దాన్లో నిష్ణాతులు కండి. ప్రతిభ ఉన్నవాళ్లు, ప్రజల్లో బోలెడంత అనుభవం ఉన్నవాళ్లు అద్భుతంగా దాన్లో చేయండి. ప్రపంచంలో ఎక్కడా లేదు ఇలాంటిది, మన భారతీయ ఉప ఖండంలోనే ఈ పరిస్థితి. బ్రిటన్‌లో లేదు, ఆస్ట్రేలియాలో లేదు, న్యూజిలాండ్‌లో లేదు, అమెరికాలో లేదు. ఎక్కడా లేదు ఇక్కడే. 3) జీవన భద్రత. వాడు అడ్డగాడిదైనా, అత్యంత సమర్థుడైనా కచ్చితంగా హాయిగా 60 ఏళ్లకు రిటైరవుతాడు ప్రమోషన్ తీసుకుని. ఇంక పనేం చేస్తారు? కాబట్టి ప్రతి అయిదేళ్ల తర్వాత సమీక్ష చేయటం. అవమానించనక్కర్లా, గౌరవంగా ఇంటికి పంపించేయండి. అవినీతి ఉండొచ్చు, అసమర్థత ఉండొచ్చు, పెద్ద ఫలితాలు తీసుకొచ్చే శక్తి లేకపోయుండొచ్చు, వేరే పని చూసుకుంటారు. మార్పు వస్తే తర్వాత చూడొచ్చు. ఈ మూడు పనులూ చేస్తే అద్భుతమైన ఫలితాల్ని బ్యూరోక్రసీ ఇస్తుంది. శక్తి ఉంది. పూర్వం కంటే ఇవాళ వస్తున్న సివిల్ సర్వీసెస్ అధికారులు మరింత నైపుణ్యం ఉన్నవారు. ఎందుకంటే గొప్ప టెక్నాలజీ నైపుణ్యం ఉంది, ఇంజినీర్లు, కొంతమంది డాక్టర్లు వస్తున్నారు. ఏ రంగంలో ఉన్నా కూడా సాంకేతికంగా వాళ్లు చాలా వృత్తినైపుణ్యం ఉన్నవాళ్లు, చాలా చురుకైనవాళ్లు. ప్రతిభ

ఉన్నది, సామర్థ్యం ఉన్నది. కానీ అందరిలోనూ వికసించటంలా, కొందరిలోనే వికసిస్తున్నది.

**ప్రశ్న: సర్, ప్రభుత్వానికి ఎక్కడైనా మొట్టమొదటి బాధ్యత శాంతిభద్రతలు, ప్రజల ఆస్తుల్ని కాపాడటం. కానీ ఈమధ్యకాలంలో ప్రభుత్వాలే చట్టబద్ధపాలనని ఉల్లంఘించటం చూస్తున్నాం. కాబట్టి మన లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజన్సీలు.. అధికారం, డబ్బు, పలుకుబడి ఉన్నవాళ్ల కోసమే కాకుండా సామాన్య ప్రజల కోసం కూడా పనిచేయాలంటే మార్పు ఎక్కడ మొదలవ్వాలి?**

**ఆర్ఎస్‌పీ:** మార్పు బ్యూరోక్రసీ దగ్గరనే రావాలి. రాజ్యాంగంలోని 312 అధికరణం మొత్తం అన్ని సేఫ్‌గార్డ్స్ ఇచ్చింది బ్యూరోక్రసీకి. రక్షణ కవచంలాగా రాజ్యాంగం ఉంది. బ్యూరోక్రాట్‌ని తీసేయటం అంత ఈజీ కాదు. ఒక చిన్న వ్యక్తిని సస్పెండ్ చేసినట్లుగా కాదు. కాంట్రాక్చువల్ ఉద్యోగి కాదు. చాలా జాగ్రత్తగా అన్ని రక్షణలతో ఇచ్చిన ఉద్యోగం. మార్పు వాళ్ల దగ్గర్నుంచే రావాలి. అందుకొరకే సివిల్స్‌లో ఇంత కాచి వడపోసి 10 లక్షల మంది రాసిన ఎగ్జామ్‌లో వెయ్యిమందిని తీసుకున్నారు. అది క్రిటికల్ మాస్ ఈ దేశంలో. ఈ వెయ్యిమందికి కూడా ఆ ధైర్యం లేకపోతే, ఆ క్రిటికల్ మాస్‌కే ఈ ధైర్యం లేకపోతే ఇంకెక్కడి నుంచి వస్తుంది? కాబట్టి నువ్వు పేద ప్రజల జీవితాలను కూడా రక్షించాలంటే.. అసలు నీకు జీతమిస్తున్నదెవరు? అనే సోయి ఉండాలి. ఈ మాట నేను చాలా స్పీచెస్‌లో చెప్పాను. సర్వీసులో ఉన్నప్పుడు కూడా చెప్పాను. నేను నా ఆఫీస్ ముందు ఒక బోర్డు పెట్టాను. ఏమని పెట్టానంటే– సోషల్ వెల్ఫేర్ ఆఫీస్‌కి వెళ్లిన వెంటనే ఈ బోర్డు కనిపిస్తుంది. 'దయచేసి ఈ ఆఫీస్‌లోకి వచ్చినవాళ్లు చెప్పులు వేసుకుని రండి. ఇది మొట్టమొదటిది. రెండు, ఏడవకండి. మూడు, కాళ్లు మొక్కకండి. నాలుగు, ఆత్మగౌరవంతో కూర్చుని మీ సమస్య విన్నవించండి. నాకు చేతనైతే చేస్తా, లేకపోతే లేదు'. కాబట్టి, నేను అక్కడ ఏం చెప్పాలనుకుంటున్నాను– నువ్వు నాకు యజమానివి. నువ్వే నాకు జీతమిస్తున్నావు. నీ సమస్య పరిష్కరించటానికి ప్రయత్నిస్తాను. ఎందుకంటే నీకు ఆ హక్కు ఉంది. నీ సమస్య సరైనదయితే, మీకు న్యాయం జరగాలి, మీకు పరిష్కారం లభించాలి. కానీ ఈ ఆలోచనా ధోరణి రావటం లేదు. నాకు బందోబస్తులో ఎప్పుడూ కూడా పేదవాళ్ల విషయంలో పోలీసుగా పెద్ద గందరగోళం ఉండేది. నేను ఈ ప్రజాపీడకులకు బందోబస్తు ఇస్తూ ఈ పేద ప్రజల నుంచి రక్షిస్తున్నానా, లేకపోతే పేద ప్రజలను ఈ పీడకుల నుంచి రక్షిస్తున్నానా? అనే నైతిక డైలమా నాకు చాలాసార్లు వచ్చేది. నేను క్రైం బ్రాంచిలో డీసీపీగా ఉన్నప్పుడు 100 కోట్ల స్కామ్ చేసిన ఒక వ్యక్తిని అరెస్ట్ కార్డు ఇష్యూ చేసి తీసుకొచ్చి లాకప్‌లో కూర్చోబెట్టా. ఆయన పేరు చెప్పను, ఒక పెద్ద బిగ్‌షాట్. నాకు వెంటనే ముఖ్యమంత్రి ఆఫీస్ నుంచి ఫోన్ వచ్చింది. అతన్ని రిలీజ్ చేయండి అన్నారు. నేనన్నా– చట్టబద్ధంగా సీఆర్‌పీసీ ప్రకారం నేను అరెస్ట్ చేసిన తర్వాత మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తా తప్ప వదిలిపెట్టలేను అన్నా. ఏమనుకున్నారో ఏమో, కమిషనర్ గారితో ఫోన్ చేయించి మెమో ప్రశ్నలు అడిగించారు. అది చేశావ్, ఇది చేశావ్, ఎట్లా చేశావ్ అంటూ హడావుడి చేశారు. కేస్ ఫైలయింది అని నేను తేల్చి చెప్పా. కాబట్టి ఒక ముఖ్యమంత్రి, లేకుంటే సీఎంఓలో పనిచేసే అధికారి నాకు ఏం చెప్పాలి– 'చాలా బాగా చేశావ్, ముగ్గురు నలుగురు డీసీపీలు వేలాదిమంది డిపాజిట్‌దారుల ప్రయోజనాలను కాపాడలేకపోయారు. వాళ్లు పోయిన ప్రతిసారి కూడా వాళ్లు ఇదే పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో అరెస్టు చేశారు. కానీ ఇయ్యాల నువ్వు చాలా మంచి పని చేశావ్, వాడు ఎట్లయినా వాళ్లకు డిపాజిట్లు రీ పే చేస్తాడు' అని అభినందించాలి. అది చెయ్యలేదు. నాకు అప్పుడప్పుడూ డౌటు వస్తది. అత్యంత అవినీతిపరుడైన పొలిటీషియన్ వస్తాడు. వాడి అనుచరుడు భూమి కబ్జా చేస్తాడు. నేను పోలీస్ ఆఫీసర్‌గా వాళ్లకు బందోబస్తు ఇవ్వాలి. ఆ ప్రజల్ని చూస్తేనే బాధనిపిస్తుంది. నాకు మిగతావాళ్ల కంటే ఎక్కువ బాధ ఉంటుంది. ఎందుకంటే, నేను కూడా అదే సమాజం నుంచి వచ్చాను. రాత్రి నేను బడంగ్‌పేట్‌లో గం॥ 9.30 వరకు ధర్నాలో కూర్చున్నా. ఆ పారిశుద్ధ్య కార్మికులు, రైతు కూలీలు, మహిళలు, ఇళ్లల్లో పనిచేస్తున్న మహిళలు గత 70–80 సంవత్సరాల నుంచి రకరకాల ప్రభుత్వాలిచ్చిన భూములను సేద్యం చేసుకుంటున్నారు. ఇప్పుడు హైదరాబాద్ మహానగరం అయిపోయింది కాబట్టి ఈ భూములకు విలువ పెరిగింది. విలువ పెరిగిన వెంటనే అక్కడుండే మంత్రిగారు, ఎమ్మెల్యేలు, చైర్మన్‌లు ఆ భూముల మీద కన్నేసి, ఇవన్నీ ప్రభుత్వ భూములు, ప్రజాప్రయోజనాలరీత్యా ఈ భూములన్నీ మేం తీసుకుంటున్నాం, పట్టాలు లేని, ప్రభుత్వం ఇచ్చిన భూములు కాబట్టి ప్రభుత్వానికి హక్కు ఉందని తీసేసుకున్నారు. తీసేసుకుని వాటిని ప్లాట్లు చేసి వాళ్ల అనుచరులకు ఇచ్చేసుకున్నారు. నలభై ఎకరాల భూమి ఉన్న ప్రజలు ఇయ్యాల 60 గజాల ఇళ్ల స్థలం మాకివ్వండి అని ఆ మినిస్టర్ గారి కాళ్ల మీద పడే పరిస్థితికి తీసుకొచ్చారు. నేను ఆ మంత్రి గారికి ఒక పోలీస్ ఆఫీసర్‌గా బందోబస్తు ఇస్తున్నానంటే, నా మనసులో ఏం తిరుగుతూ ఉంటది? ఈ వ్యక్తి వల్లనే వాళ్లందరూ రోడ్ల మీద పడ్డారు. ఇళ్లల్లో పనిచేసుకునే మహిళలు దుమ్ము ఉన్న ప్రాంతంలోకి వచ్చి ధర్నాలు చేస్తున్నారు 20 రోజుల నుంచి. నిజానికి ఆ మినిస్టర్ నుంచి వీళ్లను రక్షించాల్నా?, లేకపోతే వీళ్ల నుంచి మినిస్టర్‌ని రక్షించాల్నా? అనే నైతిక ప్రశ్న ఉంటుంది. అది ఎట్లొస్తుందంటే, మీకు ట్రైనింగ్‌లోగాని, మీ విద్యావ్యవస్థలోగానీ ఆ నైతిక విలువలు ఇంజెక్ట్ చేయటం, మీ సీనియర్లు మీకు మెంటారింగ్ చేయటం, తర్వాత వీటన్నిటి మీద ఒక చర్చ జరగటం జరిగితే వస్తుంది. నువ్వు ఈ దేశంలో నిజం వైపు పక్షపాతిగా ఉంటావా, అబద్ధం వైపు ఉంటావా, దోపిడీ వైపు ఉంటావా, లేకపోతే పీడితుల వైపు

ఉంటావా, ఏ వర్గ పక్షపాతిగా ఉంటావు, సామర్థ్యం వైపు ఉంటావా, సోమరితనం వైపు ఉంటావా, అవినీతి వైపు ఉంటావా, పారదర్శకత వైపు ఉంటావా? లేకపోతే దీర్ఘకాలం, పరివర్తన వైపు ఉంటావా, తాత్కాలికం, ఆర్భాటం వైపు ఉంటావా అన్నది.. మోరల్ కోడ్ నిర్ణయిస్తుంది. అందుకని అంత ఈజీ కాదు. సివిల్ సర్వీసెస్‌కి కూడా ఇంటర్వ్యూ ప్రశ్నలు ఫేక్ చేయటం, గేమ్ ద సిస్టమ్ పెద్ద కష్టం కాదు. కానీ ఈ నైతిక శక్తి వ్యక్తి నుంచి రావాలి. అట్లాంటి వాళ్ల సంఖ్య ఒకోసారి తక్కువగా ఉంటుంది, ఒకోసారి ఎక్కువగా ఉంటుంది. అదో సైకిల్. నాకు ఇప్పటికి కూడా ఒక కన్ఫ్యూజన్.. వాళ్లు భూముల కబ్జా దారులు, వీళ్లు రోడ్ల మీద పడుతున్నారు, కబ్జాదారులు మళ్లీ మంత్రులవుతున్నారు, నేను వీళ్లకు బందోబస్తు ఇవ్వాలి అని. బందోబస్తు ఇవ్వాలి, అది నా డ్యూటీ. కానీ మోరల్‌గా ఆ ప్రశ్న ఉంది. అయితే చట్టంలో చాలా స్పేస్ ఉంటుంది. నిజంగా ఒక ఆఫీసర్ చేయాలనుకుంటే చాలా చేయొచ్చు. నేను పీఎస్ కృష్ణన్ గారు రాసిన బుక్ చదివా. చాలా గొప్ప బుక్, అందరు సివిల్ సర్వెంట్లు చదవాలి. సామాజిక న్యాయం కోసం బెండింగ్ ద గవర్నెన్స్. కృష్ణన్ గారు చనిపోయేముందు జర్నలిస్టుకిచ్చిన లాంగ్ ఇంటర్వ్యూ అది, పెద్ద బుక్‌గా వచ్చింది. ఆస్కీ వాళ్లు రిలీజ్ చేశారు. అంటే, బ్యూరోక్రసీలోగానీ, రాజకీయాల్లోగానీ, నిబంధనలు, చట్టం కంటే నీ సంకల్పం ఎంతో ముఖ్యం. నీ గుండెలో నీకు ప్రజలకు ఏం చేయాలని ఉంది? ఆ సంకల్పం ఉంటే రూల్స్‌ని మలచవచ్చన్నది నేను సోషల్ వెల్ఫేర్‌లో నిరూపించాను, పోలీసు శాఖలో కూడా నిరూపించాను. నీ గుండెలో వాళ్లకి న్యాయం చేయాలని ఉండాలి. వాళ్లను ఎలివేట్ చేయాలి పేదరికం నుంచి అనుకుంటే, ఆటోమేటిక్‌గా రూల్స్ అన్నీ అందుకు అవసరమైనట్లు మలచవచ్చు. పరిపాలన అనేది నీ సంకల్పం, అందుకవసరమైన రీతిలో మలచగలగటంలో ఉంటుంది. నువ్వు సంపన్నులకనుగుణంగా రూల్‌ని నిర్వచిస్తే, డబ్బున్నవాళ్లకు ఉపయోగపడగలవు. అదే రూల్‌ని పేదల కోణం నుంచి నిర్వచిస్తే, నువ్వు లక్షల మంది పేదల జీవితాల్ని మార్చి అద్భుతాల్ని సృష్టించగలవు. ఇదే నేను చెప్పదలచుకున్నది. సర్, మీరు ప్రభుత్వంలో ఈ 26 సంవత్సరాల సర్వీసులో నేర్చుకున్నది ఏమిటి అనడిగితే – నీ ఉద్దేశంలో ఏం కావాలనుకుంటున్నావు, ఏం చేయాలనుకుంటున్నావు? మీకు సంకల్పం ఉండాలేగానీ, మీరు ప్రజలకు ఏదైనా చేయాలనుకుంటే, అందుకు మార్గం కచ్చితంగా కనిపిస్తుంది.. అని చెబుతాను.

**జేపీ:** ప్రవీణ్‌తో ఇంత దగ్గరగా కూర్చుని లోతుగా చర్చించటం వల్ల తన మనసు ఇంకా బాగా అర్థమవుతోంది. నాకు అర్థమైందేమంటే, మనిషి నైతిక విలువల మీద ప్రవీణ్ ఆధారపడుతున్నారు. అది గాంధీ గారి తత్వం. చాలా గొప్పది. నైతిక విలువలుండి ఉద్దేశాలు బాగుంటే సమస్య లేదసలు. అలా లేని వాడ్ని ఏం చేద్దాం? సరైన సంకల్పం ఉన్నవాళ్లు నూటికి పదిమందేనే! పది మంది కూడా లేరే. కాబట్టి నాది అంబేద్కర్ తత్వం ఆ విషయంలో. అంబేద్కర్ వ్యవస్థని నమ్మారు. మనిషి నైతికత మీద, ఆ పునాదుల మీద నిర్మాణం చేసే ప్రయత్నం చేయలా. వ్యవస్థను నమ్మాడాయన. వ్యవస్థ ఏంటి? ఉదాహరణకి, ప్రపంచమంతా కూడా పోలీసులు అద్భుత నైతిక శక్తి ఉన్నవాళ్లని నేననుకోను. కానీ వాళ్ల ప్రవర్తన ఇట్లా లేదు. ఎందుకని? ఒక పక్కన వాళ్లను రాజకీయం నుంచి వేరు చేసి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించారు. రెండోపక్కన, జవాబుదారీతనం కోసం ఏర్పాట్లు చేశారు. ఇటు స్వతంత్రంగా పనిచేసే అవకాశం ఉంది, లొంగాల్సిన అవసరం లేదు పక్షపాతానికి, అలాగే ఇష్టమొచ్చినట్లుగా సొంత ఆలోచనలు ఉపయోగించే అవకాశం లేకుండా జవాబుదారీతనం. చాలా సంక్లిష్టమైన ఏర్పాట్లు కావాలి. అవి చేయకుండా, కేవలం నైతిక ప్రవర్తనతోనే అధికారులంతా న్యాయాన్ని అందించగలరు, చట్టబద్ధపాలన పాలన అమలు చేయగలరు అనేది నాకు సాధ్యంగా కనిపించటంలా. ఎందుకంటే కొందరు అధికారులు ఆ ప్రయత్నం చేసినా పైనున్నవాడు మిమ్మల్ని పడనివ్వడే! మర్నాడు శంకరిగిరి మాన్యాలు పట్టిస్తాడు. మీరు హీరోగా బయటికెళ్తారు తప్ప, దాని వల్ల న్యాయం జరగదు. మీ తర్వాత జీహుజూర్ అనేవాడ్ని ఇంకొకడ్ని వేసుకుంటాడు, అలా వచ్చినవాడేం చేస్తాడో మనకు తెలుసు. కాబట్టి మన దేశంలో మనం చేసిన పెద్ద తప్పేంటంటే, కాగితం మీద మీకు చట్టబద్ధపాలన ఉన్నా కూడా, వాస్తవానికి బడితె ఉన్నవాడిదే బర్రె అనే వ్యవస్థ నిర్మాణం చేశాం. బడితె ఉన్నవాడిది బర్రె కాకుండా చట్టం అందరికీ సమానంగా వర్తించాలి అంటే, పోలీసు యంత్రాంగం, ప్రాసిక్యూషన్ వరకు స్వతంత్ర ప్రతిపత్తి, జవాబుదారీతనం, రాజకీయం నీడన ఉండాల్సిన అవసరం లేకుండా సమన్యాయం సాధించాలి. సంక్లిష్టమైన ఏర్పాట్లున్నాయి. పరిపాలనా సంస్కరణల సంఘం లో ఈ నివేదిక మొత్తం నేను రాశా. ఏ రకంగా స్ట్రక్చర్ చేయాలని అందులో సవివరంగా ఉంది. అది సాధ్యం. మనసుంటే కష్టం కాదు. అంచేత ఆ ఏర్పాట్లు చేయాలి. సంకల్పానికి ప్రత్యామ్నాయం లేదు. సంకల్పం అవసరం, నీతి అవసరం, సామర్థ్యం అవసరం. కానీ ఎలాంటివాడైనా కూడా కేవలం వ్యక్తిగత సంకల్పం మీద ఆధారపడినట్లయితే సమాజం చాలా ప్రమాదంలో పడుతుంది. అంచేత వ్యవస్థను గనక బలంగా నిర్మాణం చేసినట్లయితే, జవాబుదారీతనం ఒక పక్కన, ప్రోత్సాహకాల ఏర్పాటు మార్చటం మరోపక్కన చేసినట్లయితే, అప్పుడు దేశాన్ని కాపాడుకోగలం. ప్రపంచంలో చట్టబద్ధపాలన ఉన్న అన్ని దేశాల్లో ఈ పనులు చేశారు. లేకపోతే బడితె ఉన్నాక, ఎవరైనా కూడా అధికారాన్ని దుర్వినియోగం చేసే ప్రయత్నం చేస్తాడు. అది మానవ సహజం. అది లేకుండా కాపాడుకోవటం వ్యవస్థీకృత లక్ష్యం.




# మన దేశంలో ఆలోచనల్లో పదును తగ్గింది

ఆలోచనల్లో బలం లేకపోవటం వల్లే ఈవేళ మన రాజకీయాల్లో పరుష పదజాలం, తిట్లు, శాపనార్థాలకి పాల్పడటం పెరుగుతోంది. బలమైన ఆలోచనలుంటే, మీరు వాస్తవాలు, తర్కం ఆధారంగా హేతుబద్ధంగా వాదనను వినిపిస్తూ ఎక్కడ ఏ రంగంలో ఏం జరుగుతోందో ఆ అనుభవాన్ని జోడించి పరిష్కారం చూపుతారు. అప్పుడు మీ నోటి నుంచి బూతులు రానక్కర్లా. మన దేశంలో ఆలోచనల్లో పదును తగ్గింది, దేశమంతా మాటలు దారుణంగా ఉంటున్నాయి. దీంతోపాటు భారతదేశంలో చట్టబద్ధపాలన లేదు. బడితె ఉన్నవాడిదే బర్రె. ఆశ్రిత పక్షపాతం చూపటం, ప్రత్యర్థుల మీద దాడులు చేయించటం కచ్చితంగా ఉంది. సెలెక్టివ్ ప్రాసిక్యూషన్ అన్ని చోట్లా ఉంది, ఇప్పటిదాకా ఉంది, ఇప్పుడూ ఉంది. చట్టబద్ధపాలన 98% రాష్ట్రాల్లో ఉంటుంది. కేసీఆర్ కావచ్చు, జగన్ కావచ్చు తమకు నచ్చకపోతే కేసులు బనాయిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇది మరీ విపరీతస్థాయికి చేరింది. ఢిల్లీ చేతుల్లో ఐటీ, ఈడీ, సీబీఐ వంటివి ఉన్నాయి. మోదీ మరింత సమర్థంగా ఈ పని చేస్తున్నట్లు కనిపిస్తోంది. కానీ అసలైన విషయమేమంటే, బాధితులమని ఆక్రోశిస్తున్న ప్రతిపక్షాలు కూడా.. ఇదిలా ఉండకూడదు, మేం అధికారంలోకి వస్తే చట్టబద్ధపాలన బాగుచేస్తాం అనటం లేదు. మేం అధికారంలోకి వస్తే తడాఖా చూపిస్తాం, మీ మీద ప్రతీకారం తీర్చుకుంటాం అంటున్నారు. ఇప్పుడు ఏపీలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును రాజకీయ కక్షతో వేధిస్తున్నారని ఆవేశపడుతున్నవాళ్లు కూడా ఎలా అధికారంలోకి రావాలి, దెబ్బకి దెబ్బ ఎలా తీయాలి అని చూస్తున్నారు తప్ప.. ఇక ముందు అన్యాయాలు జరగటానికి వీల్లేకుండా చట్టబద్ధపాలన బాగుచేస్తామనటం లేదు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రతిపక్షాల గొంతు నొక్కి అప్రజాస్వామికంగా వ్యవహరించిన తీరుపై ఆత్మవిమర్శ చేసుకోవటం లేదు. మన బహిరంగ చర్చల్లో ప్రమాణాలు పెంచటం, చట్టబద్ధపాలన సక్రమంగా అమలవటం గురించి ఆలోచించకుండా పార్టీలు, నాయకుల అధికార క్రీడే మన జీవితాల్లో ముఖ్యమనుకుంటున్నాం. అదీ సమస్య.

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,**
**ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు**

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th October, 2023 Posting Date 15 &16th of every month




# పల్లె పల్లెకు వైద్యం @ 100

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో ఆర్కె హాస్పిటల్ నడుపుతున్న డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ ఆశ్లేష దంపతులు గత తొమ్మిది సంవత్సరాలుగా 'పల్లె పల్లెకు వైద్యం' పేరు మీద నెలకు ఒక గ్రామంలో వైద్య ఆరోగ్య శిబిరాలతోపాటు న్యాయ సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు వంద గ్రామాలలో ఈ శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పల్లె పల్లెకు వైద్యంలో సేవలందించిన డాక్టర్లు, వైద్య సిబ్బంది, న్యాయవాదులు, న్యాయ సిబ్బంది, మీడియా ప్రతినిధులకు అభినందన సత్కార సభ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా, ప్రధాన వక్తగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు. విశిష్ట అతిథులుగా లోక్‌సత్తా ఉద్యమ సంస్థ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు, యదాద్రి భువనగిరి జిల్లా సమన్వయకర్త దిడ్డి బాలాజీ హాజరవగా, నిర్వాహకులు డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ ఆశ్లేష దంపతులతోపాటు భువనగిరి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు, వివేరా హాస్పిటల్స్ యజమాని వెంకటరెడ్డి, భువనగిరిలోని సీనియర్ సిటిజన్ డాక్టర్ రంగయ్య, భువనగిరి ఐఎంఏ ప్రెసిడెంట్ విజయ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు. శశికాంత్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**